www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 258
వెల (Price) : Rs. 6.50
మంగళవారం | 2-1-2024 | పేజీలు: 14

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి సా. 5.12 తదుపరి సప్తమి; నక్షత్రం: పుబ్బ ఉ. 11.43 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 7.50-9.38, దుర్ముహూర్తం: ఉ. 9.02-9.46, రా. 10.06-10.56; అమృతఘడియలు: తె. 6.39 మొదలు; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇవీ ప్రధాన లక్ష్యాలు

- ఇప్పటి వరకు అంతుచిక్కని కృష్ణబిలాల(బ్లాక్ హోల్స్)ను అర్థం చేసుకోవాలనేది ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రధాన లక్ష్యం.
- ఎక్స్‌రే ఫోటాన్లు, వాటి పోలరైజేషన్‌పై అధ్యయనం చేయడం ద్వారా కృష్ణ బిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల దగ్గర ఉన్న రేడియేషన్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకోనున్నారు.


నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ58

వణికిన జపాన్

కుదిపేసిన వరుస భూ ప్రకంపనలు

- ఆ దేశ పశ్చిమ తీరంలో 12కు పైనే!
- ఒకదాని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6 2
- పలుచోట్ల సునామీ హెచ్చరికలు జారీ
- ప్రజలు అప్రమత్తం.. ప్రాణ నష్టానికి చెక్


జపాన్‌లోని వజిమాలో భూకంపం ధాటికి చీలిన నేల

కొంగొత్త విజయం!

కొత్త ఏడాది తొలిరోజే ఇస్రో విజయ గీతిక

- కృష్ణ బిలాల 'చీకటి'పై పీఎస్ఎల్వీ-సీ58 ఫోకస్
- నింగిలోకి దూసుకుపోయిన ఎక్స్‌పోశాట్
- 22 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి చేరవేత
- తొలి ఎక్స్-రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రయోగం
- విద్యార్థినులు రూపొందించిన పేలోడ్లూ కక్ష్యలోకి
- 'ఫ్యుయెల్ సెల్'తో అంతరిక్ష కేంద్ర ఏర్పాటుపై తొలి అడుగు

సూళ్లూరుపేట/శ్రీహరికోట, జనవరి 1: కొత్త సంవత్సరం తొలి రోజే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సరికొత్త విజయాన్ని నమోదు చేసింది. అంతరిక్ష రహస్యం... అంతులేని గురుత్వాకర్షణ శక్తితో కాంతిని సైతం తనలోకి లాగేసుకునే కృష్ణ బిలాల గుట్టు విప్పే అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. దీని కోసం రూపొందించిన పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగం

మిగతా 2వ పేజీలో...

విపక్ష నేతగా!

"మీ అందరి చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం రాగానే నేను చేసే మొదటి పని మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడమే. ప్రస్తుత ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 2.3 లక్షల ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తాం. అంతేకాదు ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం" - 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్ హామీ

ముఖ్యమంత్రిగా!

"ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. జనవరి ఇకపై ఉద్యోగ పరీక్షల మాసంగా మారిపోతుంది. ఏటా తొలి నెల 1 నుంచి 31 వరకు పలు ఉద్యోగాల భర్తీకి పరీక్షలు జరుగుతాయి. ఈ ఏడాది జనవరి పోతే, మళ్లీ వచ్చే ఏడాది జనవరిలో ఇదే విధంగా ఉద్యోగాల భర్తీ జరుగుతుంది. ఎక్కడా ప్రభుత్వంలో ఖాళీలు లేకుండా చేస్తాం" -ఎన్నికల తర్వాత సీఎం హోదాలో జగన్ హామీ.

సర్వం రివర్స్!!

అటు ప్రతిపక్ష నేతగా, ఇటు సీఎంగా జాబ్ క్యాలెండర్‌పై హామీలు గుప్పించిన జగన్.. ఒక్క ఏడాది కూడా తన మాటను నిలబెట్టుకోలేదు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అని చేసిన ప్రకటనను ఐదేళ్లలో ఒక్కసారీ అమలుచేయలేదు. జగన్ చెప్పినట్లుగా ఒక ఏడాది జనవరి 1 పోతే మళ్లీ వచ్చే ఏడాది వస్తోంది అంతే తప్ప.. జాబ్ క్యాలెండర్ మాత్రం రాలేదు.

జనవరి 1.. జాబ్ క్యాలెండరేది

జగన్..?

ఏటా తొలి రోజే ఇస్తామన్న ప్రకటన గాలికి..

- ఒక్క ఏడాది కూడా రాని క్యాలెండర్
- 2.3 లక్షల ఉద్యోగాల భర్తీ ఎప్పుడు?
- ఐదేళ్లలో ఇచ్చింది 5 వేల ఉద్యోగాలే
- ఎన్నికల సమయంలో నోటిఫికేషన్లు
- ఉద్యోగాలొచ్చేది వచ్చే ప్రభుత్వంలోనే
- అడ్రస్ లేకుండా పోయిన డీఎస్సీ
- నిరుద్యోగులను నిండా ముంచిన జగన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాట తప్పను.. మడమ తిప్పను అంటూ అధికారం చేజిక్కించుకున్న సీఎం జగన్.. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నాక మాటా తప్పేశారు, మడమా తిప్పేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన జాబ్ క్యాలెండరు హామీని ఒక్క ఏడాది కూడా పట్టించుకున్న పాపానపోలేదు. ఎన్నికలకు ముందు, తర్వాత జగన్ చెప్పిన మాట ప్రకారం జనవరి 1న జాబ్ క్యాలెండర్ జారీ చేయాల్సి ఉంది. కానీ, ఈ ఏడాది ఎన్నికలకు ముందు జనవరి 1 వచ్చినా.. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ మాత్రం రాలేదు. పైగా ఈ విషయాన్ని మరిచిపోయినట్టే వ్యవహరించడం గమనార్హం. సీఎంగానీ, మంత్రులుగానీ



- పిల్లల కోసం దాచుకున్న డబ్బులూ ఇవ్వరా?
- జీవోలిచ్చినా చెల్లింపుల్లో చిత్తశుద్ధి ఏదీ?
- బకాయిలు మొత్తం చెల్లించాలి: బొప్పరాజు 12

జగనన్నా మాట మరిచావా?

- పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల ఆవేదన
- కాంట్రాక్టు జేఎల్స్ కంటే ఎక్కువ సీనియారిటీ
- వారితో సమానంగా బోధన విధులు
- అయినా కాంట్రాక్టు జేఎల్స్‌కే క్రమబద్ధీకరణ
- న్యాయం చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ
- ఇప్పుడు కుదరదన్న సలహాదారు సజ్జల
- కోర్టును ఆశ్రయించినా స్పందించని సర్కారు 11

యువతకేదీ హ్యాపీ న్యూ ఇయర్


సీఎస్, డీజీపీలతో కలిసి న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న సీఎం

జాబితాపై జంకు?

జగన్‌కు తిరుగుబాట్ల భయం!

- అందుకే అభ్యర్థులపై పునరాలోచన!!
- టీడీపీ-జనసేన ప్రకటించాకే విడుదల చేయాలని యోచన?
- అవనిగడ్డకు మోపిదేవి!
- రేపల్లె ఇన్‌చార్జిగా తప్పించినందుకు వైసీపీ కేడర్ నుంచి తీవ్ర నిరసనలు
- కల్యాణదుర్గానికి ఎంపీ రంగయ్య!
- గోదావరి, ఉత్తరాంధ్రలో చాలా మంది సిటింగ్‌లకు ఉద్వాసన?
- రాయలసీమలోనూ ఇంతే
- టికెట్లు దక్కనివారు షర్మిల రాకతో కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశం
- అందుకే జాబితా ప్రకటించకుండా జగన్ వెనకడుగు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌చార్జుల మలి జాబితాను ప్రకటించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భయపడుతున్నారా? ఏకంగా 50 మందికిపైగా సిట్టింగ్‌లకు టికెట్లు నిరాకరిస్తే తిరుగుబాటు మొదలవుతుందనే జంకుతున్నారా అనే సందేహాలు వైసీపీ శ్రేణులను తొలిచేస్తున్నాయి. తొలి విడతలో 11 మంది ఇన్‌చార్జులను మార్చినప్పుడే పెద్దఎత్తున తిరుగుబాటు వచ్చింది. జగన్‌పై భయంతో సదరు ఎమ్మెల్యేలు నోరెత్తకున్నా.. వైసీపీ

మిగతా 11వ పేజీలో...

చేయించింది పెద్ద రెడ్లు.. శిక్ష నాకా?

- దళిత ఎమ్మెల్యే ప్రశ్నకు జగన్ మౌనం 11
- ముఖముఖాలు చూసుకున్న ఆ ఇద్దరు నేతలు


సోమవారం విజయవాడ స్టేషన్‌లో అమృత్ భారత్ రైలు

'అమృత్ భారత్'.. వచ్చేసింది 2

250 కోట్లు తాగేశారు! 12

- 2 రోజుల్లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- 31న రూ.147 కోట్లు.. 2.18 లక్షల కేసులు హాంఫట్
- 1న వంద కోట్లకు పైనే.. గతేడాది కంటే ఈసారి జోరు



2.54 కోట్ల మందికి శ్రీవారి దర్శనం 3

- రూ.1,403 కోట్ల హుండీ ఆదాయం.. గత ఏడాది లెక్కలివి


ఫైల్ ఫొటో

కొత్త ఏడాదిలో దూకుడు!

- ఉధృతంగా ప్రజల్లోకి చంద్రబాబు
- ఈ నెలలో 25 భారీ బహిరంగ సభలు
- తొలి సభ కనిగిరిలో.. చివరిది 'అనంత'లో
- సంక్రాంతి తర్వాత లోకేశ్ పర్యటనలు
- వంద నియోజక వర్గాల్లో సమావేశాలు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో పెద్దఎత్తున జనంలోకి వెళ్లాలని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలపై పడుతున్న భారాలు, అభివృద్ధి లేమి, కొరవడుతున్న ఉపాధి ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ ఒక్క నెలలోనే రాష్ట్రంలో 25 బహిరంగ సభలు నిర్వహించాలని ఆయన తలపెట్టారు. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఒక్కో అసెంబ్లీ స్థానంలో ఈ సభలు జరుగుతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరిలో షెడ్యూల్ వెలువడవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది వెలువడేలోపే ప్రజల్లో ఒక ఊపు తేవాలన్న వ్యూహంలో టీడీపీ అధినాయకత్వం ఉంది. ఈ నెలలో భారీగా బహిరంగ సభలను నిర్వహించాలని, దీనికి తగినట్లుగా ప్రచారం, ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ నాయకత్వాలను ఆదేశించింది. ఇందులో మొదటి సభ ప్రకాశం జిల్లా కనిగిరిలో ఈ నెల ఐదో తేదీన జరగనుంది. ఆఖరి సభను ఈ నెల 29వ తేదీన అనంతపురం జిల్లాలో జరపాలని తలపెట్టారు. మధ్యలో ఒకట్రెండు రోజుల విరామంతో మొత్తం సభలు జరిపేలా ప్రణాళిక

మిగతా 11వ పేజీలో...

'బ్యాక్ బోన్' విరిచేశారు..

బీసీలకు బురిడీ

నాలుగున్నరేళ్లుగా జగన్ సర్కారు మోసం

- ఎన్నికలు వస్తుండటంతో నేడు బీసీ జపం
- బీసీల చుట్టూ వైసీపీ రాజకీయ క్రీడ
- చెప్పింది కొండంత.. చేసింది గోరంతే
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు గాలికి
- ప్రత్యేక ఉప ప్రణాళిక ద్వారా ఏటా రూ.15 వేల కోట్ల నిధులు ఏవీ?
- నామినేటెడ్ పనుల్లో 50% రిజర్వేషన్లు ఏవీ?
- బీసీ కార్పొరేషన్లకు పైసా కూడా ఇవ్వలేదు
- బాబు హయాంలో ఉన్న పథకాలు రద్దు
- ఉపాధి యూనిట్లు, పనిముట్లు బంద్

మేనిఫెస్టో.. మోసం

గత ఎన్నికల సమయంలో వైసీపీ మేనిఫెస్టోను ఆ పార్టీ అధ్యక్షుడు జగన్.. భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో పోల్చారు. బీసీలను ఉద్ధరిస్తున్నట్టు ఎన్నో హామీలు ఇచ్చారు. బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ఉప ప్రణాళిక ద్వారా ఏటా రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తామని.. బీసీ కార్పొరేషన్లకు నిధులిచ్చి ఆర్థికంగా పరిపుష్టి చేస్తామని.. నామినేటెడ్, కాంట్రాక్టు పనుల్లో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని.. ఇలా పలు హామీలు ఇచ్చారు. జగన్ సీఎం అయ్యాక అన్నీ మరిచిపోయారు. ఆ పవిత్ర గ్రంథాల సాక్షిగా బీసీలను మోసం చేశారు.

ఉన్నవీ... పోయె

చంద్రబాబు ప్రభుత్వంలో బీసీలకు స్వయం ఉపాధి హామీ యూనిట్లు మంజూరు చేశారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల సబ్సిడీతో 3 లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చారు. అలాగే కులవృత్తుల వారికి 90 శాతం సబ్సిడీతో అధునాతన పనిముట్లు అందించారు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి పేదలకు సాయం చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవే కాదు... గతంలో ఉన్న ఎన్నో పథకాలను రద్దు చేశారు. నిధులు ఇవ్వకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారు.

సమగ్ర కథనం 12లో


అనంతపురం కలెక్టరేట్ వద్ద కాళికాదేవి సీఎం జగన్‌ను తొక్కేస్తున్నట్టు అంగన్వాడీల ప్రదర్శన

నిరసనల హోరు

కొత్త సంవత్సరం తొలిరోజూ అంగన్వాడీల ఆందోళనలు

- ఆటపాటలతో వినూత్నంగా 21వ రోజు సమ్మె
- సీఎం జగన్ దయ వల్లే రోడ్డునపడ్డామంటూ ఆగ్రహం
- చర్చలకు మున్సిపల్ కార్మిక సంఘాలకు పిలుపు
- నేడు సచివాలయంలో సమావేశం 12


ఘరానా దొంగ.. రాయ్ యాఫ్రాఫ్

దొంగ యుద్ధం! 2

- నెతన్యాహు, రక్షణ మంత్రితో ఫొటో
- సైనిక దుస్తుల్లో ఓ దొంగ చాకచక్యం
- పలు ఆపరేషన్లలో ముందుండి కాల్పులు
- క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలు కూడా
- ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ సమయంలో తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ

వైసీపీ కార్యకర్తల దాష్టీకం

- పాత కక్షలతో యువకుడి హత్య 2
- పోలీసులు వచ్చారంటూ బయటకు పిలిచి రాళ్లు, కర్రలతో దాడి.. డోన్‌లో దారుణం
- టీడీపీ గెలుస్తుందన్నందుకు దంపతులపై వలంటీర్ దాడి



శబరిమలకు పోటెత్తిన భక్తులు

- సన్నిధానం వద్ద ఉక్కిరిబిక్కిరి.. ఇక్కట్లపాలైన తెలుగు భక్తులు

శబరిమల, జనవరి 1: శబరిమలకు అయ్యప్ప భక్తులు పోటెత్తారు. మకరవిళక్కు సీజన్ సందర్భంగా శనివారం ఆలయం తలుపులు తెరుచుకోగా.. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం భక్తుల రద్దీ పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) వర్గాలు తెలిపాయి. సోమవారం ఉదయం రికార్డు స్థాయిలో 18 వేల మంది భక్తులు అయ్యప్పకు నెయ్యాభిషేకాలు నిర్వహించారని, వేల సంఖ్యలో భక్తులు వచ్చారని వివరించాయి. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా 80 వేల మంది, స్పాట్ బుకింగ్‌లో 10 వేల మంది, పులిమేడ్ రూట్‌లో మరో 8 వేల మంది భక్తులు దర్శనానికి వచ్చినట్లు వెల్లడించాయి. సాయంత్రం 4 గంటల సమయంలో సన్నిధానం వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌పై వందల మంది భక్తులు చేరడం.. దర్శనం ఆలస్యం అవ్వడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో దర్శనం క్యూలో చాలా మంది తెలుగు భక్తులే ఉన్నారు. చిన్నపిల్లలు, 50 ఏళ్లపైబడ్డ మహిళాభక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు లేకపోవడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. క్యూలైన్ సన్నిధానానికి చేరే ప్రదేశంలో మాత్రమే పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్యూలైన్ల వద్ద నిర్వహణ సరిగ్గాలేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలుగు భక్తులు ఆరోపించారు.

వైసీపీ కార్యకర్తల దారుణం

- పాత కక్షలతో యువకుడి హత్య
- నంద్యాల జిల్లా డోన్‌లో ఘటన

డోన్, జనవరి 1: నంద్యాల జిల్లా డోన్ మండలంలో దారుణం జరిగింది. పాతకక్షల నేపథ్యంలో అధికార పార్టీ కార్యకర్తలు ఓ యువకుడిని అత్యంత దారుణంగా హతమార్చారు. మద్యం మత్తులో ఉన్న వైసీపీ కార్యకర్తలు సదరు యువకుని పోలీసులు వచ్చారంటూ బయటకు పిలిచి మరీ రాళ్లు, కర్రలతో దాడి చేసి ప్రాణం తీశారు. ఈ దాడిలో డోన్‌కు చెందిన ఖాదర్(30) అనే యువకుడు మృతి చెందారు. డోన్ మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. డోన్ పట్టణంలోని చిగురుమానుపేటలో ఖాదర్ నివాసముంటున్నారు. ఆయన తండ్రి లక్ష్మీనారాయణ ఉంగరానిగుండ్ల గ్రామంలో ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత చిన్నమద్ది కుమారుడు ఓబులేసుకు, ఖాదర్‌కు కొన్ని నెలల కిందట ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ ఇరువర్గాల మధ్య కక్షలు పెరిగేలా చేసింది. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి డోన్ పట్టణంలో ఖాదర్ తన స్నేహితులతో కలిసి న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. ఇదే సమయంలో ఉంగరానిగుండ్ల గ్రామంలో వైసీపీ కార్యకర్తలు ఖాదర్ తండ్రి లక్ష్మీనారాయణ ఇంటిపై దాడికి పాల్పడ్డారు. ఖాదర్ తమ్ముడు రవి మీద కూడా దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. దాడి ఘటన తెలియడంతో ఖాదర్.. తన స్నేహితులతో కలిసి ఉంగరానిగుండ్లకు వెళ్లి తండ్రిని పరామర్శిస్తున్నారు. ఇంతలో బయట నుంచి 'పోలీసులు వచ్చారు' అంటూ బిగ్గరగా కేకలు వినిపించడంతో ఖాదర్ ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఇదే అదునుగా వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. రాళ్లు, కర్రలతో ఖాదర్‌పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో ఖాదర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే కుప్పకూలి పోయారు. స్నేహితులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. హత్య ఘటనను నిరసిస్తూ.. మృతుని కుటుంబసభ్యులు సోమవారం ఉదయం పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. చిగురుమానుపేటకు చెందిన బంధువులు, కుటుంబసభ్యులు భారీగా తరలిరావడంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన ఓబులేసు, సిసింద్రీ, నవీన్, చిన్న మధు, చిన్నమద్ది, అబ్దుల్, ఖాజా, అహ్మద్, షరీఫ్, మను, రంగస్వామి, పవన్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

టీడీపీ వస్తుందన్నందుకు దంపతులపై వలంటీర్ దాష్టీకం

- కర్రలతో కొట్టి, కాళ్లతో తన్నులు.. నూతన సంవత్సర వేడుకలో ఘటన



టీడీపీ సానుభూతిపరులపై దాడి చేస్తున్న వలంటీర్, అతని అనుచరులు

మోపిదేవి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని వ్యాఖ్యలు చేయడంతో.. వైసీపీకి చెందిన వలంటీర్ టీడీపీ సానుభూతిపరులైన దంపతులపై దాడి చేసి గాయపరిచాడు. ఆదివారం రాత్రి కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు చైతన్యనగర్‌లో ఈ సంఘటన జరిగింది. బాధిత దంపతులు ముక్కు శ్రీరాణి, ఏడుకొండలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చైతన్య నగర్‌కు చెందిన యువకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసి నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వం వస్తుందని కొందరు యువకులు వ్యాఖ్యానించారు. దీంతో సహించలేని గ్రామ వలంటీర్ కొక్కిలిగడ్డ సుధాకర్, తన స్నేహితుడు కొల్లూరి గోపి, మరి కొంతమందితో వచ్చి దాడి చేశాడు. చల్లపల్లి నుంచి వచ్చి ఇక్కడ ఉంటూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకొంటారా అంటూ తమను కర్రలతో కొట్టి, కాళ్లతో తన్ని తీవ్రంగా గాయపర్చినట్లు బాధిత దంపతులు ముక్కు శ్రీరాణి, ఏడుకొండలు తెలిపారు. బోడగుంట గ్రామం నుంచి 10 మంది యువకులను పిలిచి తీవ్రంగా దుర్భాషలాడి గాయపర్చినట్లు చెప్పారు. శ్రీరాణికి తల, పొత్తి కడుపు, చేతి మణికట్టుకు గాయాలయ్యాయి. ఏడుకొండలకు కాళ్లు, చేతులకు గాయాలైనట్లు చెబుతున్నారు. అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ పరామర్శించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విజయవాడకు 'అమృత్ భారత్'

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం ప్రారంభంలోనే అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బెజవాడకు వచ్చేసింది. ఆదివారం రాత్రి విజయవాడకు చేరుకున్న ఈ రైలు సోమవారం ఉదయం 8.30 గంటలకు విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్లింది. రైల్వే అధికారులు ఈ రైలుకు స్వాగతం పలికారు. అమృత్ రైలు పేరుకు తగ్గట్టుగా ఎంతో ఆకర్షణీయంగా ఉంది. మాల్దా టౌన్ వయా విజయవాడ, బెంగళూరుల మధ్య ఈ రైలు నడుస్తుంది.

'కొంగొత్త' విజయం!



(మొదటి పేజీ తరువాయి)

విజయవంతమైంది. సోమవారం ఉదయం 9.10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ58 నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. 480 కిలోల బరువు గల 'ఎక్స్‌పోశాట్'ను 650 కిలోమీటర్ల ఎత్తులోని లియో ఆర్బిట్‌లోకి 22 నిమిషాల్లో చేరుకుంది. 'ఇస్రో' ఎక్స్‌-రే పొలారిమీటర్ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. అమెరికా తర్వాత ఈ ఘనత సాధించిన దేశం భారత్ మాత్రమే కావడం మరో విశేషం.

పీఎస్ఎల్వీ-సీ58 ద్వారా వివిధ ప్రయోగాలకు ఉద్దేశించిన పది పరికరాలను కూడా కక్ష్యలోకి చేర్చారు. విషన్ కంట్రోల్ సెంటర్‌లో సూపర్ కంప్యూటర్ల ద్వారా ప్రయోగాన్ని వీక్షించిన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ రాకెట్ తన నాలుగు దశలను పూర్తిచేసుకొని ఉపగ్రహాన్ని సంబంధిత కక్ష్యలోకి విజయవంతంగా చేర్చిన వెంటనే పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

విద్యార్థినుల కీలక పాత్ర

పీఎస్ఎల్వీ చివరి దశలో కక్ష్యలోకి ప్రవేశపెట్టిన పది పరికరాల్లో తిరువనంతపురం ఎల్‌బీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాల విద్యార్థినులు రూపొందించిన ఉమెన్ ఇంజనీర్డ్ ఉపగ్రహం కూడా ఉంది. దీంతో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థినులు రూపొందించిన పేలోడ్లు ఉన్నాయి. ఇది దేశంలోని మహిళలకు స్ఫూర్తినిస్తుందని ఇస్రో పేర్కొంది.

'స్పేస్ స్టేషన్' దిశగా...: అంతరిక్షంలో 'స్పేస్ స్టేషన్'ను నిర్మాణంలో సోమవారం తొలి అడుగు పడింది. ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో పాటూ కక్ష్యలోకి ప్రవేశపెట్టిన 10 పరిశోధక పరికరాల్లో ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టమ్(ఎఫ్‌సీపీఎస్) కూడా ఉంది. భవిష్యత్‌లో భారతదేశం రోదసీలో నిర్మించబోయే అంతరిక్ష కేంద్రానికి ఈ ఫ్యూయల్‌సెల్ కీలకం కానుంది. ఫ్యూయల్‌సెల్ టెక్నాలజీని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ) అభివృద్ధి చేసింది. అంతరిక్షంలో సమర్థవంతమైన సుస్థిర శక్తి వనరులను తయారు చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. ఎలక్ట్రో కెమికల్ రియాక్షన్‌తో రసాయన శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే సాంకేతికత ఫ్యూయల్‌సెల్‌లో ఉంటుంది. సుదీర్ఘకాలం పాటు అంతరిక్ష కేంద్రానికి విద్యుత్‌ను ఇది సరఫరా చేయగలదు.

గొప్ప ప్రారంభం: మోదీ

ఇస్రో చేపట్టిన ఎక్స్‌-రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో గొప్ప ప్రారంభంగా ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్‌కు ఉన్న నైపుణ్యాన్ని ఈ ప్రయోగం చాటి చెబుతుందన్నారు. ముఖ్యంగా ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న విద్యార్థినులు, మహిళా శాస్త్రవేత్తల కృషిని ఆయన అభినందించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచండి: ఖర్గే

ఇస్రో చేపట్టిన ఎక్స్‌పోశాట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతోషం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రయోగాల ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.



● ఇది గగన్‌యాన్ సంవత్సరం: సోమనాథ్

పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగానంతరం ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మీడియాతో మాట్లాడారు. పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ కక్ష్యలోకి చేర్చిన ఎక్స్‌-రే పొలారిమీటర్ ఉపగ్రహం(ఎక్స్‌పోశాట్) ప్రయోజనాలను వెల్లడించారు. 2021లో అమెరికా ఈ తరహా ప్రయోగం చేపట్టిందని, అమెరికా తర్వాత ఇలాంటి ప్రయోగం చేపట్టిన ఘనత భారతదేశానికే దక్కిందన్నారు. అంతరిక్ష ఆధారిత ఎక్స్‌-రే ఖగోళ శాస్త్రంలో సంచలనాత్మక పురోగతికి ఈ ప్రయోగం నాంది పలకనుందని చెప్పారు. ఎక్స్‌-రే పొలారిమీటర్ మూలాలను అన్వేషించడం ఎక్స్‌పోశాట్ లక్ష్యమని తెలిపారు. ఇది ఖగోళ శాస్త్రానికి ఒక కొత్త కోణాన్ని పరిచయం చేస్తుందన్నారు. ఇలా ఉండగా ఎక్స్‌పోశాట్ జీవితకాలం ఐదేళ్లు. కృష్ణబిలాల రహస్యాలను ఛేదించడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఈ ఏడాదిలో 12-14 ప్రయోగాలు చేపట్టనున్నామని సోమనాథ్ తెలిపారు. వీటిలో కీలకమైన 'గగన్‌యాన్' ఉందన్నారు. 2024 సంవత్సరం 'మిషన్ గగన్ యాన్'గా నిలవనుందని ప్రకటించారు.



ఆ యోధులు అక్కడివారే!

- కర్ణాటక, కేరళలోని పలు వర్గాల వారి జన్యువుల్లో వాయవ్య భారత మూలాలు
- సీసీఎంబీ అధ్యయనంలో వెల్లడి

కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని నాయర్లు, తియ్య, ఎళవ తదితర తెగలకు చెందిన యోధులు, భూస్వామ్యవర్గాలకు చెందినవారు వాయవ్య భారతదేశం నుంచి వలసవచ్చారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వారి జన్యువులు వాయవ్య భారతదేశానికి చెందిన వారి జన్యువులకు దగ్గరగా ఉన్నాయని డాక్టర్ కుమారసామి తంగరాజ్ సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం నిర్వహించిన పరిశోధనలో నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని 'సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)' సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పరిశోధనలో భాగంగా సీసీఎంబీ శాస్త్రవేత్త తంగరాజ్ సారథ్యంలోని పరిశోధకుల బృందం నైరుతి తీరప్రాంతానికి చెందిన 213 మంది యోధులు, భూస్వామ్య వర్గాల జన్యువులను విశ్లేషించింది. కేరళలోని నాయర్లు, తియ్యలు, ఇజ్వాలు, కర్ణాటకకు చెందిన బంట్లు, హోయసల జన్యువులు.. వాయవ్య భారతదేశ జనాభా జన్యువులకు దగ్గరగా ఉన్నాయని ఆ బృందం నిర్ధారించింది. వీరి వలసలు కాంస్యయుగం చివరిలో లేదా లోహయుగం ప్రాంతంలో జరిగి ఉంటాయని అధ్యయనంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ లోమౌస్ కుమార్ తెలిపారు. కాగా, భౌగోళిక పరిశోధన, ఖనిజ నిక్షేపాల అన్వేషణ కోసం కోల్‌కతాకు చెందిన జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా.. హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియలాజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వంద కోట్ల రూపాయల విలువైన ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని 700 కిలోమీటర్ల మేర విస్తరించిన ప్రాంతంలో డీప్ సెస్మిక్ రిఫ్లెక్షన్ సర్వే, మాగ్నెటోటెల్యూరిక్ సర్వేలు నిర్వహిస్తారు.

- స్పెషల్ డెస్క్

వణికిన జపాన్



- కుదిపేసిన వరుస భూ ప్రకంపనలు

టోక్యో, జనవరి1: కొత్త ఏడాది తొలి రోజునే జపాన్‌ను భూకంపం కుదిపేసింది. వరుస ప్రకంపనలు ఆ దేశ పశ్చిమ తీరాన్ని వణికించాయి. ప్రజలు భయభ్రాంతులకు గురై చంటి పిల్లలతో సహా వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వం అత్యంత తీవ్రస్థాయి సునామీ హెచ్చరికలు జారీచేసి లక్షమందిని తక్షణమే ఖాళీ చేయించింది. ఇషికావాలోని నోటోలో మొదట 5.7 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఇక్కడి తీ రం పరిధిలో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4గంటల సమయం లో 4.0కంటే అధిక తీవ్రతతో మొత్తం 21 ప్రకంపనలు సంభవించాయి. వీటిలో ఒకదాని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైందని జపాన్ వాతావరణ శాఖ ప్రకటించింది. ఇషికావాలోని వాజిమా నౌకాశ్రయంలో 1.2 మీటర్ల ఎత్తులో సునామీ అలలు ఎగిశాయి. వీధులు, భవనాలు దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్దఎత్తున పగుళ్లు వచ్చాయి. కాగా, హొక్కాయిడో నుంచి నాగసాకి వరకు సునామీ ముప్పుందని అధికారులు వెల్లడించారు. కొన్నిచోట్ల సునామీ అలలు 5మీటర్ల ఎత్తువరకు రావచ్చని హెచ్చరించారు. ఇషికావాకు తీవ్రమైన, హోన్షు, హొక్కైడో ఇతర ప్రధాన ద్వీపాలకు స్వల్ప స్థాయి సునామీ హెచ్చరికలను జారీ చేశారు. 16.5 అడుగుల ఎత్తున అలలు ఎగిసిపడే ప్రమాదం ఉందని జపాన్ అధికారిక ఎన్‌హెచ్‌కేటీవీ సూచించింది. రాబోయే 2-3 రోజుల్లో తీవ్ర ప్రకంపనలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 10అడుగుల సునామీ అల తీర నగరం నీగాటా, పరిసర ప్రాంతాలను తాకే ప్రమాదం ఉందని ప్రభుత్వ అధికార ప్రతినిధి యోషిమస హయాషి తెలిపారు. భూకంప ప్రాంతాల్లోని అణు కేంద్రాలకు ఎలాంటి ఇబ్బందీలేదని చెప్పారు. కాగా, సోమవారం రాత్రికి సునామీ హెచ్చరికల తీవ్రతను జపాన్ ప్రభుత్వం తగ్గించింది. వరుస ప్రకంపనల కారణంగా 30వేలకుపైగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని, 6 ఇళ్లు దెబ్బతిన్నాయని, ప్రజలు చిక్కుకున్నారని, వజిమా, ఇషికావా నగరాల పరిసరాల్లో మంటలు చెలరేగాయని హయాషి వివరించారు.

అయోధ్య రాముడి పాదుకలు హైదరాబాద్ నుంచే..

- ఓల్డ్‌బోయిన్‌పల్లిలో రూపుదిద్దుకుంటున్న పంచలోహ పాదుకలు
- బరువు 12 కిలోల 800 గ్రాములు



పాదుకలను తయారు చేస్తున్న లోహశిల్పి రామలింగాచారి

ఓల్డ్‌బోయిన్‌పల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయోధ్య ఆలయ నిర్మాణ క్రతువులో భాగ్యనగరం మరో అదృష్టాన్ని దక్కించుకుంది. ఇప్పటికే బోయిన్‌పల్లిలోని అనురాధ టింబర్స్‌లో అయోధ్య ఆలయ ప్రధాన ద్వారాలు, ఇతర తలుపులు తయారవుతుండగా.. రాములోరి పాదుకలు కూడా హైదరాబాద్‌లోనే రూపుదిద్దుకున్నాయి. కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి పిట్లంపల్లి రామలింగాచారి ఏర్పాటు చేసిన శ్రీమద్విరాట్ కళాకుటీర్‌లో అయోధ్య రామయ్య పాదుకలను రూపొందించారు. రామలింగాచారితోపాటు.. ఆరుగురు నిపుణులైన శిల్పులు 25 రోజుల పాటు శ్రమించి, పంచలోహాలతో 12 కిలోల 800 గ్రాముల బరువున్న పాదుకలను తయారు చేశారు. ఇవి 100 ఏళ్ల వరకు కూడా చెక్కు చెదరని విధంగా తయారయ్యాయని రామలింగాచారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పాదుకలకు బంగారు తాపడం పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. ఈ పాదుకలు ఆదివారం రాత్రి అయోధ్యకు బయలుదేరాయని, మంగళవారం అక్కడికి చేరుకుంటాయని వివరించారు.

40 ఏళ్ల అనుభవం..

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం అంగడికూర్మపల్లికి చెందిన రామలింగాచారికి లోహశిల్పిగా 40 ఏళ్ల అనుభవం ఉంది. రాగి లక్ష్మీనారాయణ, రాగి వీరబ్రహ్మాచారి వద్ద ఆయన లోహశిల్పకళను అభ్యసించారు. 1986లో నల్లగొండలోని కేంద్ర ప్రభుత్వ జౌళీ పరిశ్రమల శిక్షణ సంస్థలో పనిచేశారు. 1987లో బెంగళూరులోని రీజినల్ డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రెండేళ్ల లోహశిల్పం విద్యలో మాస్టర్స్ పట్టా అందుకున్నారు. 1988లో హైదరాబాద్ నగరానికి వచ్చి పలు ఆలయాల్లో లోహశిల్పకళ పనులు చేసేవారు. 1993లో ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేట చౌరస్తా వద్ద వద్ద శ్రీమద్విరాట్ కళా కుటీర్‌ను స్థాపించారు. అప్పటి నుంచి అనేక ఆలయాల దేవతామూర్తులను, గాలిగోపురాలను తీర్చిదిద్దారు. యాదగిరిగుట్ట గర్భగుడిలో ఉన్న ఉత్సవ మూర్తులు, స్వామివారి కవచాలు, శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో నాగాభరణాలు, కడపలోని బ్రహ్మంగారి మఠంలో ఈశ్వరీదేవి సమాధి మండపం ఆయన చేతుల మీదుగా రూపుదిద్దుకున్నవే. తెలంగాణ, ఏపీతోపాటు.. పలు రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాల్లోనూ రామలింగాచారి చేతుల మీదుగా రూపుదిద్దుకున్న అలంకరణలున్నాయి. ఆయన అనుభవాన్ని గుర్తించిన అయోధ్య భాగ్యనగరం సీతారామ సేవాట్రస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చర్ల శ్రీనివాసశాస్త్రి పాదుకల పనిని అప్పగించారు.

అయోధ్యలో ప్రతిష్ఠాపనకు మైసూర్ విగ్రహం

- బాల రాముని ఎత్తు 51 అంగుళాలు

మైసూర్, జనవరి 1: అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహం ఎంపిక పూర్తయింది. మైసూర్‌కు చెందిన ప్రసిద్ధ శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన బాల రాముని విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. రామ జన్మభూమి ట్రస్టు ఈ ఎంపికను ఓటింగ్ ద్వారా పూర్తి చేసింది. మైసూర్ జిల్లా బుజ్జెగౌడనపుర గ్రామంలో లభ్యమయ్యే ప్రత్యేకమైన కృష్ణ శిలను శిల్పాన్ని చెక్కడానికి వినియోగించారు. అరుణ్ యోగిరాజ్ నేతృత్వంలో శిల్పుల బృందం అత్యంత నైపుణ్యంతో చెక్కిన ఈ బాల రాముని విగ్రహం 51 అంగుళాల ఎత్తు ఉంటుంది. పీఠంతో కలుపుకుని ఎనిమిది అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పు ఉంటుంది.

రామభక్తులకే ఆహ్వానం!

- అయోధ్యలో ఆలయ ప్రతిష్ఠపై ప్రధాన పూజారి
- ఉద్ధవ్, రౌత్‌పై సత్యేంద్రదాస్ ఆగ్రహం

అయోధ్య/న్యూఢిల్లీ, జనవరి 1: అయోధ్యలో 22న రామాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంపై బీజేపీ, ప్రతిపక్షాల నడుమ మాటల యుద్ధం కొనసాగుతోంది. ఆహ్వానాలు అందుకున్న టీఎంసీ, సీపీఎం హాజరు కాబోమని ప్రకటించగా.. కాంగ్రెస్ ఇంకా ఎటూ తేల్చుకోలేదు. తనకు ఆహ్వానం పంపలేదని ఉద్ధవ్ శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే చేసిన వ్యాఖ్యలపై అయోధ్య రామాలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్రదాస్ మండిపడ్డారు. రామభక్తులకు మాత్రమే ఆహ్వానాలు అందుతాయన్నారు. శ్రీరాముడి పేరుతో బీజేపీ ఎన్నికలకు వెళ్తోందన్న విమర్శలు అర్థరహితమన్నారు. రేపోమాపో శ్రీరాముడిని బీజేపీ తన అభ్యర్థిగా ప్రకటిస్తుందన్న ఎంపీ సంజయ్ రౌత్‌పైనా ఆచార్య విరుచుకుపడ్డారు. 'రాముడి పేరుతో రాజకీయాలు చేసింది వాళ్లే. శ్రీరాముడిని నమ్మినవారు అధికారంలో ఉన్నారు. రౌత్ రాముడిని అవమానిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇంకోవైపు.. రామాలయ ప్రారంభంపై బీజేపీ మంగళవారం వ్యూహాత్మక సమావేశం నిర్వహించనుంది. పార్టీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా పలువురు నేతలు, ప్రతి రాష్ట్ర శాఖ నుంచి ఇద్దరేసి ఆఫీసు బేరర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. కాగా, రామాలయ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఈ నెల 16న ప్రారంభమై వారంపాటు జరుగుతాయి. 22వ తేదీన ప్రాతఃకాల పూజల అనంతరం మృగశిర నక్షత్రంలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు.

దేశంలోనే పొడవైన సముద్ర వంతెన



భారత్‌లోనే అత్యంత పొడవైన సముద్ర వంతెన(ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్) ఈనెల 12న అందుబాటులోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ వంతెనను ప్రారంభిస్తారు. ప్రస్తుతం ముంబై-పుణె నగరాల మధ్య ప్రయాణానికి 2 గంటల సమయం పడుతుండగా.. 21.8 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన అందుబాటులోకి వస్తే.. ఆ దూరం 15-20 నిమిషాలకు తగ్గుతుంది.

దొంగ యుద్ధం!

- నెతన్యాహు, రక్షణ మంత్రితో ఫొటో
- సైనిక దుస్తుల్లో దొంగ చాకచక్యం
- పలు ఆపరేషన్లలో ముందుండి కాల్పులు
- తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ



అతనో ఘరానా దొంగ..! పేరు రాయ్ యాఫ్రాఖ్..! వయసు 35ఏళ్లు..! ఉండేది ఇజ్రాయెల్‌లోని టెల్-అవీవ్‌లో..! ఆర్మీ తుపాకులు, మందుగుండు సామగ్రిని దొంగిలించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించాలనుకున్నాడు! అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడితో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) బెల్ ఆఫ్ ఆర్మ్స్(ఆయుధాగారం)లోకి వెళ్లేందుకు అవకాశం కల్పించుకున్నాడు. సైన్యాధికారి దుస్తులు ధరించి, సైన్యంలోకి చొరబడ్డాడు. అదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణమంత్రి యోవ్ గలాంట్ హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్నారు. వారి దగ్గరకు వెళ్లి, ఫొటోలకు ఫోజులిచ్చాడు. ఆ ఫొటోలే అతనికి రక్షణ కవచాలయ్యాయి. అధికారి హోదాతో నకిలీ ఐడీకార్డును తయారు చేసుకున్నాడు. దాంతో సైన్యంలో అడ్డూఅదుపూ లేకుండా తిరిగాడు. అక్టోబరు7దాడి తర్వాత హమాస్ ఉగ్రవాదులు నక్కిన ఇళ్లలో చేపట్టిన ఆపరేషన్‌లో కొన్ని దళాలను ముం దుండి నడిపాడు. గాజాలో సొరంగాల విధ్వంసంలో పాల్గొన్నాడు. తూటా గాయాలైన సైనికులకు ప్రథమచికిత్సలు చేసేవాడు. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లో, షిన్‌బెట్ సీక్రెట్ ఏజెంట్‌గా తనను తాను తోటి సైనికులకు పరిచయం చేసుకునేవాడు. వీలైనప్పుడు అసాల్ట్ రైఫిళ్లు, పిస్టళ్లు, తూటాలు, మందుగుండు సామగ్రి, స్మోక్ గ్రనేడ్లను తస్కరించేవాడు. హమాస్ మృతదేహాల వద్ద తుపాకులనూ వెంట తెచ్చుకున్నాడు. గత నెల 17న ఆయుధాలు మాయమవుతుండడంపై ఐడీఎఫ్ నిఘాపెట్టడంతో ఆదివారం యాఫ్రాఖ్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్, చానల్-12 పేర్కొన్నాయి. యాఫ్రాఖ్ ఇంట్లో తుపాకులు, ఐఈడీలు, గ్రనేడ్లను సీజ్‌చేశామని, అతనిపై మోసం, దొంగతనం సహా ఐదు అభియోగాలు మోపినట్లు టెల్-అవీవ్ పోలీసులు తెలిపారు. ఈ నేరాలకు అతనికి గరిష్ఠంగా 36ఏళ్ల జైలు శిక్షపడే అవకాశముందని న్యాయనిపుణులు చెబుతుండగా.. యాఫ్రా ఖ్ మాత్రం తాను స్వచ్ఛందంగా సైన్యంలో పనిచేశానంటున్నాడు.

మసూద్ అజహర్ హత్య?

- పాక్ మసీదు వద్ద పేలుడులో మృతి?
- 'గుర్తు తెలియని వ్యక్తి' పనే అంటూ ట్రెండింగ్



న్యూఢిల్లీ, జనవరి 1: నూతన సంవత్సరం వేళ 'ఎక్స్'లో 'గుర్తు తెలియని వ్యక్తి' మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చాడు. కాందహార్ విమానం హైజాక్, పుల్వామా పేలుళ్ల తదితర సంఘటనలతో సంబంధం ఉన్న మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, జైష్ ఎ మహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్ హత్యకు గురైనట్టు ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. సోమవారం ఉదయం 5గంటలకు పాకిస్థాన్‌లోని భావల్‌పూర్ మసీదు నుంచి వెళ్తుండగా బాంబు పేలడంతో మరణించినట్టు ఆ పోస్టులో ఉంది. ఈ సమాచారం ధ్రువపడలేదు. ఈ పోస్టుతోపాటు బాంబు పేలుడుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇందుకు 'గుర్తు తెలియని వ్యక్తే' కారణమన్న వ్యాఖ్యానాలు వినిపించాయి. మసూద్ అజహర్‌కు 2001 లో పార్లమెంటుపై దాడి, 2005 జూలై 5న అయోధ్య రామ జన్మభూమి మందిరంపై దాడి, ముంబై అల్లర్లు, అఫ్గానిస్థాన్ మజార్ ఎ షరీఫ్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయంపై దాడి తదితర ఘటనలతో సంబంధం ఉంది.

కొలీజియం పారదర్శక వ్యవస్థే!

- అయోధ్య తీర్పు కర్తృత్వాన్ని ఏ ఒక్క జడ్జికీ ఆపాదించకూడదన్నది ఏకగ్రీవ నిర్ణయం
- ఆర్టికల్ 370 విషయంలో రాజ్యాంగం, చట్టం ఆధారంగానే నిర్ణయం తీసుకున్నాం
- 'పీటీఐ' ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ, జనవరి1: అయోధ్య కేసులో తీర్పు రాసిన న్యాయమూర్తి ఎవరో వెల్లడించకూడదని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా నిర్ణయించిందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదనడం సరికాదని పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370, స్వలింగ వివాహాలకు సంబంధించిన తీర్పులపైన, కేసుల కేటాయింపుపైనా ఆయన ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు. వందేళ్లకు పైబడి కొనసాగిన అయోధ్య వివాదంపై 2019 నవంబరు9న నాటి సుప్రీం సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ ధర్మాసనంలో ఉన్న జస్టిస్ చంద్రచూడ్ నాటి పరిణామాల గురించి వివరించారు. ఏదైనా తీర్పు వెలువరించేముందు ధర్మాసనంలోని సభ్యులంతా కలిసి చర్చించుకున్నట్టే అయోధ్య తీర్పుపై కూడా తాము చర్చించుకున్నామని.. ఆ తీర్పు కోర్టు తీర్పుగానే ఉండాలని నిర్ణయించామని ఆయన వివరించారు. అందుకే ఆ తీర్పునకు సంబంధించి కర్తృత్వాన్ని ఏ ఒక్క న్యాయమూర్తికీ ఆపాదించలేదన్నారు. సుదీర్ఘ సంఘర్షణతో కూడిన చరిత్ర ఉన్న ఈ కేసు విషయంలో విభిన్న దృక్కోణాలు ఉంటాయి కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇక, 370రద్దు రాజ్యాంగబద్ధమా కాదా అనే విషయంలో రాజ్యాంగం, చట్టం ఆధారంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఆ కేసు విషయంలో న్యాయమూర్తులు తాము చెప్పాలనుకున్న విషయాన్ని తమ తీర్పుల ద్వారా వెల్లడించారని.. అవన్నీ ప్రజాబాహుళ్యంలోనే ఉన్నాయన్నారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేమంటూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ప్రశ్నించగా.. ఏ కేసు ఫలితాన్నీ న్యాయమూర్తులు వ్యక్తిగతంగా తీసుకోరని, తీర్పు ఇచ్చాక దాన్ని అక్కడే వదిలేస్తారన్నారు. కొలీజియం వ్యవస్థలో పారదర్శకతకు సంబంధించి పలు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసుల కేటాయింపునకు సంబంధించి నిర్దిష్టమైన విధానం ఉందని, కేసులను రోస్టర్ ప్రకారం కేటాయిస్తామన్నారు.



గవర్నరుకు ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ, వేదపండితులు

గవర్నరుకు వేదపండితుల ఆశీర్వచనం

అమరావతి, జనవరి 1: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం ఈఓ వేమూరి గోపి, వేద పండితులు సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లి రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేవదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాలవలవన్‌తో కలసి వెళ్లి గవర్నరును ఆశీర్వదించారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి కూడా వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. తదుపరి పలువురు దేవదాయశాఖ ప్రధాన అధికారులను కలసి ఆశీర్వచనం అందజేసినట్టు ఈఓ తెలిపారు.

చినవెంకన్న సేవలో జస్టిస్ రవీంద్రబాబు



జస్టిస్ రవీంద్రబాబుకు శ్రీవారి చిత్రపటాన్ని అందచేస్తున్న ఏఈవో దుర్గారావు

ద్వారకాతిరుమల, జనవరి 1: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ రవీంద్రబాబు.. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందారు. ఏఈవో దుర్గారావు ఆయనకు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

ట్రాన్స్‌కోను అభినందించిన సీఎం జగన్

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు ప్రవాహ మౌలిక సదుపాయాల కల్పనలో మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించిన ఏపీ ట్రాన్స్‌కోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అభినందించారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా సీఎం జగన్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నేతృత్వంలోని అధికారుల బృందం శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ప్రవాహ నైపుణ్యానికి అవార్డులు సాధించినందుకుగాను విజయానంద్ నేతృత్వంలోని అధికారుల బృందాన్ని సీఎం జగన్ అభినందించారు.

జనవరి 1..
జాబ్ క్యాలెండరేది జగన్..?

(మొదటి పేజీ తరువాయి)

జాబ్ క్యాలెండర్‌పై కనీసం పన్నెత్తు మాట కూడా మాట్లాడలేదు. అసలు అలాంటి హామీనే తాము ఇవ్వలేదన్నట్టు వ్యవహరిస్తున్నారు.

నిరుద్యోగులకు నయవంచన

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ నోటికొచ్చిన హామీలు ఇచ్చుకుంటూ పోయారు. అధికారంలోకి వచ్చాక సీపీఎస్ రద్దు, మద్యనిషేధం వంటి హామీలు అమలుచేయడం తమ వల్ల కాదని చేతులెత్తేశారు. అదే తరహాలో నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు అప్పట్లో జాబ్ క్యాలెండర్ అని పెద్దఎత్తున ప్రచారం చేశారు. తాము అధికారంలోకి రావడమే ఆలస్యం ఉద్యోగాలన్నీ భర్తీ అయిపోతాయి అన్న స్థాయిలో హామీల వర్షం కురిపించారు. 2019 నాటికే 2.3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని అధికారంలోకి రాగానే భర్తీ చేస్తామని నమ్మించారు. కానీ, అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా పట్టుమని పది వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. చివరికి అటూ ఇటూగా 5వేల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగలిగారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలు భర్తీచేసి, వలంటీర్లను నియమించి అవే ఉద్యోగాలు అని ప్రచారం చేశారు. అప్పట్లో జగన్ చెప్పినట్లుగా చూస్తే 2019 నాటికే 2.3 లక్షల ఖాళీలుంటే, ఈ ఐదేళ్లలో ఆ సంఖ్య ఇంకా భారీగా పెరిగి ఉంటుంది. కానీ, ఇప్పుడు అసలు ఖాళీలే లేవన్నట్టుగా ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం కొండెక్కించింది.

వర్సిటీల్లోనూ అంతే

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యూనివర్సిటీల్లోని ఖాళీల విషయంలోనూ జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచింది. నాలుగేళ్లపాటు పట్టించుకోకుండా చివరి ఏడాది భర్తీ చేస్తామని ప్రకటించింది. గతేడాది జూలైలో నోటిఫికేషన్లు ఇస్తామని స్వయంగా సీఎం ప్రకటించినా అది అమలు కాలేదు. పోస్టుల రేషనలైజేషన్ అంటూ ఉన్నత విద్యామండలి ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి, ఏడాది చివర్లో నోటిఫికేషన్లు ఇచ్చింది. రేషనలైజేషన్‌ను గందరగోళం చేయడంతో అనేకమంది కోర్టుకు వెళ్లే పరిస్థితి వచ్చింది. చివరికి ఇది న్యాయస్థానం ఆదేశాలతో ఆగిపోయింది. సీఎం ప్రకటించినట్లుగా జూలైలోనే నోటిఫికేషన్లు ఇచ్చి ఉంటే న్యాయ వివాదాలు కూడా వీగిపోయి ఈ సమయానికి ప్రక్రియ ప్రారంభమయ్యేది. ఉన్నత విద్యా మండలి నిర్వాకంతో 3,200 పోస్టుల భర్తీ ఎటూ కాకుండా ఆగిపోయింది. పోనీ రేషనలైజేషన్ సక్రమంగా చేసినా న్యాయ వివాదాలు లేకుండా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగేది. పోస్టుల భర్తీ చేయడం ఇష్టంలేకే ప్రభుత్వం ఇలా చేసిందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. మొత్తంగా చూస్తే ఎన్నికలకు ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అన్న విధంగా నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం నిండా ముంచింది.

చివర్లో నోటిఫికేషన్లు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకే ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది. 89 పోస్టులకు ఇటీవల మరో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇక, గ్రూప్-2 ఉద్యోగాల్లో ప్రభుత్వం నిరుద్యోగులను ఇంకా దారుణంగా మోసం చేసింది. నాలుగున్నరేళ్లపాటు ఒక్కటంటే ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఎన్నికలు దగ్గరికొస్తున్నందున విమర్శలు పెరగడంతో 890 పోస్టుల ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. తాజాగా డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్లు, ఇతరత్రా కొన్ని పోస్టుల భర్తీకి గత వారం నోటిఫికేషన్లు జారీచేసింది. ఈ మొత్తం నోటిఫికేషన్లకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయి, పరీక్షలు జరిగే సమయానికి ఎన్నికలు వస్తాయి. ఇక వాటి ప్రక్రియను పూర్తి చేసి ఉద్యోగాలు ఇవ్వడం వచ్చే ప్రభుత్వంలోనే జరుగుతుంది. అంటే ఈ ప్రభుత్వంలో నిరుద్యోగులకు నోటిఫికేషన్లు మాత్రమే మిగిలాయి.

డీఎస్సీ మోసం

2019 ఎన్నికలకు ముందు అప్పటి విపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీల్లో కీలకమైంది మెగా డీఎస్సీ. అధికారంలోకి రాగానే 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తానని జగన్ పదే పదే ఊదరగొట్టారు. దీంతో డీఎస్సీ ఆశావహులు ఆయనకు జైకొట్టారు. అయితే, అధికారంలోకి వచ్చాక డీఎస్సీ హామీని అటకెక్కించి మడమ తిప్పేవారు. అంతే కాదు.. మెడా డీఎస్సీ మాట అటుంచితే కనీసం ఒక్క పోస్టును కూడా జగన్ సర్కారు భర్తీ చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది టెట్ అర్హత సాధించిన నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు అదిగో ఇదిగో అంటూ మాయ మాటలు చెబుతూ వచ్చిన ప్రభుత్వ పెద్దలు, కొంతకాలం నుంచి డీఎస్సీ మాటే మరిచిపోయారు.

గతేడాది 2.54 కోట్ల మందికి శ్రీవారి దర్శనం

▸ రూ.1,403.74 కోట్ల హుండీ ఆదాయం

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గతేడాది తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని 2.54 కోట్ల మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ ద్వారా 1,403.74 కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. జనవరిలో 20.78 లక్షల మంది దర్శించుకోగా హుండీ ఆదాయం రూ.123.07 కోట్లు లభించింది. ఫిబ్రవరిలో హుండీ ద్వారా రూ.114.29 కోట్లు రాగా, 18.42 లక్షల మందికి దర్శించుకున్నారు. మార్చిలో 20.57 లక్షల మంది దర్శించుకోగా, రూ.120.29 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది. ఏప్రిల్‌లో 20.95 లక్షల మంది దర్శించుకోగా, రూ.114.12 కోట్లు సమకూరింది. మేలో 23.38 లక్షల మంది దర్శించుకోగా రూ.109.99 కోట్లు లభించింది. జూన్‌లో 23 లక్షల మంది దర్శనం చేసుకోగా రూ.116.14 కోట్ల హుండీ ఆదాయం లభించింది. జూలైలో రూ.129.08 కోట్ల హుండీ ఆదాయం రాగా, 23.23 లక్షల మంది దర్శించుకున్నారు. ఆగస్టులో 22.25 లక్షల మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.120.05 కోట్లు వచ్చింది. సెప్టెంబరులో 21.01 లక్షల మంది దర్శించుకోగా, రూ.111.65 కోట్లు లభించింది. అక్టోబరులో రూ.108.65 కోట్ల హుండీ ఆదాయం రాగా, 21.75 లక్షలమంది స్వామి సేవలో పాల్గొన్నారు. నవంబరులో 19.73 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా, రూ.108.46 కోట్లు వచ్చింది. డిసెంబరులో రూ.116.07 కోట్లు హుండీ ఆదాయం రాగా 19.16 లక్షల మంది స్వామి దర్శనం చేసుకున్నారు. గతేడాది జనవరి 3న వైకుంఠ ఏకాదశి సందర్భంగా రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం రూ.7.68 కోట్లు లభించగా, ఇటీవల వైకుంఠ ఏకాదశి రోజు రూ.5.05 కోట్లు లభించింది. కాగా.. కొవిడ్ అనంతరం 2022 మార్చి నుంచి ప్రత్యేక దర్శనాలతో పాటు టోకెన్ రహిత దర్శనాలు, ఆర్జిత సేవలన్నీ ప్రారంభమైన క్రమంలో హుండీ ఆదాయం ప్రతి నెలా రూ.100 కోట్లు దాటుతోంది. 2022 మార్చి నుంచి డిసెంబరు వరకు రూ.1,291.69 కోట్ల హుండీ ఆదాయం లభించింది.

22న రామజ్యోతులు వెలిగించాలి

▸ 500 ఏళ్ల త్యాగాల ఫలితమే రామమందిర నిర్మాణం: కిషన్‌రెడ్డి



తిరుమల ఆలయం ముందు కిషన్‌రెడ్డి

తిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి హిందువూ ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు రామజ్యోతులను వెలిగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. హిందూ బంధువులకు, దేశ, ప్రపంచంలో ఉన్న భారతీయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది మన దేశానికి చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక సమస్యలు ఈ ఏడాదిలో పరిష్కారమయ్యే అవకాశముందన్నారు. అందులో భారతదేశం చాలా కీలకపాత్ర పోషించనుందని తెలిపారు. దేశ అభివృద్ధి కోసం ప్రజలందరూ ఐకమత్యంగా కృషి చేయాల్సిన అవసరముందని సూచించారు. హిందువుల ఆకాంక్ష అయిన అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయి జనవరి 22వ తేదీన ప్రాణప్రతిష్ఠ జరుగనుందని, 500 ఏళ్ల త్యాగాల ఫలితంగా రామమందిర నిర్మాణం జరుగుతోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న క్రమంలో జనవరి 22వ తేదీ సాయంత్రం ప్రతి ఒక్కరూ ఐదు రామజ్యోతులు వెలిగించి భక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

బసవతారకం ఆస్పత్రిలో కార్ టి సెల్ థెరపీ

▸ తెలుగు రాష్ట్రాలలో ఇక్కడే తొలిసారి

▸ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూపు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా కార్ టి సెల్ థెరపీని హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. దీని ద్వారా అత్యాధునిక జెనెటిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరంలోని టి సెల్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. మందులతో అదుపులోకి రాని కేన్సర్ సెల్స్‌పై పోరాడేలా చేసి.. లింఫోమా రకానికి చెందిన బ్లడ్ కేన్సర్ రోగుల జీవిత కాలాన్ని పెంపొందిచవచ్చని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా 'స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్ టి సెల్ థెరపీ ప్రారంభం అనంతరం ఆస్పత్రి సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ స్టెమ్ సెల్, జెనెటిక్ ఇంజనీరింగ్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కేన్సర్ చికిత్సలో ఎంతో పురోగతి సాధించామన్నారు. భవిష్యత్‌లో కృత్రిమ మేధ, నానో టెక్నాలజీ, మిషన్ లెర్నింగ్ వంటివి వైద్య శాస్త్రంలో పెనుమార్పులు తీసుకొస్తాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో తమ ఆస్పత్రి ఎప్పటికీ ముందంజలో ఉంటుందన్నారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ ఆస్పత్రిలోని ట్రాన్స్‌ప్లాంట్ విభాగాన్ని దేశంలోనే అత్యుత్తమంగా అభివృద్ధి చేశామన్నారు.



బసవతారకంలో 'కార్ టి సెల్ థెరపీ'ని ప్రారంభిస్తున్న వైద్యులు

500 పైగా స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ థెరపీలను పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్ ద్వారా పేషెంట్ కౌన్సిలర్లు, సోషల్ వర్క్ నిపుణులు, వైద్యులు ట్రాన్స్‌ప్లాంట్ సర్వైవర్స్‌తో నిరంతరం సంప్రదింపుల్లో ఉంటారని, అవసరమైన వారికి మార్గదర్శనం చేస్తారని వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో జేఎస్ఆర్ ప్రసాద్, వైద్యులు డాక్టర్ టీఎస్‌రావు, డాక్టర్ కల్పనా రఘునాథ్, డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, డాక్టర్ పవన్, డాక్టర్ వీరేంద్ర, పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

రెండు ప్రమాదాల్లో ఐదుగురు మృతి



ఏలూరు జిల్లా కనసానపల్లిలో ఇద్దర్ని మింగిన నేలబావి





ప్రకాశం జిల్లా ప్రమాదంలో దగ్ధమైన బొలేరో, మోటార్‌సైకిల్

▸ ప్రకాశం జిల్లాలో బొలేరో-మోటార్ సైకిల్ ఢీ

▸ ముగ్గురు స్నేహితుల దుర్మరణం

▸ ఏలూరు జిల్లాలో నేలబావిలోకి బైక్

▸ ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారపేట/ఆగిరిపల్లి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో విషాదం నెలకొంది. ప్రకాశం, ఏలూరు జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఐదుగురు స్నేహితులు మృతిచెందారు. ఎదిగొచ్చిన కుమారులు మృతిచెందడంతో ఆయా కుటుంబాలను ఓదార్చడం ఎవరితరం కాలేదు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం పాపాయిపల్లె గ్రామానికి చెందిన నల్లబోతుల పవన్(20), నల్లబోతుల శ్రీనివాస్(21), పిక్కిల్ రాహుల్(21) స్నేహితులు. వీరు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని అనంతరం సోమవారం వేకువజామున 4 గంటల సమీపంలో టీ తాగేందుకు బేస్తవారపేట నుంచి జాతీయ రహదారిపై ఉన్న పందిళ్లపల్లి టోల్‌ప్లాజా వద్దకు బయలుదేరారు. మార్గమధ్యలో చెట్టిచర్ల బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం బైకు ఢీకొన్నాయి. దీంతో ఒక్కసారిగా బైకు నుంచి మంటలు చెలరేగి రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. మోటార్‌సైకిల్‌పై ఉన్న పవన్ ఘటనా స్థలంలోనే మంటల్లో చిక్కుకొని మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు రోడ్డుపక్కన పడి మృతిచెందారు. మరో ఘటనలో ఎన్టీఆర్ జిల్లా నున్నకు చెందిన శెట్టి సాయికుమార్, నున్న రాకేష్ స్నేహితులు. నూతన సంవత్సరం సందర్భంగా రాకేష్ సమీప బంధువు అయిన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లికి చెందిన ఓ వ్యక్తి మామిడితోటలో వేడుకలు జరుపుకొనేందుకు తమతో పాటు విజయవాడ మొగల్రాజపురానికి చెందిన తలశిల కృష్ణచైతన్యను తీసుకువెళ్లారు. పార్టీ అనంతరం సోమవారం ఉదయం ఇళ్లకు బయల్దేరారు. ఈ క్రమంలో గేదెలు అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నంలో సమీపంలోని నేలబావిలోకి వీరి బైక్ దూసుకుపోయింది. పార్టీలో పాల్గొని వీరి వెనుకే వస్తున్న మరో ఇద్దరు అక్కడే పొలంలో ఉన్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు రాకేష్‌ను బావి నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కృష్ణచైతన్య(24), సాయికుమార్(24) బావిలోనే మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు నేలబావి నుంచి నీటిని బయటకు తోడించి మృతదేహాలను, ద్విచక్ర వాహనాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం వీరి మృతదేహాలను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







సుంకర రాజేంద్రప్రసాద్, సంపర శ్రీనివాసరావు, సప్పా రమేష్‌బాబు

'ఐలూ' వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుంకర రాజేంద్రప్రసాద్

▸ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా సంపర శ్రీనివాస్, సప్పా రమేష్ బాబు

విజయవాడ లీగల్, జనవరి 1: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా సంపర శ్రీనివాసరావు, సప్పా రమేష్‌బాబు ఎన్నికయ్యారు. గతేడాది డిసెంబరు 29 నుంచి 31వ తేదీ వరకు కోల్‌కతాలో జరిగిన మహాసభల్లో వీరు ఎన్నికయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 750 మంది ప్రతినిధులు న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, భారత న్యాయవ్యవస్థకు ఎదురవుతున్న సవాళ్లపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను రక్షించుకోవాలనే నినాదంతో జరిగిన ఈ మహాసభలను సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ అశోక్ కుమార్ గంగూలీ, జస్టిస్ దీపాక్ గుప్తాలు ప్రారంభించారు. కాగా.. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ న్యాయవ్యవస్థలో అధికార యంత్రాంగం చొరబాటుకు అవకాశం కల్పిస్తున్న ప్రజావ్యతిరేక చట్టమైన 'ఏపీ భూ హక్కు చట్టం-2022'ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐలూ రాష్ట్ర కార్యదర్శి నల్లూరి మాధవరావు ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఐలూను జాతీయ స్థాయిలో పటిష్టపరుస్తామని న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని ఎదుర్కొంటామని, అందుకోసం ప్రజాఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు.

రెండో విడత ఆరోగ్య సురక్ష!

▸ నేటి నుంచి జిల్లాల్లో 13,945 శిబిరాలు

▸ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్టు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. రెండో దశలో నెల పాటు రాష్ట్రంలో 13,945 ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నారు. వీటిలో 10,032 శిబిరాలను గ్రామాల్లో, 3,583 శిబిరాలను పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో 12,423 ఆరోగ్య శిబిరాలను నిర్వహించి 1,64,982 మంది రోగులను ఆస్పత్రులకు తరలించి, ఉచిత వైద్య సేవల్ని అందించినట్టు కృష్ణబాబు తెలిపారు. రెండో దశలో వైద్య శిబిరాలను విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తారన్నారు. ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులతోపాటు ఒక పీహెచ్‌సీ వైద్యుడు అందుబాటులో ఉంటారన్నారు. శిబిరాల్లో 14 రకాల మందులు ఏడు రకాల కిట్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. మూడో దశలో చేపట్టే ఫాలోఅప్ సేవల్లో ఫ్యామిలీ డాక్టర్, సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు భాగస్వాములవుతారని వివరించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాల్లో ఎలా జరుగుతోందో తెలుసుకునేందుకు ప్రత్యేక అధికారులను కృష్ణబాబు నియమించారు. వీరు జిల్లాల్లో పర్యటించి పరిశీలిస్తారు.

పార్టీ ప్రచారంలా..

తొలి విడతలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు వైసీపీ జెండాలు, వైసీపీ కార్యకర్తలతో నిండిపోయాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రభుత్వ ఖర్చుతో వైసీపీ ఎన్నికల ప్రచారం చేయించుకున్నట్లుందని విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో లేక చాలా గ్రామాలు, పట్టణాల్లో పీజీ విద్యార్థులు, హౌస్‌సర్జన్ విద్యార్థులతో శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాల నిర్వహణ సరిగా లేదని కొంత మంది వైసీపీ ఎమ్మెల్యేలే పెదవి విరుస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'చరిత్రాత్మకం'

ఈశాన్యంలోని ఏ సాయుధ తిరుగుబాటు సంస్థతో ఒప్పందం కుదిరినా, మరీ ముఖ్యంగా, అందులో కేంద్రం భాగస్వామి అయితే, అది కచ్చితంగా 'చరిత్రాత్మక'మే అవుతుంది. అంతిమంగా సదరు ఒప్పందం ఏ మేరకు అమలవుతుందో, క్షేత్రస్థాయిలో అది నెరపే ప్రభావం ఏమిటన్నవి వేరే విషయాలు. అసోంకు చెందిన సాయుధ వేర్పాటువాద సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం— ఉల్ఫా'తో మూడురోజుల క్రితం త్రైపాక్షిక ఒప్పందం కుదిరినప్పుడు హోంమంత్రి అమిత్ షా దానిని చరిత్రాత్మకంగా అభివర్ణించారు. కేంద్రం, రాష్ట్రం, సదరు సంస్థ మధ్య కుదిరిన ఈ ఒప్పందం అసోంలో దశాబ్దాలుగా సాగుతున్న తిరుగుబాటుచర్యలకు తెరదించుతుందని, శాంతిని నెలకొల్పి రాష్ట్రం ఇక ప్రగతిపథంలో నిర్నిరోధంగా పరుగులు తీస్తుందని అమిత్ షాతోపాటు, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సగర్వంగా ప్రకటించారు. 1985లో రాజీవ్ గాంధీ చేసుకున్న అసోం ఒప్పందం గురించి మాటమాత్రంగా కూడా ప్రస్తావన చేయకుండా, అరబింద రాజ్‌ఖోవా సారథ్యంలోని ఒక వర్గంతో కుదుర్చుకున్న ఇప్పటి ఒప్పందాన్ని పాలకులు ఘనంగా కీర్తించారు.

పరేష్ బారువా నేతృత్వంలో ఇంకా సాయుధపోరాట మార్గాన్నే అనుసరిస్తున్న ఒక వర్గాన్ని పక్కనబెట్టి, 2011లోనే రాజీకీ, చర్చలకు సిద్ధపడిన రాజ్‌ఖోవా వర్గంతో ప్రస్తుత ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం, సదరు సంస్థ రద్దవుతుంది, వీరంతా ఆయుధాలు వదిలేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతారు. కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షన్నరకోట్ల అభివృద్ధి పనులు చేపడతాయి, రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేకంగా ఓ ఐదువేలకోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ ఇస్తుంది. డీలిమిటేషన్ సహా అన్ని విషయాల్లోనూ భవిష్యత్తులో సైతం స్థానికుల ప్రయోజనాలు దెబ్బతినకుండా కేంద్రం జాగ్రత్తలు తీసుకుంటుంది. బారువా వర్గాన్ని వదిలిపెట్టడం సరికాదని, ఉల్ఫాతో అసోంకు ఉన్న ముప్పు పూర్తిగా తొలగిపోవాలంటే ఆయనను కూడా కలుపుకొనిపోవాలని పదిహేను పక్షాల ఏజీపీ అంటోంది. అసోం సహా పలు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయానికి రాజఖోవా వర్గం పరోక్ష సహకారం ఉన్నదని బారువా సహా చాలామంది ఆరోపణ. గత కొద్దినెలల్లోనే మూడు అతి పెద్ద బాంబు పేలుళ్ళతో, ప్రధానంగా ఈశాన్య అసోంలోని సైనికస్థావరం సమీపంలో నవంబరులో జరిపిన దాడితో బారువా వర్గం తన ఉనికిని చాటుకుంది. బలగం తక్కువే అయినా, శాంతిని విచ్ఛిన్నం చేయగల సమర్థత దానికి బలంగానే ఉన్నది.

సరిగ్గా మూడేళ్ళక్రితం, నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్ (ఎన్‌డిఎఫ్‌బి)తో ఇదేవిధంగా ఓ త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. స్వతంత్ర బోడోరాష్ట్రం కోసం తీవ్రస్థాయిలో పోరాడుతున్న ఆల్ బోడో స్టూడెంట్ యూనియన్ (ఎబిఎస్‌యు) ఈ ఒప్పందంలో ఒక కీలకభాగస్వామి. స్వతంత్ర రాష్ట్రం డిమాండ్ వినా, సమస్త బోడో ప్రజల భాష, సంస్కృతీ పరిరక్షణకు, వారి రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి ఈ ఒప్పందం హామీ పడింది. అన్ని నిషేధిత బోడో గ్రూపులతో జరిగిన ఈ ఒప్పదంతో అవన్నీ రద్దయిపోయి, అసోం ముక్కలయ్యే ప్రమాదం ముగిసిపోయిందంటూ అప్పట్లో దానిని కూడా అమిత్ షా చరిత్రాత్మకమనే అభివర్ణించారు. ఇప్పుడు ఉల్ఫాలోని ఒక వర్గంతో కేంద్రం త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకున్న తరువాత, మూడేళ్ళనాటి తమ ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం వీసమెత్తు గౌరవించలేదని, పైగా దాని స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నదంటూ ఏబీఎస్‌యు అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. ఒప్పందంలో హామీ ఇచ్చిన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు దక్కని పక్షంలో మళ్ళీ ఉద్యమాలు తప్పవని హెచ్చరిక చేశారు.

ఎంతోకాలంగా చర్చలకు సానుకూలంగా బలమైన రాజ్‌ఖోవా వర్గంతో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో, బారువా మీద కూడా ఒత్తిడిపెరిగి అస్త్రసన్యాసం చేసినపక్షంలోనే అసోంకు పూర్తిశాంతి చేకూరినట్టు. 'విదేశీ'యులకు వ్యతిరేకంగా, స్థానికుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంతో సుదీర్ఘకాలంగా సాగుతున్న పోరాటాలు ఇటువంటి ఒప్పందాలతో తాత్కాలికంగా చల్లారవచ్చు. సార్వత్రిక ఎన్నికల ముందు వాటిని తమ విజయంగా చూపవచ్చు, చరిత్రాత్మకమని అభివర్ణించవచ్చు. కానీ, అమిత్ షా హామీ ఇచ్చినట్టు కామాలు, ఫుల్‌స్టాప్‌లతో సహా అవి అమలైనప్పుడు మాత్రమే, పోరాటాలు తిరిగి రాజుకోవు, మొండికేసిన గ్రూపులు కూడా దారికివస్తాయి. తమకు అనాదిగా అన్యాయం జరుగుతున్నదని భావిస్తున్న ప్రజలు ఈ ఒప్పందాలతో తమ ప్రయోజనాలకు భద్రత చేకూరిందని నమ్మడం ముఖ్యం.

శ్రీరామతత్వమే భారతీయత

సమస్త హిందువులూ జనవరి 22 ఎప్పుడొస్తుందా అని వేచి చూస్తున్నారు. అయోధ్యలో రామ జన్మభూమిలో శ్రీరాముడి మందిరాన్ని ప్రతిష్ఠాపించే రోజు అది. ప్రతి హిందువు ఇంటిలో పూజించే ఇష్టదైవం శ్రీరాముడు. భారత జాతీయ జీవనంలో రాముడు, రామాయణానికి ఉన్న ప్రాధాన్యం అపారమైనది. రామాయణం కొన్ని దశాబ్దాలుగా భారతీయుల సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తోంది. అది మానవ ఉద్వేగాలు, నైతిక సందిగ్ధాల సమ్మేళనం. రామాయణం అనువాదం కాని భాష అంటూ దేశంలో లేదు. రామాయణ గాథ అన్ని భాషల్లో, సాహిత్యాల్లో సృజనాత్మకతను ప్రతిఫలించింది. ప్రతి జానపద సంప్రదాయంలోనూ శ్రీరాముడున్నాడు. 'రామ్' అన్న పేరు లేకుండా దేశంలో ఏ కులమూ, మతమూ లేదు. సిక్కుల పవిత్ర గ్రంథం గురుగ్రంథ్ సాహిబ్‌లో శ్రీరాముడి పేరు కొన్ని వేలసార్లు ప్రస్తావితమయింది. తులసీదాస్ నుంచి సూరదాస్ వరకూ, కబీర్ నుంచి తుకారాం వరకూ, అస్సాంలో శంకర దేవ్ నుంచి తమిళనాడులో కంబ, తెలుగులో విశ్వనాథ వరకూ అనేకమంది శ్రీరాముడుని అనేక రీతుల్లో అభివర్ణించారు. పర్షియన్ కవి అల్లామా ఇక్బాల్ కూడా శ్రీరాముడిని 'ఇమామ్ ఏ హింద్' (భారత అధ్యాత్మిక నాయకుడు)గా అభివర్ణించారు. శ్రీరామ తత్వమే భారతీయత అన్న విషయంలో సందేహంలేదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

సనాతన ధర్మానికి, సంస్కారానికి, పితృవాక్య పరిపాలనకూ, దుష్ట సంహారానికీ పేరొందిన శ్రీరాముడు మనదేశంలో అనాదిగా నెలకొన్న విలువలకు ప్రతీక. ఆ విలువలు సార్వత్రికమైనవి, శాశ్వతమైనవి. అయోధ్యలో జన్మించిన శ్రీరాముడి ఆనవాళ్లు శ్రీలంక వరకు అడుగడుగునా ఉన్నాయి. రాముడి పాదాలను దేశమంతా ప్రజలు పూజిస్తారు. కోదండ రాముడి మందిరం లేని ఊరు మన దేశంలో లేదు. కోట్లాది భారతీయుల ఇళ్లలో ఇప్పటికీ రామకోటి రాసేవారున్నారు. మహాత్మాగాంధీయే స్వయంగా రామరాజ్యాన్ని భారతదేశానికి ఆదర్శంగా భావించారు. చివరి క్షణంలో కూడా ఆయన హే రామ్ అని తనువుచలించారు. రాముడు ఒక అదర్శవంతమైన రాజు. ఉన్నత మానవ లక్షణాల సమ్మేళనం. రామరాజ్యం అనేది సుపరిపాలనకు సంకేతం. బీజేపీ ఈ సుపరిపాలననే కోరుకుంటుంది.

అలాంటి శ్రీరాముడి చరిత్రాత్మక మందిరం ఇప్పుడు ప్రారంభమవుతున్నదంటే ప్రతి భారతీయుడి మేను భక్తితో పులకరిస్తోంది. ప్రధాని మోదీ పిలుపునిచ్చినట్లుగా జనవరి 22న ప్రతి భారతీయుడి ఇల్లూ శ్రీరామ జ్యోతి దీపకాంతులతో దీపావళి రోజు మాదిరి శోభాయమానం కానున్నాయి. ఘర్ ఘర్ యాత్ర పేరుతో జనవరి 1 నుంచి 15 వరకు దేశంలో ఇంటింటికీ చేరుకుని అయోధ్యలో రామమందిర నిర్మాణానికి మోదీ ప్రభుత్వం చేసిన కృషి వివరించేందుకు బీజేపీ ఉద్యుక్తమైంది.

భారతదేశంలో ప్రజల నమ్మకాలు, విశ్వాసాలు, దైవభక్తి చరిత్రతో ఏ విధంగా ముడివేసుకుని ఉన్నాయో భారతీయ జనతా పార్టీకి తెలిసినంతగా మరే పార్టీకి తెలియదు. సోమనాథ మందిరం మాదిరే అయోధ్యలో శ్రీరామ మందిరం కూడా ఒక ముస్లిం దురాక్రమణదారు దాడికి గురైందన్న చరిత్ర తెలిసినా ఆ పార్టీలన్నీ ప్రజల నమ్మకాలను అవహేళన చేసి విశ్వాసాలతో చెలగాటమాడుకున్నవే. కొన్ని దశాబ్దాల పాటు శ్రీరాముడిని ఆయన జన్మభూమిలోనే బందీ చేసిన పార్టీలవి. అయనను ప్రజలు దర్శించకుండా అడ్డుకున్న పార్టీలివి. న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి శ్రీరాముడికే న్యాయం జరగకుండా నిరోధించిన పార్టీలవి. ఎవరైతే శ్రీరాముడి మందిరం స్థానంలో కట్టడం నిర్మించారో వారి తరఫున వకాల్తా పుచ్చుకున్న పార్టీలవి. కరసేవ చేసేందుకు వచ్చిన వేలాది మందిపై కాల్పులు జరిపి అయోధ్య వీధుల్లోనూ, దేశ వ్యాప్తంగానూ ప్రాణాలు బలిగొన్న పార్టీలవి. కాంగ్రెస్ పార్టీ ఊగిసలాట ధోరణి, ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల ఎప్పుడో పరిష్కారం కావల్సిన అయోధ్య వివాదం కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా మిగిలిపోయింది. లౌకిక వాదానికి కాంగ్రెస్, ఇతర పార్టీలు తప్పుడు అర్థాన్నిచ్చాయి. మన రాజ్యాంగ నిర్మాతల ప్రకారం లౌకికవాదం అంటే సర్వమతాల పట్ల సమభావంతో ఉండటం. మన చరిత్రను, సంప్రదాయాన్నీ తిరస్కరించినట్లు ఎంత మాత్రమూ కాదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం భారతీయ జనతా పార్టీ 1990లలో చేపట్టిన ఉద్యమానికి అపూర్వ ప్రతిస్పందన లభించింది. 1990 సెప్టెంబర్ 25న సోమనాథ్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు లాల్ కృష్ణ ఆడ్వాణీ చేపట్టిన రథయాత్రను జెండా ఊపి ప్రారంభించింది నాడు సాధారణ నాయకుడుగా ఉన్న నరేంద్రమోదీ. ఇప్పుడు అయన చేతుల మీదుగానే అయోధ్యలో రామమందిర ప్రారంభం కావడం అపూర్వం.



శ్రీరాముడిని 'ఇమామ్ ఏ హింద్' (భారత ఆధ్యాత్మిక నాయకుడు)గా అల్లామా ఇక్బాల్ అభివర్ణించారు. రామరాజ్యం అనేది సుపరిపాలనకు సంకేతం. ఈ సుపరిపాలననే భారతీయ జనతా పార్టీ కోరుకొంటోంది. దేశప్రజల అభ్యున్నతికై ఆ సుపాలనను అందించేందుకు అది నిబద్ధమయింది.

ప్రధాని మోదీకి భారతదేశ ఆత్మ తెలుసు కనుకనే అభివృద్ధితో సమానంగా ఆధ్యాత్మికతకు విలువ ఇచ్చారు. 'నా శరీరంలో ప్రతి కణంలో దైవభక్తి ఉన్నది. ఒక భారతీయుడుగా నేను కూడా రామమందిర ప్రతిష్ఠాపన కోసం ఆతురతతో ఎదురుచూస్తున్నాను. మనం 550 సంవత్సరాలు వేచి చూశాం. ఇక మరికొన్ని రోజులు వేచి చూస్తే చాలు..' అని మోదీ రెండు రోజుల క్రితం అయోధ్యలో ప్రకటించారు. అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణానికి అన్ని అడ్డంకులూ తొలగించిన మోదీ శ్రీరాముడి నగరంలో రూ. 15వేల కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి అయోధ్య భారతదేశ చిత్రపటంలో సుస్థిరస్థానం పొందేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. వాల్మీకి మహర్షి రామాయణంలో వర్ణించిన మాదిరే అయోధ్యా నగరి ఆధునిక వసతులతో ఒప్పారేలా నిర్మించేందుకు మోదీ కంకణం కట్టుకున్నారు. 1943 డిసెంబర్ 30న నేతాజీ సుభాష్ చంద్రబోస్ అండమాన్‌లో త్రివర్ణ పతాకం ఎగుర వేశారు. 2023 డిసెంబర్ 30న నరేంద్రమోదీ నూతన భారతానికి అనుగుణంగా నూతన అయోధ్య నగరాన్ని ప్రారంభించారు. అయోధ్యలో నిర్మించిన విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు పెట్టి మోదీ ప్రారంభించారు.

ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే తన ప్రాచీన వారసత్వాన్ని కాపాడుకోవాలి. వర్తమానానికీ, గతానికీ మధ్య వారధి నిర్మిస్తూనే భవిష్యత్‌కు బాటలు వేయాలి. మోదీ ప్రభుత్వం చేస్తున్నదదే. అభివృద్ధి పథకాలను అమలు చేయడమే కాదు, వాటి ప్రయోజనం పొందినవారిని చేరుకోవాలన్నదే మోదీ సంకల్పం. డిసెంబర్ 30న ఆయన ఉజ్వల యోజన వల్ల ప్రయోజనం పొందిన ఒక దళిత లబ్ధిదారుడి ఇంటిని సందర్శించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో తన ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన ప్రతి ఒక్కరినీ కలుసుకొమ్మని ఆయన నేతలను ఆదేశించారు. తాను స్వయంగా లబ్ధిదారులను కలుసుకోవడం ప్రారంభించారు. పథకాల అమలు పట్ల చిత్తశుద్ధి గల నేత చేసే పని ఇది.

శ్రీరాముడి మందిర నిర్మాణాన్ని రాజకీయం చేయాల్సిన అవసరం బీజేపీకి లేదు. ఎందుకంటే రామజన్మభూమి ఉద్యమాన్ని నిర్వహించింది బీజేపీయే అని ఈ దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అయోధ్యలో నిర్మిస్తున్నది శ్రీరాముడి మందిరం కాదు. బీజేపీ మందిరం అని ఒక కాంగ్రెస్ నేత అన్నారు. బీజేపీ ప్రతి నేత హృదయంలో శ్రీరాముడి మందిరం ఉంటుందని ఈ దేశ ప్రజలకు తెలుసు.

ఆధునిక ప్రపంచం అసలు గుట్టు ఏమిటి?

సృష్టి రహస్యంపై ఆసక్తిలేని మనిషి ఉండడు. అది ప్రేరేపిస్తున్న అన్వేషణే మన చరిత్ర అయింది. ఆ క్రమంలోనే మతాలు పుట్టాయి. పురాణాలు పురుడు పోసుకున్నాయి. సాహిత్యాలు ఉద్భవించాయి. తత్వ జిజ్ఞాసలు ఎదిగాయి. విజ్ఞానాలు వికసించాయి. కాలక్రమంలో లోక సృష్టిపైనే కాదు.. సమాజ పుట్టుక గురించీ కొత్తచూపు మొదలైంది. ఆర్థిక అంతరాల మూల కారణాలపై పరిశోధనలు పెరిగాయి. ధనిక పేద సమాజాల చరిత్రపై లోతైన విశ్లేషణలు మొదలయ్యాయి. అట్లా వచ్చిన వాటిల్లో 'రాబట్ బి మార్క్స్' రాసిన 'ఆధునిక ప్రపంచ మూలాలు' అన్న రచన చాలా ముఖ్యమైంది. ఎంతో చరిత్ర కలిగిన దేశాలు వెనుకబడి పోవటం అందరికీ తెలిసిందే. పరాయి పాలనలోనూ మగ్గిపోయాయి. స్వంతపాలన కోసం విన్నపాలూ విప్లవాలూ చేయాల్సి వచ్చింది. ఆర్థిక, సాంకేతిక పరాధీనతలు సర్వసాధారణం అయ్యాయి.

ఈ దుస్థితికి కారణాలేమిటి? మన సనాతన సంస్కృతుల్లోనే లోపం ఉందా? ఆర్థిక పరుగుకు పనికిరాని మత నమ్మకాలు, విలువల్లో మనం కూరుకుపోయామా? కార్యకారణ సంబంధాలను వెతికే శాస్త్ర విజ్ఞానాన్ని విస్మరించి విఫల జీవులం అయ్యామా? ప్రయోగశీలతకు యూరపు సంస్కృతి మాత్రమే పెద్దపీట వేసిందా? సంప్రదాయాలను సమూలంగా ప్రశ్నించిన మహామహులు యూరపులోనే పుట్టి శాస్త్ర సాంకేతిక ఆధిక్యతను సంపాదించి పెట్టారా? వీటన్నిటికీ అవుననే సమాధానాలకు మనం అలవాటు పడిపోయాం. యూరపు మేధావులూ ఆ భావాల్నే కలగచేశారు. వీటిని ప్రశ్నించటం కొంతకాలం నుంచి మొదలైనా వాటి ప్రభావం ఇంకా బలంగానే ఉంది. ఇప్పటికీ పాశ్చాత్య ప్రమాణాలను, ఆర్థిక ఉన్నతిని అందుకోవటమే మనకు లక్ష్యంగా ఉంది.

వ్యవసాయం, చేతి వృత్తులపై ఆధారపడిన సమాజాలన్నీ వేల ఏళ్లు కొనసాగాయి. ఈ రంగాల్లోని శ్రమజీవులు సృష్టించిన సంపదలో భారీగా వాటాలు రాబట్టి రాజులు, జమిందార్లు ఆధిపత్యం చలాయించారు. ఆధునిక ప్రపంచం ఆవిర్భావం అంటే ఈ సమాజం మౌలికంగా మారిపోవటమే. మరి కొత్త ప్రపంచం స్వభావం ఏమిటి? ప్రధానంగా అది నాలుగు పరిణామాల చుట్టూ తిరిగింది. ఇంకా తిరుగుతూనే ఉంది. అందులో మొదటిది.. పారిశ్రామికీకరణ ఊపందుకోవటం. రెండోది.. జాతీయ రాజ్యాలు (నేషన్ స్టేట్స్) ఏర్పడటం. మూడోది.. దేశాల మధ్యా దేశాల లోపలా ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరగటం. నాలుగోది.. పర్యావరణాన్ని కనీవినీ ఎరగని రీతిలో ప్రమాదకరంగా మార్చివేయటం. ఈ పరిణామాలు అభివృద్ధికి ఎంతగా కారణమయ్యాయో అంతే స్థాయిలో విధ్వంసాలనూ సంక్షోభాలనూ యుద్ధాలనూ సృష్టించాయి. 21వ శతాబ్దంలోనూ మనం దీన్నుంచి బయటపడలేదు. ప్రపంచాన్ని వణికిస్తున్న గ్లోబల్ వామింగ్, యుద్ధాలు, ఆర్థిక దోపిడీలే ఇందుకు నిదర్శనం.

ఈ నాలుగు పరిణామాలు జరక్క ముందు యూరపుకు ఆధిపత్యం లేదు. ఆసియానే చాలా వాటిల్లో అగ్రగామిగా ఉండేది. జనాభా, సాంకేతికత, పరిశ్రమలు, రాజ్యనిర్మాణం.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా ఆసియా ఆధిక్యత కనపడేది. ప్రపంచ జనాభా ఇప్పుడు 800 కోట్లు దాటింది. కానీ 1400 సంవత్సరంలో అది 38 కోట్లు మాత్రమే ఉండేది. అందులో 25 నుంచి 40 శాతం వరకూ చైనాలో ఉంటే భారత్‌లో మరో 20 శాతం మంది జీవించేవారు. యూరపులో 25 శాతం వరకూ ఉండేవారు. మిగిలిన జనాభా ముస్లిం రాజ్యాల్లోనూ, ఆఫ్రికా, అమెరికా ఖండాల్లోనూ ఉండేవారు. ఆనాడున్న 25 పెద్ద నగరాల్లో తొమ్మిది చైనాలో ఉండేవి. నాన్జింగ్ (చైనా) అత్యంత పెద్ద నగరం. రెండోది కర్ణాటకలోని మన విజయనగరం. ఇక మూడోది కైరో. ప్యారిస్ నాలుగో స్థానంలో ఉండేది. పెద్ద నగరాల్లో అయిదు మాత్రమే ఆనాడు యూరోపులో ఉండేవి. 1750 నాటికి ప్రపంచ జనాభా 100 కోట్లకు చేరుకున్నా దాని ప్రాంతీయ విస్తరణలో పెద్దగా మార్పు రాలేదు. ప్రపంచ ఆర్థిక సంపదలో మూడింట రెండు వంతుల వాటా భారత్, చైనాల నుంచే ఉండేది. వందేళ్ల తర్వాత అంటే 1850ల నాటికి పరిస్థితిలో స్పష్టమైన మార్పు వచ్చింది. యూరోపు ఆధిపత్యం దాదాపుగా స్థిరపడి పోయింది. ఇది ఎందుకు జరిగింది? యూరపు సంస్కృతి గొప్పతనం దానికి కారణం కాదు. అదే ఉంటే 1750లకు ముందూ యూరపు పలు రంగాల్లో అగ్రగామిగా ఉండేది. మరి కారణం ఏమిటి? కాలం కలిసొస్తే అనూహ్య ఘటనలు జరుగుతాయని మనం అనుకుంటాం కదా! అట్లాంటివే కొన్ని జరిగి యూరపు ఆధిక్యతకు దోహదం చేశాయి. ఇందులో ప్రధానమైంది అమెరికా ఖండాన్ని యాదృచ్ఛికంగా కనుక్కోటం.



ప్రపంచ జనాభా ఇప్పుడు 800 కోట్లు దాటింది. కానీ 1400 సంవత్సరంలో అది 38 కోట్లు మాత్రమే. ఆనాడున్న 25 పెద్ద నగరాల్లో తొమ్మిది చైనాలో ఉండేవి. నాన్జింగ్ (చైనా) అత్యంత పెద్ద నగరం. రెండోది కర్ణాటకలోని మన విజయనగరం. ఇక మూడోది కైరో. ప్యారిస్ నాలుగో స్థానంలో ఉండేది. పెద్ద నగరాల్లో అయిదు మాత్రమే ఆనాడు యూరోపులో ఉండేవి. 1850ల నాటికి పరిస్థితిలో స్పష్టమైన మార్పు వచ్చింది. యూరోపు ఆధిపత్యం దాదాపుగా స్థిరపడి పోయింది. ఇది ఎందుకు జరిగింది?



■ రాహుల్ కుమార్

వెయ్యి ఏళ్ల కిందట చైనా సాధించిన అభివృద్ధి ప్రభావం ఆనాటి ప్రపంచమంతా పడింది. ఆ తర్వాత కొన్నాళ్లకు అంటే 1400 నుంచి 1800 వరకూ ఇంకా పుంజుకుని ప్రబల ఆర్థిక శక్తిగా మారింది. కాస్త ఆలస్యంగానైనా భారత్ కూడా గణనీయ ప్రగతినే సాధించింది. కచ్చితంగా చెప్పుకోవాలంటే ప్రపంచ ప్రధాన ఉత్పత్తుల్లో 70 నుంచి 80 శాతం ఆసియాలోనే ఉత్పత్తి అయ్యేవి. చైనా సిల్కు, పింగాణీ, తేయాకుకు.. భారత వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలకు ఎనలేని గిరాకీ ఉండేది. వెండి నాణేల మారకం ఆధారంగా రెండు సమాజాల్లోనూ వ్యాపార లావాదేవీలు బాగా సాగేవి. దీంతో వెండికి విపరీతమైన డిమాండు ఏర్పడింది. అమెరికాలో అప్పనంగా దొరికిన వెండి యూరపు గతిని మార్చింది. ఆ వెండితో భారత్, చైనా ఉత్పత్తులను విరివిగా యూరపు వ్యాపారులు కొనుగోలు చేయటం మొదలు పెట్టారు. అప్పటికి ఉన్ని వస్త్రాల్లాంటి రెండుమూడు ఉత్పత్తులకు తప్ప దేంట్లోనూ యూరపుకు చెప్పుకోదగిన ప్రత్యేకత లేదు. ముఖ్యంగా భారత్, చైనాలకు అమ్మదగిన ప్రత్యేక వస్తువులు యూరపు దేశాల దగ్గర పెద్దగా లేనేలేవు. అమెరికా వెండితో ఆఫ్రికను బానిసలను కొని మళ్లీ అమెరికాకే తీసుకు పోయేవారు. అప్పటికే యూరపు వాసులు అంటించిన అంటువ్యాధులతో స్థానిక అమెరికన్లు కోట్లల్లో చనిపోయారు. 1491 నాటికి అమెరికా ఖండంలో 7 కోట్ల ప్రజలుంటే 1600 నాటికి ఆ సంఖ్య 80 లక్షలకు పడిపోయింది. పనికి మనుషులే దొరకకుండా పోయారు. క్రమేపీ బానిసల తరలింపు బాగా పెరిగింది. 1800 నాటికి 90 లక్షల మందిని పట్టుకెళ్లారు. బానిసల శ్రమతో చెరకు తోటలను పెంచారు. పత్తిని పండించారు. తయారైన చక్కెరను, ముడిపత్తిని భారీగా యూరపునకు తరలించారు. ఇక్కడో విచిత్రాన్ని చెప్పుకోవాలి. 1650 నాటికి శ్వేతజాతీయుల కంటే ఆఫ్రికన్లే అమెరికాలో అధిక సంఖ్యలో ఉండటమే ఆ విచిత్రం. కొల్లగొట్టిన బంగారం, వెండితో పాటు బానిసల శ్రమతో పండించిన పంటలు యూరపు వాసుల చేతుల్లో సంపద పోగు పడేలా చేసింది. దీనికి తోడు 1750 తర్వాత భారత్‌లాంటి దేశాల్లో నెలకొల్పిన వలసపాలనతో మొదలైన సంపద తరలింపూ దీనికి జోడైంది.

పారిశ్రామిక విప్లవం మొదలవ్వటానికి డబ్బులు ఒక్కటే సరిపోవు. అలా సరిపోతే అమెరికా నుంచి తరలించిన వెండి నిల్వలతో స్పెయిన్ అగ్రగామి పారిశ్రామిక దేశంగా ఎదిగి పోయేది. 1730–50ల నాటికి చైనాతో పాటు ఇంగ్లండు లాంటి దేశాల్లో అటవీ సంపదను విపరీతంగా వాడేశారు. పచ్చదనం చాలావరకూ హరించుకుపోయింది. లండన్‌లో చలికాచుకోటానికి కలప లభించని పరిస్థితి ఎదురైంది. అప్పుడే లండన్ చుట్టూ భూఉపరితలానికి చాల దగ్గరలో విస్తృతంగా బొగ్గు నిల్వలు ఉన్న విషయం బయటపడింది. చైనాకు ఆ అవకాశం దక్కలేదు. బొగ్గు వాడకం బ్రిటన్ గతినే మార్చివేసింది. ప్రకృతి ప్రసాదించిన ఈ వనరును మండించటంతో ఇనుము ఉత్పత్తి బాగా పెరిగింది. ఆవిరి శక్తి పెద్దఎత్తున ఉపయోగంలోకి వచ్చింది. క్రమేపీ వస్త్ర తయారీలో యంత్రాలను ప్రవేశపెట్టారు. బొగ్గుని తరలించటానికి రైలుమార్గాలను ఏర్పరచారు. క్రమేపీ ఒకటి తర్వాత ఒకటి అనేక పనులకు యంత్రాలు రూపొందాయి. ఆయుధాల తయారీలోనూ వాటి వాడకం మొదలైంది. నౌకా నిర్మాణంలో ఇనుము వాడకం పెరిగింది. వాటి నుంచి ఫిరంగులను ప్రయోగించటం ఆరంభమైంది. యూరపు ఆయుధ సంపత్తికి తూగలేని ఆసియా దేశాలు యుద్ధాల్లో ఓడిపోయాయి. దేశాలను ఓడించొచ్చు. కానీ పారిశ్రామిక ఆధిక్యతను అంత తేలికగా దెబ్బతీయలేరు. అది జరగాలంటే చైనా, భారత్ ఉత్పత్తులను పోటీ నుంచి తొలగించాలి. వాటి దిగుమతిపై అధిక సుంకాలు విధించి బ్రిటన్ వస్త్రపరిశ్రమలకు పోటీ లేకుండా చేశారు. ఆ తర్వాత వివిధ చౌక ఉత్పత్తులతో ఆసియా దేశాల మార్కెట్లను ముంచెత్తారు. క్రమేపీ ఆ దేశాలను ముడిసరుకు సరఫరా ప్రాంతాలుగా మార్చివేశారు.

జాతీయ రాజ్యాలు ఏర్పడటంలో యుద్ధాలు నిర్వహించిన పాత్ర అంతా ఇంతా కాదు. ఆసియాలో పెద్దపెద్ద సామ్రాజ్యాలు ఉంటే యూరపు ముక్కలు చెక్కలుగా పరస్పరం సంఘర్షించే దేశాలుగా విభజితమై ఉండేది. 1400 నాటికే వందల రాజ్యాలు ఉన్నాయి. 1000 నుంచి 1500 సంవత్సరం వరకూ యూరపు పాలకులకు యుద్ధాలే ప్రధాన వ్యాపకం. ప్రతిరోజూ ఏదో మూల యుద్ధాలు జరుగుతూనే ఉండేవి. ఆ యుద్ధ అవసరాల కోసమే రాజ్యాల కేంద్రీకరణ మొదలైంది. ఆ కేంద్రీకరణను బలోపేతం చేయటానికే జాతీయవాద భావాలు ఉనికిలోకి వచ్చాయి. అనేక యుద్ధాలకూ, ఉన్మాదాలకూ కూడా ఈ భావాలు తోడ్పడ్డాయి. దేశభక్తి సిద్ధాంతాలూ యుద్ధాల నేపథ్యం నుంచే పుట్టాయి. నిరంతర యుద్ధాలతో సైన్యాలను ఆధునికీకరించాల్సిన అగత్యం ఏర్పడింది. పారిశ్రామిక విప్లవం కలిగించిన ఆధిక్యతతో చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఇతర దేశాలను దోచుకోవటంతో అసమానతలు అసాధారణంగా పెరిగాయి. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని కొల్లగొట్టటం ఒకనాడు గొప్ప ప్రగతిశీల చర్య అయింది. 1970ల వరకూ ఈ విధ్వంసం ఆగకుండా సాగింది. అప్పటి నుంచి పెరుగుతున్న పర్యావరణ అవగాహనతో విధ్వంసం కాస్త నిదానించినా మానవజాతి ఇంకా ప్రమాదమార్గంలోనే ఉంది. సమగ్ర దృష్టితో చూస్తే ఆధునిక ప్రపంచ ఆవిర్భావంతో అంతా మంచే జరిగిందని చెప్పలేం. 500 ఏళ్ల చరిత్ర చెబుతున్న చేదు నిజం అదే. అందులో మంచి చెడులను సమీక్షించుకుని అడుగులు వేయకపోతే మానవ మనుగడకు భరోసా ఉండదు.


(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

వృద్ధులకు ప్రభుత్వమే ఆర్థిక సాంత్వన కల్పించాలి

తరతరాలుగా శ్రామిక ప్రజల కృషి, మేథోపరమైన ఆలోచన, సంపద సృష్టిలో వారి పోరాటం, నేటి ఆధునిక వ్యవస్థ ఏర్పాటుకు మూలం. పాత రాతియుగం నుంచి నేటి అణుయుగం వరకు జరిగిన ప్రతి 'వృద్ధి' మానవ శ్రమ, వివేచనతో ముడిపడినదే. అలాంటి మానవుని వృద్ధాప్యం కడు దీనంగా, దైన్యంగా నిరాదరణకు గురికావటాన్ని సమాజ వైఫల్యంగా పరిగణించాలి. సిరిమంతుల కుటుంబాలలో తల్లిదండ్రులకు ఆర్థికేతర ఇబ్బందులు ఎదురుకావచ్చు. కాని కోట్లాది పేద, దిగువ, మధ్యతరగతి కుటుంబాలలోని వృద్ధులు తీవ్రమైన అనారోగ్య సమస్యలతోపాటు మానసిక, సంరక్షణ, ఆర్థికపరంగా వర్ణనాతీతమైన బాధలతో కొందరు మృత్యువుకై ఎదురుచూడటాన్ని మనం గమనిస్తుంటాం. వృద్ధాప్యం శాపం కారాదు. పరిణతి చెందిన సీనియర్ సిటిజన్లను జాతి సంపదగా గుర్తించి గౌరవప్రదమైన, ఆరోగ్యవంతమైన, కనీస ఆర్థిక గ్యారంటీలతో కూడి హుందాగా జీవించే పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

వృద్ధులకు, వితంతువులైన అభాగ్యులకు, పలు కారణాలతో ఒంటరి మహిళలుగా కుటుంబ సంరక్షణ పొందలేని వారికి, విభిన్న ప్రతిభావంతులకు, ట్రాన్స్‌జండర్లకు, పలు దీర్ఘకాలిక వ్యాధులకు గురైనవారికి నేటి వరకు సరైన చట్టాల రక్షణలు లేకపోవడం బాధాకరం. కనీస ఆదాయంలేని కీలకమైన కొన్ని వృత్తులలో ఉపాధి పొందుతున్న వారికి ఆర్థిక ప్రోత్సాహకాల్ని కల్పించి కాపాడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వాలపై ఉంది.

సీనియర్ సిటిజన్లు గౌరవప్రదమైన, ఆరోగ్యవంతమైన, కనీస ఆర్థిక గ్యారంటీలతో హుందాగా జీవించే పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. రైతులు, రైతు కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, సంఘటిత రంగంలో ఉండి నామమాత్రంగా కూడా పెన్షన్లు పొందలేని వారందరికీ గౌరవప్రదమైన జీవనానికి తగినంత స్థాయిలో పెన్షన్లను పెంచి ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలి.



సమాజంలో సంపద సృష్టికర్తలైన కార్మికులు, ప్రజలకు తిండిపెట్టే రైతులు లేకుండా మానవాభివృద్ధిని ఊహించలేం. వీరితోపాటు పశుపోషకులు, జీవాల పెంపకందారులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, ట్రాన్స్‌పోర్టు కార్మికులు, ఆటో డ్రైవర్లు, చేనేత, గీత, మత్స్య, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి, కాబ్లర్ లాంటి చేతివృత్తులలోను, నిర్మాణ, ఉత్పత్తి రంగాలలో రెక్కలు ముక్కలు చేసుకుని, కుటుంబ పోషణతోపాటు సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి పాటుపడేవారికి రిటైర్‌మెంటు లేదుగదా? పలు అసంఘటిత రంగాలలో బ్రతుకులీడుస్తున్న కార్మిక శ్రేణులు, షాపు గుమస్తాలు, సేల్స్ గర్ల్స్, ఇతర సేవారంగాలలోని అల్పాదాయ వర్గాలవారు, రెక్కాడితేగాని డొక్కాడదన్నట్లు కాళ్ళు చేతులు పనిచేసినంత కాలం శ్రమిస్తూ జీవించేవారి వృద్ధాప్య రక్షణకు మన దేశంలో సరైన పథకాలు లేవు. వీరితోపాటు సీనియర్ సిటిజన్లకు కల్పిస్తున్న ప్రయోజనాలు, రక్షణలు కూడా సరిగ్గా లేవు. సమాజంలో 36 శాతంగా ఉన్న వృద్ధులతోపాటు విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పేద కళాకారులు, పలు దీర్ఘకాలిక వ్యాధులతో అవస్థలు పడుతున్నవారు కనీస పెన్షన్ 10 వేల రూపాయలు ఉండాలని కోరుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలిద్దరికీ చట్టబద్ధంగా పెన్షన్ ఇస్తున్నప్పుడు శారీరక శ్రమ చేసే పై వర్గాలవారికి 'కుటుంబంలో ఒక్కరికి పెన్షన్ ఇచ్చి పండగ చేసుకోండి' అనటంలో అర్థం లేదు. పైగా ఈ వర్గాలు పనిచేసే కేంద్రాల పరిసరాల పరిశుభ్రతా లోపాలు, వాయు, వాతావరణ కాలుష్యాలు, పోషక విలువలతో కూడిన ఆహారం కొనలేని ఆర్థిక పరిస్థితుల్లో శరీర పటుత్వం 50 సంవత్సరాలకే సన్నగిల్లుతుంది. గత నాలుగేళ్ల కాలంలో నిత్యావసర వస్తువులు, వైద్య సేవలు, మందులు తదితరాల ధరలు అపరిమితంగా పెరిగి జీవన వ్యయం అందుకోలేనంత అయింది. పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి భిక్ష పొందుతున్నట్లు కాక, చట్టబద్ధ హక్కులతో కూడిన సామాజిక పెన్షన్లను అమలుపరచాలి. ధరల పెరుగుదల, ఇతర పరిస్థితులను లెక్కించి ఎప్పటికప్పుడు పెన్షన్లను సవరించే పద్ధతి అమలుచేయాలి.

వృద్ధాప్య తదితర అన్ని రకాల సంక్షేమ పెన్షన్‌దారులకు ఇటీవలి ప్రభుత్వ జీవో ప్రకారం ఇవ్వనున్న మూడువేల రూపాయలను ఆరువేలకు పెంచాలి. అలాగే అర్హత కలిగిన భార్యాభర్తలు ఇరువురూ జీవించివుంటే ఇద్దరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలి. పెన్షన్ అర్హత వయస్సును 50 సంవత్సరాలుగా నిర్ధారించడం సమంజసం. విభిన్న ప్రతిభావంతులు లేక వికలాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను నెలకు రూ.మూడు వేల నుంచి ఏడు వేలకు పెంచి వారికి కనీస మెరుగైన పరిస్థితులు కల్పించాలి. సీనియర్ సిటిజన్ల రక్షణార్థం తల్లిదండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టం 2007ని సక్రమంగా అమలుచేయాలి. స్వార్జిత ఆస్తులు కలిగి ఉన్న సీనియర్ సిటిజన్స్ తమ బిడ్డల నిరాదరణకు గురైన సందర్భాలలో బ్యాంకులు రివర్స్ మార్ట్‌గేజ్ స్కీం అమలుచేసి ఆర్థిక వెసులుబాటు ఉండేలా చూడాలి. వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖతోపాటు ప్రత్యేక కమిషనరేటును ఏర్పాటుచేయాలి. ఉచిత వైద్య సదుపాయాలు, మందులు, ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు ప్రతి పెన్షన్‌దారునికి ఆధార్ కార్డువలే ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు కార్డు అందించాలి. చట్టంలో పేర్కొన్న విధంగా ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో కూడిన వృద్ధాశ్రమాలు ఏర్పాటుచేసి ఉన్నతంగా నిర్వహించాలి. గ్రామీణ, పట్టణ వృద్ధులకు అవసరాన్నిబట్టి కుటుంబ, సమాజ వ్యవస్థల్లో చోటుచేసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో తగినన్ని వృద్ధాశ్రమాల ఏర్పాటును ప్రోత్సహించాలి. ఈ పెన్షన్లు పొందేవారికి ప్రత్యేక ఆరోగ్య బీమా కల్పించాలి. ఒంటరి మహిళలకు ఇస్తున్న పెన్షన్ వయసును 50 సంవత్సరాలకు పెంచడం సరికాదు. తల్లిదండ్రుల రక్షణ కోల్పోకముందే 30 సం.లు నిండిన ఒంటరి మహిళలందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలి. వివిధ పెన్షన్లు పొందుతున్న వారిలో 60 సం.లు నిండిన వారికి రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి. విమాన ప్రయాణాలలో సీనియర్ సిటిజన్లకు గతంలో ఉన్నట్లు 50 శాతం రాయితీని పునరుద్ధరించాలి. వృద్ధులందరికీ చివరి శ్వాస వరకు బీమా సదుపాయం కల్పించి, ప్రీమియంలు ప్రభుత్వమే భరించాలి. సీనియర్ సిటిజన్లు బ్యాంకుల్లో దాచుకునే డబ్బుకు వడ్డీ రేట్లు తగ్గించకుండా, అదనపు వడ్డీ రేటు ఇచ్చి వారి మెరుగైన ఆర్థిక స్థితికి తోడ్పడాలి.

రాష్ట్రంలో సామాజిక పెన్షన్లు పొందుతున్న వారికి కుంటిసాకులు చూపి పెన్షన్లను రద్దు చేయరాదు. అర్హత కలిగిన కొత్తవారి అర్జీలను త్వరగా పరిశీలించి అదే నెలలో మంజూరు చేయాలి. సంఘటిత రంగంలో వున్నవారు తమ సంఘటిత శక్తి ద్వారా ఎన్నో ప్రయోజనాలను పొందుతున్న విషయం గమనిస్తూనే ఉన్నాం. రైతులు, రైతు కూలీలు, పలు అసంఘటిత రంగ కార్మికులు సంఘటిత రంగంలో ఉండి నామమాత్రంగా కూడా పెన్షన్లు పొందలేని వారందరికీ గౌరవప్రదమైన జీవనానికి తగినంత స్థాయిలో పెన్షన్లను పెంచి ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలి.

● ముప్పాళ్ళ నాగేశ్వరరావు
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
కన్వీనర్, ఏపీ సామాజిక పెన్షనర్ల సంక్షేమ సంఘం


రైతన్నలకు సార్వభౌమత్వం ఇంకెన్నాళ్ళకు?

అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. విత్తు విత్తిన నాటినుంచి పంట చేతికొచ్చి విక్రయించుకునే వరకూ ప్రతి దశలోనూ పోరాటం రైతుకు అలవాటయిపోయింది. సమాజంలో ఏ వర్గానికీ లేని దుస్థితి రైతుకే ఎందుకు? ఇందుకు బాధ్యులు ఎవరు? పాలకులా? పార్టీలా? నాయకులా? వ్యవస్థా? ఒకరిపై మరొకరు నెపం వేసుకుంటూ కాలహరణం చేస్తూ పోతే రైతులు కష్టాల కడగండ్లలో మగ్గిపోవలసిందే. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు రుణభారంతో కునారిల్లిపోతున్నారు. అవమానభారంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక నడిరోడ్డుపైనే పారబోసి కన్నీళ్లతో వెనుదిరిగిన దృశ్యాలు ఇటీవలి కాలంలో ఎన్నో చూశాం.

కొద్దిరోజుల క్రితం జరిగిన సంఘటన సభ్యసమాజానికే ఒక సవాల్‌గా నిలిచింది. అనంతపురం జిల్లా గుంతకల్‌లో ఒక రైతు పోలీసు అధికారి కాళ్లపట్టుకొని దీనంగా వేడుకుంటున్న దృశ్యం అందర్నీ కలచివేసింది. "సార్ మిరప పంటకు లక్షల్లో పెట్టుబడులు పెట్టాం. సాగునీరు ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతాం. న్యాయం జరిగేలా చూడండి" అంటూ ఒక రైతు అక్కడకు వచ్చిన పోలీసు అధికారి కాళ్ళు పట్టుకొని వేడుకున్నాడు. గుంతకల్లు బ్రాంచ్ కాలువకు సాగునీరు ఇచ్చి ఆదుకోవాలనే డిమాండ్‌తో అక్కడి రైతులు తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఆ సందర్భంగా అక్కడకు వచ్చిన పోలీసు అధికారిని రైతులు దీనంగా వేడుకున్నారు. వాస్తవానికి అక్కడకు వచ్చిన పోలీసు అధికారులకు లేదా ఆ శాఖకు రైతుల సమస్యతో ఏ మాత్రం సంబంధం లేదు. అయినా రైతులు పోలీసులను వేడుకోవటం వారి దయనీయస్థితికి దర్పణం పడుతున్నది.

సమాజంలో అన్నదాతలను అగ్రస్థానంలో నిలబెట్టాల్సిన పాలకులు అప్పుల్లో ముందు వరుసలో ఉంచారు. ఫలితంగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బ్యాంకులకు కోట్లాది రూపాయలు రుణాలు ఎగ్గొట్టినవారు, ప్రభుత్వానికి లెక్కకు మిక్కిలిగా పన్నుల బకాయిలు వున్న బడాబాబులకు ఈ పరిస్థితి ఎందుకు ఎదురుకావటం లేదు? ప్రకృతి వైపరీత్యాలు, కరవుకాటకాల వల్ల వాటిల్లుతున్న నష్టం కంటే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అన్నదాతలకు అధిక నష్టం కలుగుతున్నది. సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ఇసుమంతైనా శ్రద్ధలేకపోవటం రైతన్నలపట్ల పాలకులకున్న అభిప్రాయాలకు నిదర్శనం. రైతుభరోసా, రుణమాఫీ, ఇన్‌పుట్‌పై రాయితీలు వంటి వాటికోసం రైతులు అనివార్య పరిస్థితుల్లో ఎదురుచూడాల్సి వస్తోంది. సకాలంలో సాగునీరు అందించటం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు స్పందించి పాడైపోయిన వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేసి ఆదుకోవటం, దళారుల ప్రమేయం లేకుండా చేయటం, గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయటం, వ్యవసాయానికి ఉపకరించే పరికరాలను రాయితీపై అందించటం వంటివి సక్రమంగా అమలు జరిపితే తమకు ఎంతగానో ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. ప్రకృతి వైపరీత్యమైనా, ప్రభుత్వ విధానమైనా అధికంగా ప్రభావం చూపేది కౌలురైతుపైనే. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు పంటలబీమా కొండంత ఆసరాగా నిలుస్తుంది. అయితే పలురకాల సాంకేతికపరమైన కారణాల వల్ల కౌలురైతులకు బీమా పరిహారం అందకుండాపోతుంది. కౌలు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారిని ఆదుకునేందుకు నిర్దిష్ట విధానం రూపొందించాలి. ప్రభుత్వాల నుంచి రైతులు కోరుకునేది సహాయం కాదు సహకారం. సమాజంలో గౌరవమర్యాదలు. ఆ దిశగా ప్రభుత్వాలు, పాలకులు యోచించాలి. రైతుల జీవన ప్రమాణాలు పెంపొందించి, సమాజంలో అగ్రస్థానం కల్పించే దిశగా 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో అయినా రాజకీయ పార్టీలు భరోసా కల్పిస్తాయని ఆశిద్దాం.

– శాఖమూరు శ్రీనివాస ప్రసాద్



చెప్పిందిదీ..
అడ్డగోలుగా ఇసుక దోపిడీ వల్ల ఎన్నికల్లో టీడీపీ ఘోరంగా ఓడిపోయింది. అవినీతి, దోపిడీకి తావు లేకుండా ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందించేందుకు ఎన్నో అడ్డంకులు అధిగమించి నూతన విధానాన్ని తీసుకువచ్చాం. అక్రమ రవాణాకు ఇక అస్కారమే లేదు. అడ్డగోలు వ్యవహారాలుండవు. అంతా పారదర్శకమే.

- 2019 సెప్టెంబరు 4న చెవిటికల్లు ఇసుక రీచ్, స్టాక్ పాయింట్ ప్రారంభం సందర్భంగా రాష్ట్ర గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చేస్తున్నదిదీ..
నేడు ఇసుక రీచ్‌లలో నిబంధనలకు పాతరేశారు. దోపిడీకి అంతులేకుండా పోయింది. ఎలాంటి ఆటంకాలూ లేకుండా అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. టీడీపీ ప్రభుత్వంలో సామాన్యులకు ఉచితంగా అందిన ఇసుక నేడు దొరకటం కష్టమైంది. పైగా అత్యంత ఖరీదైన వస్తువుగా మారింది. పారదర్శకం కాగితాలకే పరిమితమైంది. ఇసుక దందాపై ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు.



ఇసుకాసురులు!

చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌లలో అడ్డగోలుగా ఇసుక దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- కోర్టు తీర్పునకు తిలోదకాలు
- ప్రశ్నిస్తే దాడులు, బెదిరింపులు
- వే బిల్లుల్లోనూ అక్రమాలు
- పట్టించుకోని అధికారులు

కంచికచర్ల : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక విధానం అమలు చేశారు. లోడింగ్, రవాణా ఖర్చులు భరిస్తే చాలు తరతమ బేధం లేకుండా సామాన్యులకు సైతం వ్యయప్రయాసలు లేకుండా చాలా తేలికగా ఇసుక దొరికింది. టీడీపీ ప్రభుత్వంలో భారీగా ఇసుక దోపిడీ జరిగిందని, అక్రమాలకు, దోపిడీకి తావులేకుండా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పుకున్నారు. దోపిడీ, అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని గట్టిగా చెప్పారు. కానీ నేడు రీచ్‌లలో జరుగుతున్న ఇసుక దోపిడీకి అంతు లేకుండా పోయింది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అడిగే నాధుడే లేడు. హద్దుల్లేకుండా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. హైదరాబాదుతో పాటుగా తెలంగాణాలోని ఇంకొన్ని ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దీన్ని నివారించేందుకు అధికారులు అడుగు ముందుకు వేయటం లేదు. మౌనంగా చూస్తూ ఊరుకుంటున్నారు తప్పితే చర్యలు తీసుకునేందుకు భయపడుతున్నారు. ఇసుక దోపిడీ, అక్రమ రవాణాపై ప్రతిపక్ష నేతలైనా, అధికార పార్టీ వారైనా నోరెత్తినా, ఆందోళనకు దిగినా కేసులు పెట్టి లోపలేస్తామంటూ బెదిరిస్తున్నారు.

రీచ్‌లలో నిబంధనలకు తిలోదకాలు..

- రీచ్‌లలో రాత్రిళ్లు తవ్వకాలు జరపకూడదు. రేయింబవళ్లు అనే తేడా లేకుండా రీచ్‌లలో తవ్వకాలు జరుగుతున్నాయి.
- ఇసుక తవ్వకాలకు యంత్రాలు వాడకూడదు. కూలీలతో మాత్రమే తవ్వకాలు జరపాలి. ప్రస్తుతం రీచ్‌లలో భారీ యంత్రాలు తప్పితే చుద్దామన్న కూలీలు కనిపించటం లేదు.
- అనుమతికి మించి ఎక్కువ లోతు తవ్వకూడదు. యంత్రాలతో కృష్ణా నదీ గర్భాన్ని కొల్లగొడుతున్నారు. తమ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు.
- నదిలోకి లారీలు, ఇతర భారీ వాహనాలు వెళ్లకూడదు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక ఒడ్డుకు తీసుకువచ్చి, లారీలకు లోడింగ్ చేయాలి. కానీ లారీలే నేరుగా రీచ్‌లలోకి వెళుతున్నాయి.
- రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కెమెరాలు బిగించ లేదు.
- ఇసుక బరువు (టన్నేజీ) లెక్కగట్టేందుకు వేబ్రిడ్జి అందుబాటులో ఉండాలి. వేబ్రిడ్జిలు లేవు. ప్రొక్లెయిన్ బొచ్చ ఇసుక 2.25 నుంచి 2.5 టన్నులు వస్తుందన్న అంచనాతో టన్నేజీ లెక్కిస్తున్నారు.
- ఓవర్ లోడింగ్ ఉంటుంది. పరిమితికి మించి లారీలకు అధిక లోడ్ వేస్తున్నారు. వేబిల్లు మాత్రం అనుమతి మేరకు ఇస్తున్నారు. ఒక లారీకి 30 లేదా 40 టన్నుల ఇసుక లోడింగ్ చేసి, టన్ను రూ.475 వంతున వసూలు చేస్తున్నారు. అయితే వేబిల్లు మాత్రం 25 టన్నులకే ఇస్తున్నారు.
- అక్రమ రవాణాను నిరోధించేందుకు ఇసుక తరలించే వాహనాలకు జీపీఎస్ ఉండాలి. కేవలం పది శాతం వాహనాలకు తప్పితే 90 శాతం వాహనాలకు జీపీఎస్ లేదు.

చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌లలో తవ్వకాలిలా..

కంచికచర్ల మండలంలో కృష్ణానదిపై చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌లలో నవంబరు రెండో వారం నుంచి కొత్త గుత్తేదారుడు ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నెల రోజులు జేపీ సంస్థ వేబిల్లులు ఇచ్చిన కొత్త గుత్తేదారుడు, కొద్ది రోజుల నుంచి జీసీకేసీ ప్రాజెక్టు అండ్ వర్క్సు ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వేబిల్లులు ఇస్తున్నారు. కొద్ది నెలల క్రితమే ఈ రీచ్‌ల కాల పరిమితి ముగిసిందని చెపుతున్నారు. కొత్తగా ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదని అంటున్నారు. ముఖ్యంగా పర్యావరణానికి సంబంధించి క్లియరెన్స్ సర్టిఫికెట్లు కూడా లేవని అంటున్నారు. ఈ విషయమై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కూడా తప్పుపట్టింది. పర్యావరణ అనుమతులు లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరపవద్దని ఆదేశించినా తవ్వకాలు ఆపలేదు. రాష్ట్రంలో 110 ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరపవద్దని స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్టు అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ) గత ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలు అమలు కావటం లేదు. 110 రీచ్‌లలో చెవిటికల్లు, గనిఆత్కూరు, మున్నలూరు రీచ్‌లు కూడా ఉన్నాయి. సుప్రీంకోర్టు కూడా గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను సమర్థించింది. అయినప్పటికీ రీచ్‌లలో అడ్డూ అదుపూ లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి.


అంగన్వాడీల నినాదాలు


మున్సిపల్‌కార్మికుల నినాదాలు

సమర నినాదం!

రోజుల తరబడి రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో కదలిక లేదు. పండుగలూ పబ్బాలూ వదులుకొని దీక్షలు చేపట్టినా కనికరం లేదు. తమకు ఇచ్చిన హామీని అమలు చేయమని ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రభుత్వ పెద్దలు చెవి కెక్కించుకోవడం లేదు. తమ మొర ఆలకించమంటూ 21వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీలు నగరంలోని ధర్నాచౌక్ వద్ద సోమవారం నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించేదాకా పోరాడతామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు.


పుస్తక పాదయాత్రలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుస్తకాల సందడి

- ఉత్సాహంగా సాగిన బుక్ ఫర్ వాక్

విజయవాడ సిటీలైఫ్, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : పుస్తక మహోత్సవానికి వస్తున్న పాఠకుల సంఖ్య పెరుగుతోంది. విజయవాడ, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాల నుంచి పాఠకులు భారీగా పుస్తక మహోత్సవానికి వచ్చారు. విద్యా సంస్థలకు సెలవు కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చారు. కొన్ని విద్యాసంస్థలు పుస్తక మహోత్సవాన్ని బుక్ టూర్‌గా ప్రకటించుకన్నాయి. ఒక్కో విద్యాసంస్థ ఒక్కో రోజున విద్యార్థులను పుస్తక మహోత్సవానికి తీసుకొస్తున్నాయి. పుస్తక మహోత్సవానికి వస్తున్న పాఠకుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రచురణకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పుస్తక మహోత్సవంలో చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలను పాఠకులు కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతు న్నారు. ఇప్పటి వరకు పుస్తక మహోత్సవంలో అడుగుపెట్టని వారు ఈసారి ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ప్రతిభావేదిక వద్ద నిర్వహిస్తున్న పేపర్ క్రాఫ్ట్ శిక్షణ కార్యక్రమంలో చిన్నారులు ఎక్కువగా పాల్గొంటున్నారు. పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థులను ఇక్కడికి తీసుకొస్తున్నారు. పుస్తక మహోత్సవంలో సోమవారం పాఠకుల సందడి బాగా కనిపించింది. సీనియర్ సిటిజన్స్ ఆధ్యాత్మిక పుస్తకాల కొనుగోలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అటు తెలంగాణలోను పోటీ పరీక్షలకలు నోటి ఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున వాటికి సంబంధించిన పుస్తకాలను, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను యువకులు కొనుగోలు చేస్తున్నారు. త్వరలో రాష్ట్రంలో గ్రూపు 2 పరీక్షలు నిర్వహించనున్నందున ఆ పోటీ పరీక్షల పుస్తకాలను బాగానే కొనుగోలు చేస్తున్నారు. బుక్ ఫర్ రన్ పేరుతో నగరంలో ప్రదర్శనలో భారీ సంఖ్యలో పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

- 6లో..



బెజవాడలో అమృత్ సందడి

ఉదయం 8.30 గంటలకు బెంగళూరు పయనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సందడి చేసింది. ఆదివారం రాత్రి విజయవాడకు చేరుకున్న ఈ రైలు ఇక్కడే కోచింగ్ డిపోలో ఉంది. సోమవారం ఉదయం 8.30 గంటలకు విజయవాడ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. రైల్వే ఏడీఆర్ఎం ఇతర అధికారులు ఈ రైలుకు స్వాగతం పలకటంతో పాటు, పైలట్‌కు అభివాదం చేస్తూ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వందేభారత్ రైలు తరహాలోనే అమృత్‌భారత్ రైలు కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉంది. వందేభారత్ రైలు శ్వేత వర్ణంలో ఉండగా.. ఇది పూర్తిగా కాషాయ రంగులో ఉంటుంది. స్లీపర్, ఏసీ, జనరల్ బోగీలతో అన్ని వర్గాలకు అందుబాటులో ఈ రైలు ఉంటుంది. మాల్డా టౌన్ వయా విజయవాడ, బెంగళూరుల మధ్యన ఈ రైలు నడుస్తుంది. ఈ కోచ్‌లో సౌకర్యవంతమైన స్లీపర్ బెర్తులు ఉన్నాయి. అన్నీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు కావటంతో ఆకర్షణీయంగానూ ఉన్నాయి.

డీఐజీగా విశాల్ గున్నీ



విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డీసీపీ విశాల్ గున్నీకి డీఐజీ పదోన్నతి లభించింది. ఇప్పటి వరకు డీసీపీగా ఉన్న ఆయన డీఐజీ హోదాలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు కమిషనరేట్‌లో ఐడీజీ హోదాలో జాయింట్ కమిషనర్ పోస్టు ఉంది. ప్రస్తుతం ఇది ఖాళీగా ఉంది. ఈ బాధ్యతలను విశాల్ గున్నీ నిర్వహించే అవకాశం ఉంది.



ఉత్సాహంగా బుక్ ఫర్ వాక్

విజయవాడ సిటీలైఫ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పుస్తక మహోత్సవానికి వస్తున్న పాఠకుల సంఖ్య పెరుగుతోంది. విజయవాడ, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాల నుంచి పాఠకులు భారీగా పుస్తక మహోత్సవానికి వచ్చారు. విద్యాసంస్థలకు సెలవు కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చారు. పుస్తక మహోత్సవం ప్రారంభం నుంచి విద్యార్థులు వస్తూనే ఉన్నారు. కొన్ని విద్యాసంస్థలు పుస్తక మహోత్సవాన్ని బుక్ టూర్‌గా ప్రకటించుకున్నాయి. ఒక్కో విద్యాసంస్థ ఒక్కో రోజున విద్యార్థినీ విద్యార్థులను పుస్తక మహోత్సవానికి తీసుకొస్తున్నాయి. పుస్తక మహోత్సవానికి వస్తున్న పాఠకుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రచురణకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పుస్తక మహోత్సవంలో చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలను పాఠకులు కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. ఇప్పటి వరకు పుస్తక మహోత్సవంలో అడుగుపెట్టని వారు ఈసారి ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ప్రతిభావేదిక వద్ద నిర్వహిస్తున్న పేపర్ క్రాఫ్ట్ శిక్షణ కార్యక్రమంలో చిన్నారులు ఎక్కువగా పాల్గొంటున్నారు. పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థులను తీసుకొస్తున్నారు. పుస్తక మహోత్సవంలో సోమవారం పాఠకుల సందడి బాగా కనిపించింది. సీనియర్ సిటిజన్స్ ఆధ్యాత్మిక పుస్తకాల కొనుగోలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అటు తెలంగాణలోను పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున వాటికి సంబంధించిన పుస్తకాలను, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను యువకులు కొనుగోలు చేస్తున్నారు. త్వరలో రాష్ట్రంలో గ్రూపు 2 పరీక్షలు నిర్వహించనున్నందున పోటీ పరీక్షల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.



మంచి పుస్తకాలతో సమాజం

▸▸ మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్

విజయవాడ కల్చరల్, జనవరి 1 : మంచి పుస్తకాలతోనే మంచి సమాజం ఉద్భవిస్తుందని, సమాజాన్ని మార్చాలంటే పుస్తకాలు చదవాలని మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఐదవ రోజు సోమవారం కేతు విశ్వనాథరెడ్డి సాహితీ వేదికపై నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి వ్యక్తికి సమాజంపై



తనదైన ముద్రవేయాలని, మంచి మార్పులు తేవాలని ఉంటుందన్నారు. కానీ ఆ ఆకాంక్షలను నిజం చేసుకోవాలంటే కావాల్సిన అవగాహన, మార్గదర్శనం మంచి పుస్తకాలలోనే లభిస్తాయన్నారు. తాను ఐఏఎస్ అధికారి కావడానికి పుస్తకాలు చదివే అలవాటు వుండటమే కారణమన్నారు. పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవడం ద్వారా పిల్లలు తమ జీవితాలను తాము కోరుకున్నట్టు మలచుకోవాలని సూచించారు. సభలో పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, పుస్తకం వున్న ఇల్లు విద్యాభివృద్ధులకు నిలయమన్నారు. పిల్లలకూ-పుస్తకాలకు వున్న అనుబంధం మార్కులకూ, హోంవర్కులకూ పరివితం చేయకూడదన్నారు. పుస్తకం జ్ఞానానికి ప్రధాన మాధ్యమంగా కొనసాగాల్సిన అవసరం వుందని, సమాజంలో బాధ్యత కల వారందరూ ఈ అంశాన్ని పట్టించుకోవాలన్నారు. జాషువా, శ్రీశ్రీ లాంటి కవుల రచనలు, మహాత్మా గాంధీ, అంబేద్కర్ లాంటి మహాపురుషుల జీవితాలను అధ్యయనం చేయాలన్నారు.

విద్యావేత్త పరిమి మాట్లాడుతూ, కనీసం ప్రాథమిక పాఠశాల స్థాయి వరకు అయినా మాతృభాషలో చదువుకొనే అవకాశం లేకపోవడం తెలుగు పిల్లల దురదృష్టమన్నారు. పుస్తక మహోత్సవం వల్ల పిల్లలకు పుస్తకాలతో అనుబంధం పెంచుకొనే అవకాశం లభిస్తోందన్నారు. నిర్విరామంగా పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్న సంఘాన్ని అభినందించారు.

మాజీ అధ్యక్షుడు వెంకట నారాయణ మాట్లాడుతూ, రోజురోజుకూ పుస్తక పాఠకుల సంఖ్య తగ్గడం దురదృష్టమన్నారు. వ్యవస్థలో కీలకస్థానాల్లో ఉన్న వ్యక్తులు పుస్తకాలకున్న స్థానాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల సమాజానికి పరోక్షంగా చాలా నష్టం జరుగుతోందన్నారు. మేధావులు, ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకొని పరిష్కారాలను ఆలోచించుకోవాలని కోరుకున్నారు. పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● దేశంలో ఎక్కడా లేని విధంగా విజయవాడ పుస్తక మహోత్సవం జరుగుతోందని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యదర్శి కె.లక్ష్మయ్య, అధ్యక్షులు టి.మనోహరనాయుడు అన్నారు. ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు ప్రతి ఏటా ఈ పుస్తక పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం పుస్తకప్రియుల పాదయాత్ర నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త పరిమి పాదయాత్రకు నాయకత్వం వహించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, రచయితలు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, బి.ఆంజనేయ రాజు, చలపాక ప్రకాష్, అరుణ్‌కుమార్, జామిందార్, చింతా వెంకటేశ్వర్లు, పూజాల వెంకట నారాయణ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నాకు నచ్చిన సాహిత్యం..



విజయవాడ కల్చరల్, జనవరి 1 : కేతు విశ్వనాథరెడ్డి సాహితీ వేదికపై తనకు నచ్చిన, ప్రభావితం చేసిన సాహిత్యంపై విద్యార్థులు, రచయితలు ప్రసంగించారు. రచయిత బండ్ల మాధవరావు మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు అనేక పుస్తకాలు చదవడం అలవరచుకోవాల్సిన అభ్యసనం అని బండ్ల మాధవరావు అన్నారు. టీచర్స్, విద్యార్థులలో పుస్తక పఠనాన్ని అభివృద్ధి చేయడం కోసం పనిచేయాలి. టీచర్స్ పాఠ్యాంశాల రచయితలను వారి పాఠశాలలకు పిలిచి వీలైతే పిల్లలకు పరిచయం చేయడం వలన పిల్లలకు సాహిత్యం పట్ల అభిరుచి ఏర్పడే అవకాశం వుంటుందన్నారు.



● సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని పి.ఎస్.ఎస్.జి. చిన్మయి మాట్లాడుతూ, రచయిత సుధామూర్తి అంటే నాకు ఎంతో ఇష్టమని సరళమైన భాషలో ఆమె రాసే సాహిత్యం ఎంతో అద్భుతంగా వుంటుందన్నారు. సుధామూర్తి రచించిన 3 వేల స్టిచెస్ రచనలను ముంజులూరి కృష్ణకుమారి తెలుగులో 3 వేల అల్లికలు పేరుతో అనువాదం చేశారని ఆ పుస్తకాన్ని తాను చదివానని తెలిపారు. జీవిత అనుభవాలు సారంగా రచించిన ఈ కథలు తన జీవితంలో దేవదాసి వ్యవస్థను ఎలా రూపుమాపిందో అద్భుతంగా కథా రూపంలో వివరించారని, ఆవిడ చేసిన ప్రయత్నం రెండుసార్లు అపజయం ఎదురైనా మూడోసారి విజయాన్ని సాధించారన్నారు. ఆ మార్పుకి నోచుకొన్న వ్యక్తుల వారసత్వం 3 వేల మంది కలిసి ఓ శాలువాని కుట్టి సుధామూర్తి సత్కరించారన్న విషయాన్ని ఆమె చెప్పి ప్రశంసలు అందుకున్నారు.

● జనవికాస విద్యా సంస్థలో ఏడవ తరగతి చదువుతున్న లక్ష్మీ హిరణ్మయి మాట్లాడుతూ, తాను చదివిన 'సదాకో కాగితపు పక్షులు' పుస్తకాన్ని గురించి వివరించారు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం సదాకో అనే ఓ చిన్నారి బ్లడ్ క్యాన్సర్‌కి గురవడం, ఆమె ఓ స్నేహితురాలు 'వెయ్యి కాగితపు పడవలు చేయడం వల్ల బ్లడ్ క్యాన్సర్ తగ్గిపోతుందని' చెప్పడంతో 300 పడవలు చేసిన తదుపరి ఆ చిన్నారి చనిపోయే ట్రాజెడీ కథను వినిపించారు. యుద్ధాల వలన వేలాది ప్రాణాలు పోతాయని విషయాన్ని పెరుగుతూ ఆ చిన్నారి ప్రసంగం సాగింది. మందరపు హైమావతి మాట్లాడుతూ, 'నగ్నముని కొయ్యగుర్రం మీద' ప్రసంగించారు. ఇంద్రవల్లి రమేష్, గడ్డం విజయారావులు కత్తి పద్మారావు రచనలు, బౌద్ధం మీద ప్రసంగించారు. కొప్పర్తి రాంబాబు శ్రీ రమణ గురించి, తాను రికార్డ్ చేసి యూ ట్యూబ్‌లో పెడుతున్న కథల గురించి మాట్లాడారు. డాక్టర్ సుధాకర్, సుబ్రమణ్యం, కొప్పర్తి రాంబాబు, వరప్రసాద్, కోటయ్య, శ్రీ శ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరయ్యలు మాట్లాడారు.

● ఆదివారం ఏదో ఒక పుస్తకం చదువుతా :

కార్తీక్, రెడ్డిగూడెం

నేను గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాను. వారంలో ఆరు రోజులు స్కూల్ పాఠాలు, హోం వర్కులు చేసుకుంటాను. ప్రతి ఆదివారం నచ్చిన పుస్తకాన్ని చదువుతుంటాను. ఎక్కువగా అంబేద్కర్ పుస్తకాలు చదువుతాను.

ఆల్ ఇన్ వన్... ఓ సీక్రెట్

పుస్తక మహోత్సవంలో చిన్న పిల్లల పుస్తకాల్లో ఓ పుస్తకం ప్రత్యేకార్షణగా నిలుస్తోంది. ఇంగ్లీషు ఆల్ఫాబెట్స్, అంకెలు, జంతువులు, ఫ్రూట్స్ వంటి చిత్రాలు, వాటి పేర్లు ఇంగ్లీష్, హిందీలో ఉంటాయి. ఆల్ ఇన్ వన్ పేరుతో ఉన్న ఈ పుస్తకం వెల రూ.320లు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 175లో ఉన్న నవనీత్ ఎడ్యుకేషన్ లిమిటెడ్‌లో అందుబాటులో ఉంది.



ముస్లింలకు ప్రత్యేకం..

పుస్తక మహోత్సవంలో తెలుగు, ఇంగ్లీష్ పుస్తకాలు అన్ని స్టాల్స్‌లో కనిపిస్తాయి. ఒక స్టాల్‌లో మాత్రం ఉర్దూ, అరబిక్ పుస్తకాలు ఉంటాయి. ఈ స్టాల్‌లో మొత్తం అన్నీ ముస్లింలకు సంబంధించిన పుస్తకాలే ఉంటాయి. స్టాల్ నంబర్ 152లో ఏర్పాటు చేసిన శాంతిమార్గం పబ్లికేషన్స్‌లో ఈ పుస్తకాలు ఉన్నాయి. హదీసు దీపాలు, మహనీయ మహమ్మద్ ఆదర్శ జీవితం, రంజాన్ నెలలో రఫీ ఏం చేస్తాడు, మహమ్మద్ ప్రవక్త మహితోక్తులు పుస్తకాలు ముస్లింలను ఆకర్షిస్తున్నాయి. ఇవి కాకుండా ముస్లిం చిన్నారులకు ఇస్లాం, అరబీ వాచకం వంటి పుస్తకాలు ఇక్కడ కొలువుదీరాయి.



అంబేడ్కర్ ఆనవాళ్లు..

భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించారు. ఇది అందరికీ తెలిసిన విషయం. అంబేడ్కర్ ఒక్క రాజ్యాంగాన్ని మాత్రమే రచించలేదు. భారతీయ సమాజంలో నాటి పరిస్థితులు, అసమానతలు, వాటికి పరిష్కారాలను సూచిస్తూ కొన్ని పుస్తకాలు రాశారు. అంబేడ్కర్ రాసిన రాతలు, చేసిన ప్రసంగాలకు సంబంధించిన పుస్తకాలను అంబేడ్కర్ రాజగృహ పుస్తక మహోత్సవంలో అందుబాటులో ఉంచింది. స్టాల్ నంబర్ 164లో ఈ పుస్తకాలు ఉన్నాయి. అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగంతోపాటు అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు, అంబేడ్కర్ యాన్ ఎకానమిస్ట్ అండ్ ఎక్స్‌ట్రార్డనరీ, ది అన్‌టచ్‌బులిటీ వంటి పుస్తకాలతోపాటు వివిధ పుస్తకాలు ఈ స్టాల్‌లో ఉన్నాయి.



ఆధ్యాత్మికతకు ప్రత్యేకం..

ఓం సాయి కోటి, లలితా విష్ణు సహస్ర నామాలు, మన ఆచారాలు-సంప్రదాయాలు.. ఇవన్నీ ఆధ్యాత్మికతకు సంబంధించిన పుస్తకాలు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 168లో రాజమండ్రికి చెందిన గొల్లపూడి వీరాస్వామి సన్స్‌లో అన్ని ఆధ్యాత్మికత పుస్తకాలు కొలువుదీరాయి. సాయిబాబు, శ్రీ వేంకటేశ్వర స్వామి, లలితా సహస్ర నామాలు, విష్ణు సహస్ర నామాలు, దేవీ భాగవతం వంటి పుస్తకాలు స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

కొత్త సంవత్సరాన గిరిజనులకు పట్టాలు

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 1 : రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నేతృత్వంలో గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తోందని, గిరిజనులు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎం.రుక్మాంగదయ్య, రెడ్డిగూడెం మండలం, అన్నారావుపేటకు చెందిన ఎనిమిది మంది గిరిజనులకు 11.44 ఎకరాలకు సంబంధించి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేశారు. అదేవిధంగా విజయవాడ రూరల్ మండలం, కొత్తూరు తాడేపల్లి 13



గిరిజనులకు పట్టాలు అందిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

యానాది కుటుంబాలకు గృహనిర్మాణ సహాయం కింద రూ.8,19,000 మెగా చెక్కు అందజేశారు. రెడ్డిగూడెం మండలం, ఎ.కొండూరుకు చెందిన 77 గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూర్చే బోర్‌వెల్స్ విద్యుదీకరణకు సహాయం కింద రూ.6.70 లక్షల మెగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల ప్రత్యేక కమిటీలో ఆమోదం పొందిన గిరిజనులకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం అందించే రూ.1,80,000కు అదనంగా గిరిజనుల ఆర్థిక పరిస్థితిని పరిగణలోనికి తీసుకొని అదనపు సహాయం అందిస్తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ, వాసవీ మహిళా మండలి (వీఎంఎం), నాబార్డుకు అభినందనలు తెలిపారు.

జిల్లా న్యాయాధికారికి కృష్ణా కలెక్టర్ శుభాకాంక్షలు



మచిలీపట్నం, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను కలెక్టర్ పి.రాజాబాబు జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాకోర్టుకు వెళ్లిన ఆయన జిల్లా ప్రధాన న్యాయమూర్తికి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టర్ పి.రాజాబాబును సోమవారం జిల్లా అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జేసీ అపరాజిత సింగ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో ఎం వాణి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఈవో తాహెరా సుల్తానా, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి వివిధశాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు కలెక్టర్‌ను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి

▸▸ బొప్పరాజు వెంకటేశ్వర్లు



విజయవాడ, 1 జనవరి (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులంతా సమస్యల పరిష్కారానికి చేయి చేయి కలిపి, సంఘటితం కావాలని, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఏపీ రెవెన్యూ భవన్‌లో కేక కటింగ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా బొప్పరాజు పాల్గొని కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింత క్రియాశీలకంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఏపీజేఏసీ అమరావతిలోని అన్ని అనుబంధ సంఘాల సమస్యలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం సంఘటితంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి కవిటీ నాయకులు, మహిళా కమిటీ, సిటీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు కృష్ణమోహన్, వి.గోపాలకృష్ణారావు, ఎ.రవీంద్రబాబు దంపతులు

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

వన్‌టౌన్, జనవరి 1 : 2024 కొత్త సంవత్సరం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు, జస్టిస్ ఎ.రవీంద్రబాబు దంపతులు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయిలకు అధికారులు ఆలయ మర్యాదలు కల్పించగా.. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, ఆశీస్సులు, శేషవస్త్రంను వేదపండితులు అందజేశారు. అలాగే రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ దుర్గమ్మను దర్శించుకున్నారు



హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి

అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తజనం..

2024 నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా సోమవారం దుర్గమ్మను దర్శించుకునడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనం, ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరించిన సీఎం జగన్

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం 2024 క్యాలెండర్‌ను సోమవారం సీఎం జగన్మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ముందుగా ఈవో రామారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రికి వేద ఆశీస్సులు, ప్రసాదం అమ్మవారి చిత్రపటం అందజేశారు.

● అన్నవితరణ, అభివృద్ధి పనులకు విరాళం

దుర్గగుడిలో అన్నవితరణ, అభివృద్ధి పనులకు విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన తలారి సూరిబాబు కుమారుడు కోడలు ఈశ్వర్ దుర్గానాగేంద్రప్రసాద్ ప్రీతి సౌజన్య దంపతులు సోమవారం రూ.4,48,015 విరాళం అందజేశారు.

● ధర్మపథం వేదికపై..

ధర్మపథం వేదికపై సోమవారం నటరాజ నృత్యాలయం బృందం నృత్య నీరాజన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయన శ్రీనివాసరావు శిష్య బృందం ఆంధ్ర నాట్య ప్రదర్శన ఇచ్చింది. తిలోత్తమ, హేమలీలాలాస్య, పవిత్ర, కుందన వర్షిణి, ప్రవల్లిక, కీర్తి, రుత్విక్, పూజ తదితరులు అభినయించారు.

● రేపట్నుంచి భవానీ దీక్షల విరమణ

బుధవారం ఉదయం 6.30 గంటలకు భవానీదీక్షల విరమణలు పురస్కరించుకుని హోమగుండాలలో అగ్ని ప్రతిష్ఠాపన చేస్తారు. శత చండీ యాగానికి శ్రీకారం చుడతారు. 7వ తేదీ వరకు దీక్షల విరమణలు కొనసాగుతాయి. 7వ తేదీ ఆదివారం మహాపూర్ణాహుతితో దీక్షల విరమణ కార్యక్రమం ముగుస్తుంది.

ప్రభుత్వంతో అమీ తుమీ..

▸▸ నిద్రాహారాలు మాని మున్సిపల్ కార్మికుల సమ్మె తీవ్రం

నందిగామ, జనవరి 1 : మునిసిపల్ కార్మికుల సమ్మెతో పట్టణం మురికి కూపంలా మారింది. వారంరోజులుగా వివిధ రూపాల్లో ఉద్యమం చేస్తున్నా పాలకులు వారి వైపు కన్నెత్తి చూడలేదు. తమ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంపై కార్మికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని భీష్మించారు. పట్టణాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా



ప్రైవేటు వ్యక్తులు రాకుండా రాత్రివేళ కార్యాలయాల వద్ద కావలి కాస్తున్న మున్సిపల్ కార్మికులు

చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. అపార్ట్‌మెంట్‌లో చెత్త సేకరణ జరగకపోవడంతో డబ్బాలు చెత్తతో పొర్లిపోతున్నాయి. మరో వైపు అధికారులు ప్రైవేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయించాలని ప్రయత్నిస్తున్నారు. దాంతో రాత్రిళ్ల కార్యాలయం వద్దనే నిద్రిస్తూ పారిశుధ్య పనిముట్లు బయటకు వెళ్లకుండా కార్మికులు జాగ్రత్త పడుతున్నారు. ఎవరైనా పనులకు వస్తే తగిన మూల్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. కార్మికుల సమ్మెకు ప్రజల నుంచి కూడా మద్దతు లభిస్తుండటంతో ప్రభుత్వంతో అమీతుమీకి సిద్ధమయ్యారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

ఇబ్రహీంపట్నం/గొల్లపూడి/జి.కొండూరు, జనవరి 1 : గుంటుపల్లి గ్రామంలో వైసీపీని వీడిన బట్టురాజు, మంచాల చిన్నాలతో పాటు పలువురికి మాజీమంత్రి ఉమా పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

● కొండపల్లిలో సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులకు ఉమా సంఘీభావం తెలిపారు. కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. పండుగ పూట కార్మికులను వస్తులుపెట్టిన పాపం జగన్‌కు తగులుందన్నారు.

● రూరల్ మండలం జక్కంపూడి కాలనీలో వైసీపీకి చెందిన గోవాడ వెంకటేశ్వరరావు, చందు రమణ బాబు, సూరిబాబు, చిన్నారావు, రాఘవా, సుధీర్, సాయి, ప్రవీణ్, ఫరీద్, మహేష్‌లు సహా మరో 50 కుటుంబాలను గొల్లపూడిలో ఉమా పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు.



ఉమా సమక్షంలో పార్టీలోకి చేరికలు

● జి.కొండూరు మండలం పినపాక గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీలో ఉమా పాల్గొని సూపర్ సిక్స్ పథకాల కర పత్రాలను పంచిపెట్టారు. టీడీపీ నాయకులు అంకెం సురేష్-ఇందిరా ప్రియదర్శిని, జి.కొండూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు పజ్జూరు వెంకటేశ్వరరావు (బుల్లి) ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉమా ఆవిష్కరించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగుమోతు రాజా

కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్

కార్యవర్గం ఎన్నిక

విజయవాడ, 1 జనవరి (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నాగుమోతు రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్ల కాలానికి ఆయన అధ్యక్షుడిగా ఉంటారు. సోమవారం కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా కాజ వెంకట సత్య చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శిగా అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శులుగా రావి శరత్‌బాబు, చెన్నుపాటి వినయ్, కోశాధికారిగా పొట్లూరి చంద్రశేఖరరావులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి పాలడుగు వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గత కార్యవర్గానికి వీడ్కోలు సత్కారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి రవాణా రంగ సమస్యలను తీసుకువెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రవాణా రంగానికి ఊపిరిలూదేందుకు నూతన కార్యవర్గం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



డెడ్‌లైన్ దాటిపోయింది సారూ..

▸▸ ప్లకార్డులతో టిడ్కో లబ్ధిదారుల నిరసన..

ఎన్నికలు పూర్తయిన ఆరు మాసాల్లో టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇస్తామని గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సారుకు ధన్యవాదాలు. రూపాయికే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇస్తామన్న హామీ నిలబెట్టుకోని సీఎం జగన్‌సారుకు కృతజ్ఞతలు.. అంటు లబ్ధిదారులు సోమవారం ప్లకార్డులతో పట్టణంలో టిడ్కో గృహ సముదాయం వద్ద వినూత్న నిరసన తెలిపారు. తాజాగా ఇచ్చిన డెడ్ లైన్ డిసెంబరు 31లోగా లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయిస్తామన్న హామీని నేరవేర్చలేక పోయారన్నారు. - జగ్గయ్యపేట

విద్యాశాఖ ఏడీగా మనోహర నాయక్

మచిలీపట్నం టౌన్, జనవరి 1 : జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీ పోస్టులో సోమవారం వి.మనోహర నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మనోహర నాయక్ పదోన్నతిపై డీఈవో కార్యాలయంలో ఏడీగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీఈవో తాహెరా సుల్తానా, ఏడీ 1 అజీజ్, సూపరింటెండెంట్ పవన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ పాఠశాలల్లో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలపై డీఈవోతో కలసి మంగళవారం ఉదయం ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

రామాలయంలో హారతికి వెండి సామగ్రి బహూకరణ



వన్‌టౌన్, జనవరి 1: కొత్తపేట అంగడాలవారి వీధిలో ఉన్న రామాలయంలో హారతికి వినియోగించే వెండి సామాగ్రిని సోమవారం వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కొణిజేటి రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి బహూకరించారు. ఈ సందర్భంగా రాములవారికి ప్రత్యేక అలంకారం చేశారు. కొణిజేటి రమేష్, సురేష్ దంపతులు అర్చనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కొణిజేటి అక్షయ్, జీవీ రవి కుమార్, కొణిజేటి అఖిల్, పీతా బుజ్జి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, జనవరి 1: నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల నిరంకుశపాలన చేసిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మొగల్రాజపురం బొండా ఉమామహేశ్వరరావు నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు సోమవారం మధ్యాహ్నం 21 డివిజన్ నాయకులు కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. బొండా ఉమా కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. అనంతరం పేదలకు పండ్లు, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకే సంపద ఎలా సృష్టించాలో తెలుసు అన్నారు. రామరాజ్యం తిరిగి రావాలన్నా, ప్రజారంజక పాలన సాగాలన్నా తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యం అన్నారు. సెంట్రల్‌లో ఉన్న 2.72లక్షల మందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో పెటుకొని తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్లబాల స్వామి, ఘంటా కృష్ణమోహన్, దెందుకూరి మురళీ కృష్ణంరాజు, నవనీతం సాంబశివరావు, నాని, వెంకి, బాబి, పరుచూరి ప్రసాద్, మల్లికార్జున్, సతీష్, కనకారావు, వెంకన్న, ఉదయశ్రీ, సింహాచలం, అమర్నాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బొండా ఉమామహేశ్వరరావు, ఘంటా కృష్ణమోహన్

వీఎంసీలో నూతన సంవత్సర వేడుకలు

● మేయర్, కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేసిన అధికారులు

చిట్టినగర్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌లను పలువురు అధికారులు కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత కమిషనర్ స్వప్నిల్ దినకర్ కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకరరావు, సీఎంహెచ్‌వో పీ.రత్నావళి, పలువురు ఇంజనీరింగ్, ప్రజారోగ్య, యూసీడీ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

● మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్‌లను వారి వారి చాంబర్లలో కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు జీ అజయ్‌కుమార్ పలువురు డైరెక్టర్‌తో కలసి పుష్పగుచ్ఛాలతో నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ క్రెడిట్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరించారు. పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో...

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సోమవారం నూతన సంవత్సర ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి సిబ్బందికి, పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యంవీడీటి నగేష్, గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం చైర్‌పర్సన్, కార్యదర్శులకు సిబ్బంది జ్ఞాపికలు అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

క్యాలెండర్ ఆవిష్కరణ

సత్యనారాయణపురం: శ్రీ మాధవకృష్ణ యాదవరాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం 58 వ డివిజన్ కృష్ణాహోటల్ సెంటర్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి అనంతరం డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు, సంఘం అధ్యక్షుడు మరకా శ్రీనివాస్, ఉమ్మడి వెంకట్రావ్‌ల చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎం.వెంకట్రావయ్య, వీర్ల సత్యనారాయణ, జి. వెంకటేశ్వరరావు, కొలుసు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోగుల రమణారావు

పుస్తక పంపిణీ కేంద్రాలను వినియోగించుకోవాలి

● గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ

కృష్ణలంక, జనవరి 1: పుస్తక పంపిణీ కేంద్రాలను విద్యార్థులు, ప్రజలందరూ వినియోగించుకోవాలని ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణలంక హైస్కూల్ రోడ్డులో ఏర్పాటు చేసిన బుక్ డిపాజిట్ సెంటర్‌ను టి.జమలపూర్ణమ్మ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలు, పట్టణాల్లోని చిన్న చిన్న ప్రాంతాలకు కూడా అందరికీ అందుబాటులో గ్రంథాలయాలు ఉండాలనే ఉద్దేశ్యంతో కృష్ణలంకలో బీడీసీ (బుక్ డిపాజిట్ సెంటర్)ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఎంవీడీటీ నగేష్, ఠాగూర్ స్మారక గ్రంథాలయం గ్రేడ్-1 అధికారిణి కె.రమాదేవి మాట్లాడారు. గ్రంథాలయ సిబ్బంది జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, పణిబాబు, కె.వి.సుబ్రహ్మణ్యం, డి.సుబ్రహ్మణ్యం, కేర్‌టేకర్ పడిది హేమసారిక తదితరులు పాల్గొన్నారు.



బుక్ డిపాజిట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జమలపూర్ణమ్మ, నగేష్, రమాదేవి తదితరులు

నైపుణ్యాలను గుర్తించాలి

● ఏపీ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ డైరెక్టర్ కోట్ల శివశంకర్‌రావు

మొగల్రాజపురం, జనవరి 1: ప్రతి మనిషిలో అంతర్లీనంగా వారి అభిరుచులకు తగ్గ విధంగా నైపుణ్యాలు ఉంటాయని వాటిని గుర్తించి బయటకు తీసి ముందుకు వెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ డైరెక్టర్ కోట్ల శివశంకర్‌రావు చెప్పారు. మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శిక్షణ కోసం వచ్చే వారిలో నైపుణ్యాలు గుర్తించి వారికి తగిన మార్గదర్శనం చేయాలని సూచించారు. జనశిక్షణా సంస్థాన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు, మహిళలకు వృత్తి విద్య, ఉపాధి అవకాశాలలో శిక్షణ ఇచ్చే ఉద్యోగులు కూడా సాంకేతికంగా ప్రావీణ్యత సాధించాలని సూచించారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. సంస్థ శిక్షకులు, సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఏఎం ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

గవర్నర్‌పేట, జనవరి 1: 25వ డివిజన్ సీతారామపురంలోని మహంతి అప్పలనరసయ్య, మహాలక్ష్మీ (ఎంఏఎం) ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ మహంతి వాసుదేవరావు (వాసు) మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేయడంతో పాటు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. ట్రస్ట్ సభ్యులు దూండీ రామ్‌ప్రసాద్, దాలినాయుడు, గౌతమి, రమణ తదితరులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ వెలగతోటి రాజారావు తదితరులు

సెయింట్ పీటర్స్ కెథడ్రల్‌లో ప్రత్యేక ప్రార్థనలు

వన్‌టౌన్, జనవరి 1: స్థానిక తారాపేటలోని సెయింట్ పీటర్స్ కో కథెడ్రల్‌లో సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమంలో బిషప్ వెలగతోటి రాజారావు పాల్గొన్నారు. ఆయన విచారణ కర్తలు దామల విజయకుమార్, కామా క్రీస్తురాజు, పలి అంబేడ్కర్‌లతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేసి సందేశాన్ని ఇచ్చారు. ఆశీస్సులు అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న గద్దె హరిబాబు

తెల్లరేషన్ కార్డులకు ఉచితంగా ఉజ్వల్ గ్యాస్

భవానీపురం, జనవరి 1 : ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల్ గ్యాస్ పథకంలో తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి వంట గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉచితంగా అందివ్వనున్నట్లు శ్రీ భవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె హరిబాబు అన్నారు. సోమవారం విద్యాధరపురంలోని గ్యాస్‌కంపెనీ ఆవరణలో కేక్ కట్ చేసి డెలివరీ బాయ్‌లకు, లబ్ధిదారులకు అందించి మాట్లాడారు. సిబ్బందికి నూతన వస్త్రాలను బహూకరించారు. భారత్ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ మంకేష్ షా, సంస్థ మేనేజర్ నీలిమలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

వన్‌టౌన్, జనవరి 1: గవర్నరుపేట పోలీసు స్టేషన్ పరిధిలో తాడంకివారి వీధిలోని ఓ హోటల్‌లో 11 మంది పేకాళ్ల రాయుళ్లను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు లాడ్జిలోని రూమ్ 312లో దాడి చేశారు పేకాట రాయుళ్ల నుంచి రూ.7040 లు, తొమ్మిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్‌కు అర్చకుల ఆశీస్సులు

వన్‌టౌన్, జనవరి 1: విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మికి నూతన ఆంగ్ల సంవత్సరం ఆరంభం సందర్భంగా సోమవారం విజయేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఆశీస్సులు అందచేశారు. దేవస్థానం ధర్మకర్త ఫణుకు ఫణీంద్ర దూండీ ఈ సందర్భంగా ఆమె చిత్రపటాన్ని ఆమెకే అందజేశారు. అర్చకులకు వస్త్రాలు, పండ్లను మేయర్ అందజేశారు. అర్చకులు ఆశీర్వదించారు.

ప్రార్థనకు వెళ్లి వచ్చేసరికి నగలు, నగదు చోరీ

జగ్గయ్యపేట, జనవరి 1: పట్టణ శివారు చిల్లకల్లు రోడ్డులోని హోసన్నా చర్చి రోడ్డులో సోమవారం తెల్లవారుజామున ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో వారంతా విజయవాడలో ఒక చర్చికి ప్రార్థనకు వెళ్లి సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి చోరీ వెలుగులోకి వచ్చింది. గుంజా నరసమ్మ (50) తన కుమార్తెలిద్దరితో ఆదివారం రాత్రి చర్చిలో ప్రార్థనకు వెళ్లింది. సోమవారం ఉదయం 7గంటలకు తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి వెనుక వైపు తలుపు పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి చూస్తే ఇంట్లో బీరువాలో ఉన్న రూ.60 వేలు, 40 గ్రాముల బంగారు నానుతాడు, ఉంగరాలు, బుట్టలు చోరీ అయ్యాయి. బీరువా తాళాలు దొరకటంతో చోరీ చేసి, తాళం వేసి వెళ్లారు. నరసమ్మ కుమార్తె చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తోంది. జీతం డబ్బు చోరీ అయింది. చోరీపై జగ్గయ్యపేట ఎస్సై ఆనందకుమార్ విచారణ చేస్తున్నారు. విజయవాడ నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరిస్తుంది.

ఓటుతో జగన్‌కు బుద్ధి చెప్పండి

● టీడీపీ నాయకులు రంగారావు, నామేశ్వరరావు

కృష్ణలంక, జనవరి 1 : స్థానిక 21వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం చిన్నారితో నూతన సంవత్సర కేకును కట్ చేయించారు. అనంతరం 21వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేములపల్లి రంగారావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించడమే కాకుండా వైసీపీ డి పాజిట్లు కూడా గల్లంతయ్యే విధంగా ఓటు ద్వారా జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ నాయకులు కేశనం భావన్నారాయణ, వల్లూరు మధు, కొర్రా అప్పన్న, చాపరాల వెంకట్రావు, కొల్లి గోకుల్, యలవర్తి సత్యం, ఆర్.రమాదేవి, డిప్పిలి దుర్గారావు, జనసేన నాయకులు బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నారితో కేకు కట్ చేయిస్తున్న రంగారావు, నామేశ్వరరావు

పేద మహిళకు తోపుడు బండి అందజేత

వన్‌టౌన్, జనవరి 1: పశ్చిమ జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో జనసేన యువ నాయకుడు నామన కార్తిక్ చంద్ర ఆర్థిక సహాయంతో నాలుగు స్తంభాల వద్ద పేద మహిళ కట్టపూల రంగమ్మకు తోపుడు బండిని అందచేశారు. పార్టీ అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ తోపుడు బండిని అందచేసి ఆమె వ్యాపారాభివృద్ధిని ఆకాంక్షించారు. మల్లెపు విజయలక్ష్మి, కొప్పిరెడ్డి మూర్తి, అజయ్ వర్మ, స్టాలిన్ శంకర్, జనసేన నాయకులు,వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు. నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న మహేశ్, తదితరులు

విద్యార్థినులకు నగదు అందజేత

ధర్నాచౌక్, జనవరి 1: హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ ప్రెసిడెంట్ చందన వెంకట్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందిం చారు. తండ్రిని కోల్పోయి ఫీజు చెల్లించ డానికి ఇబ్బందులు పడుతున్న వీరికి ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి చేతుల మీదుగా సోమవారం రూ. 40 వేలను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నూతన ఏడాది మొదటి రోజు ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్‌కు సహాయం అందించిన హెల్పింగ్ హాండ్స్‌ను అభినందించారు. దీనిలో తనను భాగస్వామ్యం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సీఐ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదును అందజేస్తున్న డీసీపీ చక్రవర్తి

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు సహకరించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 1: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024 విద్యా సంవత్సరానికి జరిగే ప్రవేశ పరీక్షకు విద్యాశాఖ నుంచి సహకారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ కోరారు. సోమవారం విజయవాడలోని కార్యాలయంలో కమిషనర్ సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వేలేరు నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు ఇచ్చే శిక్షణ పద్ధతులు, వివిధ పోటీల్లో పాల్గొని సాధించిన పతకాల గురించి వివరించారు. జనవరి 20న జరుగనున్న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష సంయుక్త కృష్ణాజిల్లాలోని 22 కేంద్రాల్లో 4,407మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలు, సదుపాయాలు తదితర విషయాలలో సహకారం కావాలని కోరారు.

నూతన సంవత్సరంలో చంద్రబాబుకు సీఎంగా పట్టాభిషేకం

వన్‌టౌన్, జనవరి 1: నూతన సంవత్సరంలో చంద్రబాబుకు సీంగా పట్టాభిషేకం జరుగు తుందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాల మేరకు సోమవారం టీడీపీ పశ్చిమ కార్యాలయంలో టీం టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2024లో చంద్రబాబు సీంగా పట్టాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు రాజు సోలంకి, వెంకట సుబ్బారావు, మరుపిళ్ల తిరుమలేష్, సారిపల్లి రాధాకృష్ణ ,సుకాశి సరిత, టీం టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర వేడుకల్లో ఎంఎస్ బేగ్

అమెరికన్ మెడికల్ అసోసియేషన్ బృందానికి సత్కారం



అమెరికన్ మెడికల్ అసోసియేషన్ బృందంతో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, జనవరి 1: భారతదేశంలోని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, వైద్య విద్యను అధ్యయనం చేసేందుకు వచ్చిన అమెరికన్ మెడికల్ అసోసియేషన్ బృందాన్ని ఆదివారం రాత్రి తాడేపల్లిలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కలిసి సత్కరించారు. రాష్ట్రంలో పాడి రైతుల ఆరోగ్య సంరక్షణకు అమెరికన్ మెడికల్ అసోసియేషన్ కృషి చేయాలని కోరారు. ముక్కామల అప్పారావు, సుమతి దంపతుల కుమారుడు బృందానికి శ్రీనివాస్(బాబీ) ముక్కామల నాయకత్వం వహించడం దేవానికి గర్వకారణమని, వారి తల్లిదండ్రులలాగే డాక్టర్ శ్రీనివాస్ సమాజ సేవకు విశేష కృషి చేస్తున్నారని ఆంజనేయులు కొనియడారు. ఈ బృందంలో డాక్టర్ మైఖేల్ సుక్, డాక్టర్ నిటా కుళకరిని, డాక్టర్ విల్లర్డ్ వి ఎడ్వర్డ్స్, డాక్టర్ మెడికలిన్ ఈ బట్లర్, డాక్టర్ థామస్ జె మెడెజ్కి, డాక్టర్ అలెగ్జాండర్ డింగ్, డాక్టర్ ఫ్రెడ్రిక్ ఎం చెన్, డాక్టర్ ముక్కామల అప్పారావు, సుమతిల బృందం భారతదేశంలో పలుప్రదేశాలను సందర్శించి ఆరోగ్య పరిస్థితులపై అధ్యయనం చేస్తుంది.

జాతీయస్థాయిలో థర్డ్‌ఫ్రంట్ అవశ్యం

ధర్నాచౌక్, జనవరి 1: జాతీయస్థాయిలో ఎన్డీఏ, ఇండియా కూటమిలకు ప్రత్యామ్నాయంగా థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకత ఉందని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాలు చేసిన అప్పులతో ఆర్థిక వ్యవస్థ అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. అదేవిధంగా అధిక ధరల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని మండిపడ్డారు. సమాజంలో ఆర్థిక అసమానతలు, రైతుల ఆత్మహత్యలు, సాంఘిక అణచివేతలు లేని మెరుగైన సమాజ అభివృద్ధి కోసం థర్డ్‌ఫ్రంట్ నిర్మాణం ఉంటుందన్నారు.

సర్పంచ్‌లు ఐక్యంగా ఉద్యమించాలి

ఆకునూరు(ఉయ్యూరు), జనవరి 1 : గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌లకు రాజ్యాంగం కల్పించిన హక్కులు. నిధులు, విధులు హరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాల్లా తయారు చేస్తున్న సందర్భంలో ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తిమోతి, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ పిలుపు నిచ్చారు. ఆకునూరులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 3న మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చాంబర్ ఆధ్వర్యంలో సదస్సు పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు తెలిపారు.

మా జోలికొస్తే మాకడ్డువస్తే మామూలుగా ఉండదు..



క్లాస్ కేరక్టర్ చేసినా మాస్ కేరక్టర్ చేసినా ఒదిగిపోయి నటించడం నాగార్జున ప్రత్యేకత. రానున్న సంక్రాంతికి 'నా సామిరంగ' అంటూ బాక్సాఫీస్‌పై యుద్ధానికి సిద్ధమయ్యారు నాగ్. విజయ్ బిన్ని దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ సాంగ్, లిరికల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. 'మాజోలికొస్తే.. మాకడ్డువస్తే.. మామూలుగా వుండదు.. నా సామిరంగ.. ఈ గీత తొక్కితే.. మా సేత సిక్కితే.. మామూలుగా ఉండదు.. నా సావిరంగ' అంటూ హీరో పాత్ర లక్షణాలను తెలియజేస్తూ చంద్రబోస్ రాసిన ఈ పాటను మాస్ మెచ్చేలా ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారని, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ హై ఎనర్జీతో ఈ పాటను ఆలపించారని, నాగార్జున, అల్లరి నరేశ్, రాజ్ తరుణ్‌లతోపాటు మూడు వందలమంది డాన్సర్స్ పాల్గొనగా దినేశ్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. స్నేహం, భావోద్వేగాల మేళవింపుగా రూపొందిన 'నా సావిరంగ' సంక్రాంతికి పర్‌ఫెక్ట్ మూవీ అని వారు అన్నారు. ఆశికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్న ఈ హైబడ్జెట్ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ.

న్యూ ఇయర్... న్యూ లుక్స్














కొత్త సంవత్సరం కొత్త లుక్స్‌తో సినీ ప్రపంచానికి నూతన శోభను తెచ్చే పని లోవున్నారు మన స్టార్స్. రేపు సంక్రాంతికి వెంకటేశ్ 'సైంధవ్', నాగార్జున 'నా సామిరంగ, మహేశ్ 'గుంటూరుకారం', రవితేజ 'ఈగల్, తేజా సజ్జా 'హను-మాన్' సినిమాలు సందడి చేయనున్నాయి. సంక్రాంతి అంటే సినిమాల పండగ. పండుగ సినిమాలు కాబట్టి ప్రమోషన్ల హడావిడి కామన్. అయితే.. వచ్చే నెలలో విడుదలయ్యే సినిమాలు కూడా ఈ సంక్రాంతి సీజన్‌ని వదలట్లేదు. పనిలోపనిగా ఆ సినిమాల న్యూ లుక్కుల్ని కూడా విడుదల చేసేస్తూ హంగామాను రెట్టింపు చేస్తున్నారు నిర్మాతలు. పండగ సినిమాలైన వెంకటేశ్ 'సైంధవ్', రవితేజ 'ఈగల్' న్యూలుక్కుల్ని సదరు నిర్మాతలు కొత్త ఏడాది తొలిరోజున విడుదల చేశారు. వెంకటేశ్ సినిమా అంటే భావోద్వేగాల సమ్మిళితంగా ఉంటుంది. అందుకు తగ్గట్టే ఈ న్యూలుక్ ఉంది. కూతురుతో ఆడుకుంటున్న తండ్రిలా వెంకటేశ్ ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. శైలేష్ కొలను ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక సోమవారం విడుదలైన మరో పండగ సినిమా న్యూలుక్ రవితేజ 'ఈగల్'ది. ఈ లుక్‌లో స్టైలిష్‌గా అండర్‌వరల్డ్ డాన్‌ని తలపిస్తున్నారు రవితేజ. ఏదేమైనా ఈ న్యూలుక్స్ సినిమాలపై అంచనాలు పెంచేలా ఉన్నాయని చెప్పక తప్పదు. ఇక సోమవారం విడుదలైన మరో న్యూలుక్ ఎన్టీయార్ 'దేవర'ది. ఇది పండుగ సినిమా కాదు. ఏప్రిల్ 5న విడుదల కానుంది. అయితే.. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ని ఈ నెల 8న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారక్ న్యూలుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. అలలతో ఎగసిపడే సముద్రంలో బోట్‌పైన ఠీవీగా నిలబడ్డ తారక్‌ని ఈ లుక్‌లో చూడొచ్చు. మాస్‌ని మెప్పించేలా ఈ లుక్ ఉందని చెప్పొచ్చు. కొరటాల శివ దర్శకత్వంలో రెండు భాగాలుగా తెరకెక్కనున్న ఈ సినిమాలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. వీటితోపాటు గోపీచంద్ 'భీమా', గల్లా అశోక్ హీరోగా నటిస్తున్న రెండో సినిమా, అంజలి ప్రధానపాత్రలో రూపొందుతోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రాల పోస్టర్లను కూడా సదరు చిత్రాల నిర్మాతలు విడుదల చేశారు. మొత్తానికి పండక్కి విడుదలయ్యే సినిమాలతోపాటు, నిర్మాణంలో ఉన్న సినిమాల న్యూలుక్కులు కూడా తోడవ్వడంతో అటు మీడియా, ఇటు సోషల్‌మీడియాలు కళకళలాడిపోతున్నాయి.

వచ్చే నెల్లో రకుల్ పెళ్లి





పంజాబీ భామ రకుల్ ప్రీత్‌సింగ్, ఆమె బాయ్‌ఫ్రెండ్, నిర్మాత జాకీ భగ్నానీ పెళ్లి తేదీ ఫిక్స్ అయింది. మూడేళ్ల నుంచి ప్రేమలో ఉన్న ఈ జంట ఫిబ్రవరి 22న జరిగే వివాహంతో ఒకటి కానుంది. . 'రకుల్, జాకీల పెళ్లి వచ్చే నెల 22న గోవాలో జరుగుతుంది. ఆర్భాటాలు ఏమీ లేకుండా అతి కొద్దిమంది కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య పెళ్లి చేసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం జాకీ బ్యాంకాక్‌లో స్నేహితులతో బ్యాచ్‌లర్ పార్టీతో బిజీగా ఉన్నారు. రకుల్ కూడా థాయ్‌లాండ్‌లోనే ఉంది' అని ఆంగ్ల వెబ్ సైట్లు వెల్లడించాయి. నూతన సంవత్సరం తొలి రోజున వచ్చిన ఈ తీపి కబురుతో రకుల్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2021 అక్టోబర్‌లో తన పుట్టిన రోజున జాకీతో తను ప్రేమలో ఉన్న విషయాన్ని రకుల్ బయట పెట్టింది. అతనే తన ప్రపంచం అని కూడా పేర్కొంది. ఇక అప్పటినుంచి ఏ పార్టీకి వెళ్లినా ఇద్దరూ కలసే వెళుతున్నారు. వీర్దిద్దరి పెళ్లి త్వరలో జరుగుతుందనే వార్తలు కొంతకాలంగా వినబడుతున్నాయి కానీ ఇద్దరూ ఆ విషయం గురించి ఎక్కడా స్పందించలేదు. పెళ్లి గురించి తొందరపడడం లేదని రకుల్ ఇటీవలే చెప్పారు. ఇది జరిగిన నెల రోజులకే ఈ పెళ్లి వార్త బయటకు వచ్చింది. రకుల్ ప్రస్తుతం తెలుగులో ఏ సినిమాలు చేయడం లేదు కానీ కమల్‌హాసన్ నటిస్తున్న 'ఇండియన్ 2'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే జాకీ నిర్మించిన 'బడే మియా ఛోటే మియా' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.



అప్పుడు మున్నాభాయ్ తప్పక వస్తాడు



రాజ్‌కుమార్ హిరాణీ దేశం గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరు. వందశాతం సక్సెస్‌రేట్ ఉన్న అతికొద్ది మంది దర్శకుల్లో ఆయన కూడా ఒకరని నిస్సంకోచంగా చెప్పొచ్చు. ఆయన తీసిన సినిమాలన్నీ అద్భుతాలే. రీసెంట్‌గా వచ్చిన 'డంకీ' సైతం మూడొందలకోట్ల పైచిలుకు వసూళ్లను రాబట్టడమేకాక, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. 'డంకీ' వసూళ్ల గురించి ఇటీవల ఆయన మాట్లాడుతూ ' ఈసినిమా వసూళ్లను భారీ స్థాయిలో మేం ఆశించలేదు. కారణం ఇది కమర్షియల్ మాస్ సినిమా కాదు. ఇదొక వినోదంతో కూడిన సందేశాత్మక చిత్రం. షారుక్ కూడా ఈ సినిమా విషయంలో క్లారిటీగా ఉన్నాడు. అనుకున్నట్టే స్లోగా పికప్ అవుతోంది. ప్రస్తుతమైతే కలెక్షన్లు నిలకడగా ఉన్నాయి' అని చెప్పారు హిరాణీ.. 'మున్నాభాయ్' ఫ్రాంచైజీ గురించి మాట్లాడుతూ 'రెండు భాగాలూ నాకు మంచి పేరు తెచ్చాయి. వసూళ్ల పరంగా కూడా రికార్డులు సృష్టించాయి. మూడో భాగం చేయాలని ఉంది. సగం స్ర్కిప్ట్ కూడా రెడీగా ఉంది. అయితే.. తొలి రెండు భాగాల స్థాయిలో కథ రాకపోతే మాత్రం చేయను. సంతృప్తికరంగా వస్తే తప్పకుండా 'మున్నాభాయ్' మరోసారి మిమ్మల్ని పలకరిస్తాడు' అంటూ చెప్పుకొచ్చారు రాజ్‌కుమార్ హిరాణీ.

నేను దేవతను కాను

ఏ ఉద్వేగాన్నీ దాచుకోలేని మనస్తత్వం సమంతది. బాధైనా, సంతోషమైనా వ్యక్తపరచకుండా ఉండలేదు తను. రీసెంట్ న్యూ ఇయర్ సెలబ్రేషన్నే తీసుకోండి. విదేశాల్లో విహరిస్తూ.. తన ఆనందాన్ని ఓ ఇమేజ్ ద్వారా వ్యక్తం చేస్తూ.. తన ఇన్‌స్టాలో షేర్ చేసింది సమంత. ఆ స్టిల్ చూసిన వారంతా 'దేవత' అంటూ సమంతను కొనియాడుతున్నారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. 'నేను దేవతను కాను. ఉద్వేగాలతో అనునిత్యం సహవాసం చేసే మనిషిని. ఓర్పులో భూమికి సమానమైన స్త్రీని' అంటూ ఓ మంచి పోస్ట్‌ని జత చేసింది. ఈ పోస్ట్‌పై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం సినిమాలకు కామా పెట్టి విహారయాత్రల్లో బిజీగా ఉన్నారు సమంత. త్వరలోనే పూర్తి ఆరోగ్యంగా కెమెరా ముందుకు వస్తారని ఆమె అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ కమల్‌హాసన్ కుటుంబం ఆదివారం రాత్రి సందడి చేసింది. చెన్నైలోని కమల్ ఇంట్లో జరిగిన ఈ వేడుకలకు సుహాసిని, ఆమె భర్త మణిరత్నం, శ్రుతీ హాసన్, ఆమె బాయ్ ఫ్రెండ్ శంతను హజారికా తదితరులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో కమల్, శ్రుతి పాత తమిళ పాటలు పాడి సందడి చేశారు.

సుందరం మాస్టారి కథ



హర్ష చెముడు, దివ్య శ్రీపాద ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'సుందరం మాస్టారు'. కల్యాణ్ సంతోష్ దర్శకత్వంలో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఇంతవరకూ కమెడియన్‌గా మెప్పించిన హర్ష ఈ సినిమాలో తొలిసారిగా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా సుందరం మాస్టారు అటెండెన్స్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమా ఎంత వినోదభరితంగా ఉంటుందనేది ఈ ప్రోమో చూస్తే అర్థమవుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సుందరం అనే ప్రభుత్వ టీచర్ చుట్టూ తిరిగే కథ ఇది. మిర్యాల మెట్ట అనే మారుమూల పల్లెలో ఇంగ్లీషు టీచర్‌గా వెళ్లిన సుందరం దగ్గరకి ఎటువంటి విద్యార్థులు వస్తారు, వారికి అతను ఇంగ్లీషు ఎలా నేర్పించాడు అనే అంశాలను వినోదభరితంగా చెప్పాం.' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: దీపక్ ఎరెగడ.


ఈ రికార్డుని బ్రేక్ చేసేదెవరో?



గత ఏడాదిలో అనూహ్య విజయాలను అందుకొని అరుదైన రికార్డులను సృష్టించిన హీరో షారుక్ ఖాన్. భారతీయ చలనచిత్ర చరిత్రలో ఏహీరోకీ లేని రికార్డు 2023లో షారుక్ వశమైంది. అమితాబ్ తర్వాత బాలీవుడ్‌లో లాంగ్విటీ ఉన్న సూపర్‌స్టార్‌గా అవతరించారు షారుఖ్. బాలీవుడ్ సూపర్‌స్టార్‌గా, బాక్సాఫీస్ బాద్‌షాగా అభిమానులచే కితాబులందుకున్నారు. అయితే.. అంతటి సూపర్‌స్టార్‌కి కూడా బ్యాడ్ పీరియడ్ తప్పలేదు. దాదాపు నాలుగేళ్లు విజయం షారుక్‌పై సీతకన్నేసింది. చేసిన ప్రతి సినిమా ఫ్లాప్. షారుఖ్ పని అయిపోయిందని, ఇక రిటైర్ అవ్వడం బెటరంటూ వ్యంగ్యభాషణలు కూడా వినిపించాయి. అయితే సింహం రెండడుగులు వెనక్కు వేసేది వందడుగులు దూకడానికే అన్న చందాన 'పఠాన్'గా బాక్సాఫీస్‌పై విరుచుకుపడ్డారు షారుఖ్. 2023 జనవరి 25న విడుదలైన 'పఠాన్' బాలీవుడ్ రికార్డులను తిరిగి రాసింది. వెయ్యికోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టి బాద్‌షా క్రేజ్ ఇసుమంత కూడా తగ్గలేదని నిరూపించింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దీపిక పదుకొణే, జాన్ అబ్రహం, డింపుల్‌కపాడియా కీలక పాత్రలు పోషించగా, సల్మాన్‌ఖాన్ ప్రత్యేక పాత్ర పోషించడం విశేషం.


హీరోలకు ఏడాదికి ఒక హిట్ రావడమే గగనమైన నేటి రోజుల్లో అదే ఏడాది సెప్టెంబర్ 7న 'జవాన్'గా మరోసారి బాక్సాఫీస్‌పై దాడి చేశాడు కింగ్‌ఖాన్. తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మూడొందలకోట్ల భారీ బడ్జెట్‌తో రూపొంది దాదాపు 1200కోట్ల రూపాయాల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ఇందులో షారుక్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయగా, తండ్రి సరసన దీపిక పదుకొణే, కొడుకు సరసన నయనతార కథానాయికలుగా నటించారు. విజయ్‌సేతుపతి ప్రతినాయక పాత్ర పోషించిన ఈ చిత్రంలో ప్రియమణి కూడా కీలకపాత్ర పోషించారు. అనిరుథ్ సంగీతం సమకూర్చారు. దక్షిణభారతానికి చెందిన సినీకళాకారులు ఎక్కువమంది పనిచేసిన ఈ సినిమా షారుక్ కెరీర్‌లోనే వసూళ్ల పరంగా నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది.

2023 డిసెంబర్ 21న 'డంకీ'తో మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చారు షారుక్‌ఖాన్. రాజ్‌కుమార్ హిరాణి దర్శకత్వం వహించిన ఈ చిత్రం డీసెంట్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం ఇప్పటివరకూ అందిన సమాచారం మేరకు మూడొందలకోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లను రాబట్టిందని తెలిసింది. తాప్సీ పన్ను, బొమ్మన్ ఇరానీ, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం వినోదభరితంగానే గాక సందేశాత్మక చిత్రంగా విమర్శకుల ప్రశంసలందుకుంటోంది.



ఈ ఏడాది మొత్తంగా చూస్తే తన మూడు సినిమాలతో 2500కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి భారతీయ చలనచిత్ర చరిత్రలో రికార్డ్ సృష్టించారు షారుక్‌ఖాన్. ఇది ఏ హీరోకీ లేని రికార్డు. ఒకే ఏడాది మూడు సినిమాలు విడుదల అవ్వడం.. మూడూ విజయాలు సాధించడం.. వేలకోట్ల వసూళ్లను రాబట్టడం ఇది కనీవినీ ఎరుగని చరిత్ర.

ఈ విషయంపై ట్రేడ్ అనలిస్ట్ రమేశ్ బాలా తన బ్లాగ్‌లో 'ఒక కేలండర్ సంవత్సరంలో తన సినిమాల ద్వారా 2500కోట్ల రూపాయల స్థూల ఆదాయాన్ని బాక్సాఫీస్‌కి అందించిన తొలి భారతీయ నటుడు షారుక్‌ఖాన్' అంటూ అభివర్ణించారు. ఇది భారతీయ చలనచిత్ర చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన విషయం. నిజానికి రికార్డులు అనేవి తయారయ్యేది బ్రేక్ అవ్వడానికే. ఈ రికార్డు కూడా తప్పక బ్రేక్ అయి తీరుతుంది. ఎవరి చేతిలో అనేది కాలం చేతిలో ఉంది.



డాక్టర్

హ్యాపీ న్యూ ఇయర్

కొత్త ఆశలతో, ఆశయాలతో న్యూ ఇయర్‌లోకి అడుగుపెట్టేశాం! వాటిని అందుకోవాలంటే, అందుకు అడ్డొచ్చే ఆరోగ్య అవరోధాలను కొన్ని కిటుకులతో అధిగమించాలి.

కొత్తగా కొత్త సంవత్సరంలోకి...

గుండెల్నిండా ఊపిరి పీల్చండి: ఒత్తిడిని పటాపంచలు చేసే శక్తి మన మనసు, ఊపిరితిత్తుల్లో స్వతసిద్ధంగానే ఉంది. కాబట్టి ఒత్తిడి నిండుకున్నప్పుడు ఊపిరితో దాన్ని బయటికి తోసేసే ప్రయత్నం చేయండి. శ్వాస మీద మనసు లగ్నం చేసి ఒత్తిడిని పారదోలే పనిలో పంచేంద్రియాలను భాగస్వాములను చేయండి.

వారానికోసారి వ్యాహ్యాళి: నడక మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. అది వ్యాయామంలో భాగంగా ఉంటే సరిపోదు. వారానికోసారి పచ్చని ప్రకృతి మధ్య సేదతీర్చే నడకగా కూడా మారాలి. ఈ నడక వల్ల మనసుకు ఉపశమనం దొరుకుతుంది.

కొత్త అనుభవం: వస్తువుల మీద



కాకుండా అనుభవాల మీద పెట్టే వ్యయం ద్వారా అంతులేని ఆనందం పొందవచ్చు. కాబట్టి కొత్త సంవత్సరంలో మనసుకునచ్చే పని, అభిరుచి, అనుభవాలకు సమయాన్ని కేటాయించండి.

జోర్నల్ అవసరం: మనసులోని భావాలకు అక్షరరూపం ఇవ్వటం ఎంతో అవసరం. నెగిటివ్, పాజిటివ్... ఆలోచనలు ఎలాంటివైనా వాటిని రాసుకోవటం వల్ల మనల్ని మనం తెలుసుకోగలుగుతాం. మెచ్చుకోళ్లు ఆత్మ విశ్వాసాన్ని, మానసిక బలాన్ని పెంచుతాయి.

పాటలు వినాలి: నచ్చిన పాట వింటే మనసు తేలికవుతుంది. గుండె కొట్టుకునే తీరు, మెదడు యాక్టివిటీలనుబట్టి కొన్ని ట్యూన్స్ ఆందోళనను 65% తగ్గించ గలుగుతాయని పరిశోధనల్లో రుజువైంది. కాబట్టి సంగీతాస్వాదన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

విషాన్ని వెదజల్లే వాళ్లకు దూరంగా: ఒత్తిడి, సంతోషం...ఇవి రెండూ అంటువ్యాధుల్లాంటివి. కాబట్టి చుట్టూ చేర్చుకునే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. ఎప్పుడూ ఆందోళనతో సతమతమయ్యే స్నేహితుడి సాంగత్యంతో ఆందోళనపడటం మీ స్వభావంగా మారే ప్రమాదం ఉంది.

మద్యం వద్దు: అరుదుగా కాకుండా ప్రతి వారాంతం మద్యానికి కేటాయించి హ్యాంగోవర్‌తో బాధపడటం అలవాటు చేసుకుంటే మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. మద్యం వల్ల యాంగ్జయిటీ కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. కాబట్టి ఒత్తిడిని ఇతర ప్రత్యామ్నాయాలతో వదిలించాలి.

వెకేషన్‌కి వెళ్లాలి: ఉద్యోగమైనా, వ్యాపారమైనా మొనాటనీ ఆనందాన్నివ్వదు. కాబట్టి మార్పు కోసం దూర ప్రాంతాలకు వెకేషన్ ప్లాన్ చేయండి. వీకెండ్ అడ్వెంచర్ అయినాసరే, వారంపాటు సాగే సుదూర ప్రయాణమైనాసరే! వెకేషన్ కోసం ప్రణాళికలు వేస్తూ ఉండాలి.

నిద్రకు మరో గంట: కంటినిండా నిద్ర మరుసటి రోజుకి కావాల్సిన ఓపిక, ఉత్సాహాలను సమకూరుస్తుంది. నిద్ర తగ్గితే ఆ ప్రభావం మానసిక, శారీరక ఆరోగ్యాలను దెబ్బతీస్తుంది. చిరాకు, విసుగు, ఒళ్లునొప్పులు, నిరాసక్తి, నీరసం...ఇలా చెప్పుకుంటూపోతే నిద్రలేమి తెచ్చిపెట్టే సమస్యలకు అంతే ఉండదు. కాబట్టి వీటికి గుడ్‌బై చెప్పాలంటే నిద్ర సమయం మరో గంటకు పెంచాలి.

ఫిట్‌నెస్



సైకిల్ తొక్కేయ్! హెల్త్ పట్టేయ్!

ఫిట్‌నెస్‌కి దగ్గరి దారి సైక్లింగ్. బరువును తగ్గించటంతోపాటు డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళనలను కూడా సైక్లింగ్ అదుపులో ఉంచుతుంది. సైక్లింగ్ గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలున్నాయి. అవేంటంటే...

- కీళ్ల నొప్పులున్నవాళ్లు 'స్టాటిక్ సైక్లింగ్' చేయాలి. అంటే.... జిమ్‌లో ఉండే సైకిల్ తొక్కాలి.
- మధుమేహులు సైక్లింగ్ తొక్కాలనుకుంటే మామూలుకంటే రెండింతలు నీళ్లు తాగాలి.
- పరిగెత్తటం వల్ల కీళ్ల మీద పడే ఒత్తిడి కంటే సైక్లింగ్ వల్ల పడే ఒత్తిడి తక్కువ.
- సైక్లింగ్ వల్ల కాలి పిక్కలు, తొడలు, పిరుదులు చక్కటి ఆకృతిని సంతరించుకుంటాయి.
- చలి కాలంలో పట్టేసే కండరాలు, కీళ్లు వదులవ్వాలంటే సైక్లింగ్ చేయాలి.
- రోజుకి కనీసం 30 నిమిషాల సైక్లింగ్ శరీరానికంతటికీ సరిపడా వ్యాయామాన్ని అందిస్తుంది.

హెల్త్ వెల్త్



ముఖం లావైందా?

కొంతమందికి ముఖం లావుగా మారుతూ ఉంటుంది. దాంతో వయసు పైబడిన వాళ్లలా కనిపిస్తున్నామని బాధపడుతూ ఉంటారు. అయితే ఇందుకు మూల కారణాన్ని కనిపెట్టి వాటిని సరిదిద్దుకోవాలి.

శరీరంలో ఏదో ఒక అవయవం లావును సహజసిద్ధంగా తగ్గించుకోవడమనేది అసాధ్యం. అయితే కొందరిలో ముఖం లావుగా మారిపోతూ ఉంటుంది. ఇందుకు కొన్ని ప్రత్యేకమైన కారణాలున్నాయి. అవేంటంటే...

- **మందులు:** కార్టికోస్టిరాయిడ్లు, ఎసిఇ ఇన్హిబిటర్లు, అధిక రక్తపోటుకు వాడే కొన్ని మందులు ముఖాన్ని లావెక్కేలా చేస్తాయి. ఈ విషయాన్ని గ్రహించినప్పుడు వెంటనే విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.
- **ఫైబర్:** కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి వాటిని వదిలించడం కోసం పీచు ఎక్కువగా ఉండే, ఓట్లు, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఈ పదార్థాల్లోని న్యూట్రియంట్లు పొట్టను నింపేసి, ఆకలిని తగ్గిస్తాయి. దాంతో అనవసరపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా ఉంటాయి.
- **క్యాలరీలు:** చేస్తున్న వ్యాయామం కంటే తీసుకుంటున్న క్యాలరీలు ఎక్కువగా ఉంటే లావవ్వడం ఖాయం. కాబట్టి వారానికి 150 నిమిషాల మోడరేట్, ఇంటెన్స్ వర్కవుట్స్ చేస్తూ ఉండాలి. తీసుకునే క్యాలరీలు తగ్గించాలి.
- **ఉప్పు:** శరీరంలో ఉప్పు పరిమాణం పెరిగితే నీరు నిల్వ ఉండిపోతుంది. కాబట్టి ఉప్పు వాడకం తగ్గించాలి.
- **ఆల్కహాల్:** మద్యం తాగిన మరుసటి రోజు ముఖం లావెక్కుతుంటే, ఆ అలవాటు మానుకోవాలి.
- **నీళ్లు:** డీహైడ్రేషన్ వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండిపోతుంది. కాబట్టి రోజుకు 10 గ్లాసులకు తగ్గకుండా నీళ్లు తాగాలి. సరిపడా నీళ్లు తాగుతున్నారో లేదో ఎవరికి వారు తెలుసుకోవడం కోసం, మూత్రాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి. మూత్రం లేత రంగులో ఉంటే సరిపడా నీళ్లు తాగుతున్నారని అర్థం.



శీతాకాలం సమస్యలు

చల్లర్జీకి చెక్..!

చలి కాలంలో తుమ్ములు, జలుబులు, దగ్గులు మామూలే అని సర్దుకుపోకూడదు. అలర్జీ తత్వం ఉన్నవాళ్లు ఇలా సర్దుకుపోతే మరిన్ని ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్టే! చలికాలం అలర్జీ ఇక్కట్లకు గురికాకుండా ఉండాలంటే కాస్త ముందుచూపు, మరికాస్త అప్రమత్తతతో వ్యవహరించి చల్లర్జీకి చెక్ పెట్టాలి!

చలికాలం సమస్యలను అర్థం చేసుకోవాలంటే వాటికి కారణాల గురించి కూడా కొంత అవగాహన పెంచుకోవాలి. ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉండే ముక్కు, గొంతు, చెవులు చలికాలం సమస్యలకు మూలాలవుతూ ఉంటాయి. ముక్కు, గొంతుల్లో 'మ్యూకస్ మెంబ్రేన్' అనే సున్నితమైన పొరలు చల్లని వాతావరణానికి ప్రేరేపితమై జలుబు, దగ్గు, సైనస్, అడినాయిడ్స్, టాన్సిల్స్ మొదలైన ఇబ్బందులను తెచ్చి పెడుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా అలర్జీ తత్వం ఉన్నవాళ్లకు ఈ లక్షణాలు ఇంకా త్వరగా మొదలవుతాయి. వాతావరణంలో చిన్నపాటి హెచ్చుతగ్గులకే సమస్యలు మొదలవుతాయి. వీళ్లలో హైపర్ రియాక్టివ్ మార్పులు కనిపిస్తాయి. వాతావరణంలోని చల్లదనానికి గురవగానే, చర్మం అడుగున ఉండే సన్నని నరాల చివర్లు కొన్ని రసాయనాలను విడుదల చేయటం మొదలుపెడతాయి. ఇవి ముక్కు, గొంతుల్లో ఉండే మ్యూకస్ మెంబ్రేన్స్ లైనింగ్‌ను ప్రభావితం చేయడంతో జలుబు, దగ్గు, ముక్కు నుంచి నీరు కారటం, ఆయాసం మొదలైన ఇబ్బందులు రోజుల తరబడి వేధిస్తాయి.

అలర్జీ సమస్యలు ఇవే!

అలర్జీ తత్వం ఉన్న వాళ్లలో చల్లని వాతావరణానికి వారి వారి శరీర తత్వాన్నిబట్టి రకరకాల సమస్యలు తలెత్తటం సహజం. అవేంటంటే...

- **హైపర్ రియాక్టివ్ బ్రాంకైటిస్:** వీళ్లకి ఆస్తమా ఎటాక్ వస్తుంది. ఊపిరి అందకపోవటం, ఆయాసంతోపాటు పిల్లికూతల లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఉదయం, రాత్రి వేళల్లో ఎక్కువై, నిద్ర కూడా కరవవుతుంది. విపరీతమైన దగ్గు ఉంటుంది.
- **హైపర్ రియాక్టివ్ లారింగైటిస్:** వీళ్లకి రాత్రి వేళ దగ్గు ఎక్కువవుతుంది. పొడి దగ్గు, లేదంటే కొద్దిగా కఫంతో కూడిన దగ్గు ఉంటుంది. గొంతు బొంగురు పోతుంది.
- **హైపర్ రియాక్టివ్ రైనైటిస్:** ముక్కు దిబ్బడ, ఆగకుండా తుమ్ములు, ముక్కు నుంచి నీరు కారటం ఈ సమస్య లక్షణాలు.

జీవనశైలి మారాలి!

అలర్జీ తత్వం ఉన్నవాళ్లు ఇతరుల కంటే అప్రమత్తంగా ఉండాలి. అలర్జీ బారినపడి అవస్థలు పడే కంటే ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తే ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. ఇందుకోసం...

- **వాతావరణానికి తగిన దుస్తులు:** చల్లగాలి ఒంటికి తగకుండా మందపాటి దుస్తులు వేసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, గొంతులోకి చల్లని గాలి చొరబడనివ్వకుండా చూసుకోవాలి. స్కార్ఫ్‌లు, మఫ్లర్లు, గ్లౌజులు వాడాలి. స్లీవ్‌లెస్, షార్ట్స్, టీ షర్ట్‌లు, స్కర్ట్‌లు వేసుకోవటం మానేయాలి.
- **వెచ్చ వెచ్చగా:** ఇల్లు వెచ్చగా ఉంచుకోవటం కోసం రూమ్ హీటర్లు వాడాలి. వేడి నీళ్ల స్నానం చేయాలి. సాధ్యమైనంత వరకూ చల్లని నీటికి దూరంగా ఉండాలి. పొడిగా ఉండే దుస్తులే ధరించాలి.
- **తేమ సమంగా!:** చలికాలం గాలిలో తేమ తగ్గుతుంది. దీని వల్ల కూడా అలర్జీ ఉన్న వ్యక్తుల్లో ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి తేమను సమంగా ఉంచుకోవటం కోసం పడగ్గదిలో చిన్న స్టవ్ మీద నీళ్లు ఉంచి మరిగించాలి. చిన్న మంట మీద ఉంచితే నీళ్లు మరుగుతూ ఆవిరి గాల్లో కలిసి గదంతా తేమ విస్తరిస్తుంది.
- **ఆహార నియమాలు:** చలికాలంలో ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్ లాంటి చల్లని పదార్థాలు తీసుకోకూడదు. కొందరికి కొన్ని రకాల ఆహార పదార్థాలు తినటం వల్ల అలర్జీ లక్షణాలు మొదలవుతాయి. అవేంటో...ఎవరంతట వాళ్లే గుర్తించి వాటికి దూరంగా ఉండాలి. కొందరికి గుడ్లు, మరికొందరికి తీపి పదార్థాలు పడకపోవచ్చు.
- **పులుపు, కారం, తీపి:** రుచుల్లో విపరీతమైన తత్వం... అంటే, అతి పుల్లని, అతి తీపి, అతి కారం...ఇలాంటి పదార్థాలు అలర్జీ తత్వం ఉన్న వాళ్లు తినకపోవటమే మంచిది. వీటికి బదులుగా మధ్యస్థంగా ఉండే తేలికపాటి ఆహారం తీసుకోవాలి.

> **తీపికి విరుగుడు కారం!**
>
> తీపితో అలర్జీ వేధించే శరీర తత్వం ఉన్న వాళ్లు ఎప్పటికీ స్వీట్లకు దూరంగా ఉండాలన్నా కష్టమే! మరీ ముఖ్యంగా వేడుకలు, పెళ్లిళ్ల సమయంలో స్వీట్లను తప్పించుకోలేం! ఇలాంటప్పుడు తీపితో ముడిపడి ఉండే అలర్జీకి గురికాకుండా ఉండాలంటే తీపి తిన్న వెంటనే, కారంగా ఉండే స్నాక్స్ తినాలి. ఇలా చేస్తే తీపి వల్ల శరీరంలో మ్యూకస్ మెంబ్రేన్‌లో కలిగే మార్పులు కారంతో సర్దుకుంటాయి. ఒకవేళ కారంగా ఉండే పదార్థాలు అందుబాటులో లేకపోతే మధ్యస్థంగా ఉండే సూప్‌లు తాగాలి లేదా రోటీ తినాలి.

ఎలర్జీ ఉన్న వాళ్లకు మందుల కంటే ముఖ్యంగా వ్యక్తిగత జాగ్రత్తలే కీలకం. కాబట్టి ఎలర్జీకి గురై జలుబు, దగ్గుతో వైద్యుల దగ్గరికి వెళ్లేబదులు, ఈ ముందు జాగ్రత్తలు పాటిస్తే ఎలర్జీ లక్షణాలు దరి చేరకుండా ఉంటాయి.

- **వీలైనంత త్వరగా మందులు:** అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే యాంటీ హిస్టమైన్ మందులు వాడితే అలర్జీ తగ్గిపోతుంది. అలాకాకుండా 'తగ్గుతుందిలే'! అనే ఉద్దేశంతో రోజుల తరబడి నిర్లక్ష్యం చేస్తే లక్షణాల ఉధృతి పెరిగి దైనందిన జీవితం ఇబ్బందికరంగా మారుతుంది. ఎలర్జీ ఉన్నవాళ్లు వైద్యులు సూచించిన యాంటీ హిస్టమైన్ మందులను ఎప్పుడూ దగ్గరుంచుకోవాలి. చలి కాలం మొత్తం వైద్యులు సూచించిన మోతాదు మేరకు ప్రతిరోజూ వాడాల్సిన అవసరం కూడా ఉండొచ్చు.

అలర్జీ చికిత్స సులువే!

- **నాసల్ స్ప్రే:** అలర్జీ రకాన్ని బట్టి చికిత్స ఉంటుంది. ఎలర్జిక్ రైనైటిస్ ఉన్నవాళ్లకు 'నాసల్ స్ప్రే'తో ఉపశమనం ఉంటుంది. స్టిరాయిడ్ ఉండే ఈ నేసల్ స్ప్రేలు సురక్షితం. వీటిని ముక్కులో స్ప్రే చేసుకుంటే ముక్కు దిబ్బడ వదిలి, ముక్కు నుంచి నీరు కారటం కూడా తగ్గుతుంది. అలర్జీ ఎక్కువ ఉన్నవాళ్లు చలికాలం మొత్తం ఈ స్ప్రే వాడాల్సి ఉంటుంది.
- **ఇన్‌హేలర్స్:** అలర్జిక్ బ్రాంకైటిస్ ఉన్నవాళ్లకు ఇన్‌హేలర్స్ సమర్థంగా పని చేస్తాయి. వీళ్లు కూడా ఇన్‌హేలర్స్‌ను సీజన్ మొత్తం తీసుకోవాలి.
- **యాంటీ హిస్టమైన్లు:** లారింగ్జయిటిస్ ఉన్నవాళ్లకు యాంటీ హిస్టమైన్ టాబ్లెట్లు ఉపశమనాన్ని అందిస్తాయి. అలర్జీ వచ్చిన తర్వాత కాకుండా ముందే వీటిని వాడటం మొదలుపెడితే మంచిది.


ఒకవేళ అలర్జీ వచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే మందులు వాడటం మొదలుపెట్టినా లక్షణాలు తగ్గుముఖం పడతాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

- చలికాలంలో ఉదయం వేళ కాకుండా పొగమంచు వీడి, ఎండ వచ్చిన తర్వాతే వాకింగ్‌కు వెళ్లాలి. లేదా సాయంత్రాలు వాకింగ్ చేయొచ్చు.
- ఇంట్లో ఉన్నా పాదాలకు చెప్పులు లేకుండా నడవకూడదు.
- గోరువెచ్చని నీళ్లు తాగటం అలవాటు చేసుకోవాలి.
- స్నానం చేస్తే అలర్జీ ఎక్కువవుతుంటే ఒంటిని సబ్బు నీళ్లలో ముంచిన స్పాంజితో తుడుచుకుని శుభ్రం చేసుకోవాలి.
- సూప్‌లు, జావ, టీ తాగితే ఉపశమనంగా ఉంటుంది.
- ధూమపానం మానేయాలి.
- అలర్జీ వస్తుందని అనిపించగానే వచ్చేదాకా ఆగకుండా మందులు మొదలుపెట్టాలి.
- ముక్కు, నోరు, చెవుల్లోకి చల్లని గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



పైల్స్



మొలలకు సమర్థ వైద్యం

మొలల సమస్య సర్వసాధారణమైపోయింది. అయితే ఈ సమస్యకు నూతన చికిత్సలు అందుబాటులో కొచ్చాయి. కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా సమస్యను సరిదిద్దుకోవాలి.

అస్తవ్యస్త ఆహార, జీవనశైలుల ఫలితంగా వయసుతో సంబంధం లేకుండా మొలల సమస్య ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. కొందరికి ఈ సమస్య వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. హెమరాయిడ్స్ అనే ఈ పైల్స్ కొందరిలో బయటకు కనిపిస్తూ ఉంటే, మరి కొందర్లో లోపలే ఉండిపోతాయి. మలద్వారం దగ్గర ఉండే ఆనల్ కుషన్స్‌నే పైల్స్ అంటారు. వీటి వల్ల మలద్వారానికి రక్షణ దక్కడంతో పాటు, లేకీజీ కాకుండా, మోషన్ పడిపోకుండా ఆనల్ కుషన్స్ పటుత్వాన్నిస్తాయి. వీటి మీద బలమైన ఒత్తిడి పడినప్పుడు, రక్తనాళం చిట్లి రక్తస్రావం జరగడం, నొప్పి లాంటి బాధలు మొదలవుతాయి. ఇలాంటప్పుడు పైల్స్ బయటకు రావచ్చు లేదంటే సాగిపోయి లోపలే ఉండిపోవచ్చు. మలద్వారం నుంచిం రక్తస్రావం జరగడం ఒక్కటే మొలలకు సంకేతం కాదు. ఫిషర్, పేగు కేన్సర్‌లో కూడా ఇవే లక్షణాలు ఉంటాయి.

మొలల లక్షణాలు

- మలవిసర్జన సమయంలో నొప్పి, రక్తస్రావం
- మలద్వారం దగ్గర దురద
- ఆసన ప్రదేశంలో నొప్పి, అసౌకర్యం
- మలద్వారం దగ్గర పుండ్లు తలెత్తడం
- ఆసన వాపు

పైల్స్‌తో తలెత్తే సమస్యలు

- **రక్తస్రావం:** మలవిసర్జన సమయంలో లేదా తర్వాత కనిపిస్తుంది
- **రక్తహీనత:** రక్తస్రావంతో రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉంటుంది
- **ప్రొలాప్స్:** కొన్ని సందర్భాల్లో మొలలు పెద్దవిగా మారి మలద్వారం నుంచి బయటకు వచ్చేస్తాయి. ఈ ప్రొలాప్స్ విపరీతమైన నొప్పిని కలుగజేస్తాయి. రక్తస్రావం కూడా జరుగుతుంది.
- **ఇన్‌ఫెక్షన్:** పైల్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు, నొప్పి, వాపు ఉంటుంది. ఇలాంటి పైల్స్‌ను థ్రాంబోస్‌డ్ పైల్స్ అంటారు. ఈ సమస్యకు తక్షణ చికిత్స అవసరం.

> పైల్స్ సమస్యను లేజర్ సర్జరీలతో పరిష్కరించుకోవచ్చు. అయితే ఈ సర్జరీతో ఆశించినంత ఫలితం దక్కాలంటే లేజర్ సర్జరీతో పాటు హైబ్రిడ్ పద్ధతులైన డాప్లర్ గైడెడ్ హెమరోహైడల్ ఆర్టరీ లిగేషన్, స్టాప్లర్, స్క్లీరోథెరపీ, స్క్లెరోసెంట్ ఇంజెక్షన్ లాంటివి కూడా అవసరం.


నిర్థారణ ఇలా...

బాహ్య పైల్స్‌ను భౌతికంగా పరీక్షించి నిర్ధారించవచ్చు. అంతర్గత పైల్స్‌ను వేళ్లతో పరీక్షించి నిర్ధారించవలసి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మలద్వారంలోకి అనోస్కోప్/ప్రోక్టోస్కోప్/సిగ్మాయిడోస్కోప్ పరీక్షలు అవసరమవుతాయి.

తక్కువ నొప్పితో...

ఆనల్ కుషన్స్ మలద్వార పటుత్వానికి అత్యవసరం. కాబట్టి పూర్వంలా వాటిని తొలగించకుండా, పైల్స్‌కు సర్జరీ చేసే విధానాన్ని నేడు అందుబాటులోకొచ్చింది. దారాలు, నాటు వైద్యాలతో ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం ఎక్కువ. కాబట్టి వాటికి బదులుగా ఆధునిక చికిత్సలను ఆశ్రయించడమే ఉత్తమం. ప్రస్తుతం పైల్స్ సమస్యను లేజర్ సర్జరీలతో పరిష్కరించుకోవచ్చు. అయితే ఈ సర్జరీతో ఆశించినంత ఫలితం దక్కాలంటే లేజర్ సర్జరీతో పాటు హైబ్రిడ్ పద్ధతులైన డాప్లర్ గైడెడ్ హెమరోహైడల్ ఆర్టరీ లిగేషన్, స్టాప్లర్, స్క్లీరోథెరపీ, స్క్లెరోసెంట్ ఇంజెక్షన్ లాంటివి కూడా అవసరం. వీటితో మంచి ఫలితాలను సాధించవచ్చు. ఈ చికిత్సలతో నొప్పి, ఆస్పత్రిలో గడిపే సమయం తక్కువ. సర్జరీ అయిన ఒక్కరోజులోనే డిశ్చార్జ్ అయిపోవచ్చు. 3 నుంచి 4 రోజుల్లో అన్ని పనులూ చేసుకోవచ్చు. మలవిసర్జన సమయంలో నొప్పి, రక్తస్రావం సమస్యలు ఉన్నవాళ్లు వెంటనే జనరల్ సర్జన్ లేదా ప్రొక్టాలజిస్టులను కలవాలి. మరీ ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన వాళ్లు ఈ సమస్య కనిపించినప్పుడు కొలనోస్కోపీ చేయించుకోవడం తప్పనిసరి.

డాక్టర్ శాంతి వర్ధని
సీనియర్ జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్,యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



వింటర్ బ్లూస్

బరువు పెంచే కాలం

చలికాలం అందరం ఎంతోకొంత బరువు పెరుగుతాం. అందుకు వేర్వేరు కారణాలున్నాయి. అవేంటో తెలుసుకుని వాటికి చెక్ చెబుదాం!

చలికాలంలో ఎంతోమంది సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (ఎస్ఎడి)కి గురవుతూ ఉంటారు. ఇదొకరకమైన డిప్రెషన్ లాంటిది. ఈ సమస్య తలెత్తకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటంటే...

- **ఇన్‌సోమ్నియా:** మిగతా కాలాల్లో వేధించే నిద్రలేమి సమస్య చలికాలంలో తగ్గుముఖం పడుతుంది. దాంతో అవసరానికి మించి నిద్రపోతాం. ఉదయాన్నే లేవడానికి బద్ధకిస్తూ ఉంటాం. ఫలితంగా చురుకుదనం తగ్గుతుంది. దాంతో శరీరం బరువు పెరుగుతుంది.
- **కంఫర్ట్ ఫుడ్:** వెచ్చదనం కోసం మందపాటి దుస్తులు వేసుకున్నట్టే, జిహ్వాచాపల్యాన్ని తీర్చుకోవడం కోసం ఈ కాలంలో రకరకాల పదార్థాల మీదకు మనసు మళ్లుతూ ఉంటుంది. తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది కాబట్టి ఈ కాలంలో తినాలనే కోరిక పెరుగుతూ ఉంటుంది. కాబట్టి చలికాలం ఈ కోరికను అదుపు చేసుకోవాలి.
- **చక్కెర తంటా:** దీపావళి, క్రిస్మస్ లాంటి పండుగలతో తీపి పదార్థాలను ఎక్కువగా తినేస్తాం. కాబట్టి చలికాలంలో బరువు పెరిగే సమస్య ఎక్కువే! ఈ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.
- **మెటబాలిజం:** మెటబాలిజం పెరిగితే సన్నబడాలి. కానీ ఈ కాలంలో ఒంటిని వెచ్చగా ఉంచడం కోసం మెటబాలిజం పెరుగుతుంది. అదే సమయంలో ఆకలి కూడా పెరుగుతుంది. కాబట్టి తినాలనే కోరికను అదుపులో ఉంచుకోవాలి.
- **అలవాట్లు:** క్రమం తప్పకుండా చేసే వ్యాయామాల్లో కోత పడడం, ఎక్కువ సమయాల పాటు ఇంటికే పరిమితమైపోవడం ఈ కాలంలో సహజం. కానీ బద్ధకాన్ని వదిలేసి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి. శరీరాన్ని వీలైనంత చురుగ్గా ఉంచగలిగితే చలికాలం బరువు పెరిగే సమస్య దరి చేరకుండా ఉంటుంది.





ప్యాకేజ్డ్ వస్తువులపై తయారీ తేదీ

ముద్రణ తప్పనిసరి

» యూనిట్ అమ్మకం ధర కూడా..

న్యూఢిల్లీ: ప్యాక్ చేసిన ఆహారోత్పత్తులపై 2024 జనవరి 1 నుంచి వస్తువు తయారీ తేదీతో పాటు యూనిట్ ధర ముద్రించడం తప్పనిసరి అని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. తద్వారా వినియోగదారులకు తాము కొనుగోలు చేయబోయే వస్తువు తయారైన తేదీ, యూనిట్ (గ్రాము లేదా కేజీ) ఖరీదుపై స్పష్టత లభిస్తుందన్నా రు. ఉదాహరణకు, 2.5 కేజీల పిండి ప్యాకెట్‌పై గరిష్ఠ చిల్లర ధరతోపాటు కేజీ ఖరీదును కూడా ముద్రించాల్సి ఉంటుంది. కేజీలోపు ప్యాకెట్‌పై ఒక్కో గ్రాము ఖరీదును ముద్రించాల్సి ఉంటుంది.

యూపీఐ సేవల్లో పలు మార్పులు

ఈ జనవరి 1 నుంచి యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవల్లో ఆర్‌బీఐ పలు మార్పులు తీసుకొచ్చింది. ఆ వివరాలు..

1 యూపీఐ ద్వారా రోజువారీ గరిష్ఠ చెల్లింపుల పరిమితి రూ.లక్షకు పెంపు. ఆసుపత్రులు లేదా విద్యా సంస్థలకు చెల్లించే పరిమితిని మాత్రం ఆర్‌బీఐ రూ.5 లక్షలకు పెంచింది.

1 ఇకపై యూపీఐ యాప్‌ల ద్వారా ఎవరికైనా చెల్లింపులు జరిపేటప్పుడు, ఆ వ్యక్తి బ్యాంక్ అకౌంట్ పేరు కూడా మీ స్ర్కీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. చెల్లింపుల్లో పొరపాట్లను నివారించేందుకు ఈ సౌకర్యం దోహదపడుతుంది.

1 జపాన్ కంపెనీ హిటాచీ భాగస్వామ్యంలో ఆర్‌బీఐ దేశవ్యాప్తంగా యూపీఐ ఏటీఎంలను ఏర్పాటు చేయనుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఈ ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది.

1 గడిచిన ఏడాది కాలంగా వినియోగించని యూపీఐ ఐడీలను 2023 డిసెంబరు 31 న డీయాక్టివేట్ చేయాలని పేమెంట్ యాప్స్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది.

1 యూపీఐ వాలెట్స్ లేదా ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) ద్వారా రూ.2,000కు పైగా చెల్లింపులపై 1.1 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

ఎగుమతులపై మిథానీ దృష్టి

» జీఈ ఏరోస్పేస్ వంటి కంపెనీలతో చర్చలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మిశ్రధాతు నిగమ్ (మిధానీ) ఎగుమతులపై దృష్టి కేంద్రీకరించాలని భావిస్తోంది. మిధానీ మెటీరియల్స్ కోసం అంతర్జాతీయ ఏరోస్పేస్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని కంపెనీ వెల్లడించింది. 2023 అక్టోబరు ఒకటి నాటికి కంపెనీ చేతిలో మొత్తం రూ.1,501 కోట్ల విలువైన ఆర్డర్లున్నాయి. ఇవి పూర్తి చేయడానికి ఏడాదిన్నర వరకూ పడుతుందని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు రూ.100 కోట్లకు చేరగలవని కంపెనీ ఆశావహంగా ఉంది. రోల్స్ రాయిస్, జీఈ ఏరోస్పేస్ నుంచి ఆర్డర్లు లభించాయని కంపెనీ వెల్లడించింది. దేశంలో టైటానియం అల్లాయిస్‌ను తయారు చేస్తున్న ఒకే ఒక కంపెనీ మిధానీ. ఏడాదికి 500 టన్నుల టైటానియం అల్లాయిస్‌ను ఉత్పత్తి చేసే టైటానియం యూనిట్ వచ్చే రెండేళ్లలో అందుబాటులోకి రానుందని మిధానీ పేర్కొంది. దీంతోపాటు వైడ్ ప్లేట్ మిల్స్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోనుంది.

జీఎస్‌టీ వసూళ్లు

రూ.1.64 లక్షల కోట్లు

గతనెలలో 10% వృద్ధి నమోదు

ఏపీ వసూళ్లు రూ.3,545 కోట్లు..

తెలంగాణలో రూ.4,753 కోట్లు



న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరులో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు రూ.1.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022 డిసెంబరులో గడించిన రూ.1.49 లక్షల కోట్ల స్థూల ఆదాయంతో పోలిస్తే 10 శాతం వృద్ధి నమోదైంది. కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గతనెలకు జీఎస్‌టీ వసూళ్లు రూ.1,64,882 కోట్లుగా ఉన్నాయి. అందులో సెంట్రల్ జీఎస్‌టీ రూ.30,443 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.37,935 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.84,225 కోట్లుగా ఉంది. సెస్సు రూపంలో మరో రూ.12,249 కోట్లు వసూలయ్యాయి. రెగ్యులర్ సెటిల్‌మెంట్‌లో భాగంగా ఐజీఎస్‌టీ ఆదాయంలో రూ.40,057 కోట్లను సీజీఎస్‌టీలో, రూ.33,652 కోట్లు ఎస్‌జీఎస్‌టీలో జమచేసింది. అనంతరం సీజీఎస్‌టీ రూ.70,501 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ.71,587 కోట్లకు చేరుకున్నాయి. కాగా, గతనెల ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధి చెంది రూ.3,545 కోట్లకు చేరుకోగా.. తెలంగాణలో ఆదాయం 14 శాతం వృద్ధితో రూ.4,753 కోట్లకు పెరిగాయి.

9 నెలల ఆదాయం రూ.14.97 లక్షల కోట్లు

2023-24 ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 నెలల కాలానికి జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.14.97 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వసూళ్లు రూ.13.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంతేకాదు, గడిచిన 9 నెలలకు సరాసరి నెలవారీ ఆదాయం రూ.1.66 లక్షల కోట్లకు పెరిగింది. అంతక్రితం ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన నెలవారీ సగటు రూ.1.49 లక్షల కోట్లతో పోలిస్తే 12 శాతం అధికమిది. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరంలో మే, ఆగస్టు వినహా మిగతా ఏడు నెలల్లో జీఎస్‌టీ ఆదాయం రూ.1.60 లక్షల కోట్లను మించి నమోదుకావడం గమనార్హం.

ఎల్ఐసీకి రూ.806 కోట్ల జీఎస్‌టీ డిమాండ్ నోటీసు

మహారాష్ట్ర పరోక్ష పన్నుల విభాగం తమ కంపెనీకి రూ.806.3 కోట్ల జీఎస్‌టీ డిమాండ్ నోటీసు జారీ చేసిందని ఎల్ఐసీ సోమవారం వెల్లడించింది. అందులో రూ.365.02 కోట్ల జీఎస్‌టీ, రూ.404.7 కోట్ల పెనాల్టీతో పాటు రూ.36.5 కోట్ల వడ్డీ కలిపి చెల్లించాలని ఆదేశించినట్లు కంపెనీ పేర్కొంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మిస్‌మ్యాచ్‌కు సంబంధించిన ఈ నోటీసును ట్రిబ్యునల్‌లో సవాలు చేయనున్నట్లు తెలిపింది. ఈ ఆదేశాలతో కంపెనీ కార్యకలాపాలు లేదా ఆర్థిక పరమైన ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.

ఏషియన్ పెయింట్స్‌కు రూ.13.83 కోట్ల నోటీసు

చెన్నైకి చెందిన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ తమ కంపెనీకి రూ.13.83 కోట్ల జీఎస్‌టీ డిమాండ్ నోటీసుతో పాటు రూ.1.38 కోట్ల పెనాల్టీ నోటీసు జారీ చేసిందని ఏషియన్ పెయింట్స్ సోమవారం వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం రిటర్నుల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మిస్‌మ్యాచ్‌కు సంబంధించి ఈ నోటీసులు జారీ అయినట్లు కంపెనీ స్పష్టం చేసింది. అయితే, ఈ ఉత్తర్వులను ట్రిబ్యునల్‌లో సవాలు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది.

పీఎస్‌పీసీఎల్ చేతికి జీవీకే పవర్ ప్లాంట్

» అతి తక్కువ ధరకు సొంతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన 540 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్, గోయింద్వాల్ సాహెబ్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎస్‌పీసీఎల్) సొంతం చేసుకుంది. రూ.1,080 కోట్లకు ప్లాంట్‌ను కొనుగోలు చేసింది. దీని ప్రకారం ఒక్కో మెగా వాట్‌ను రూ.2 కోట్లకు సొంతం చేసుకున్నట్లవుతుంది. ఇంతవరకూ ఇంత తక్కువ ధరకు ఒక మెగావాట్ సామర్థ్యాన్ని ఏ కంపెనీ, ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. గతంలో కొన్ని కంపెనీలు మెగావాట్‌కు రూ.3 కోట్లు చెల్లించాయి. ఒక రాష్ట్ర పవర్ కార్పొరేషన్ ఈ విధంగా అప్పుల్లో కూరుకుపోయిన ఒక పవర్ ప్లాంట్‌ను కొనుగోలు చేయడం కూడా ఇదే ప్రథమం. ఈ ప్లాంట్‌లో 270 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లున్నాయి. కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ ప్రక్రియలో భాగంగా ఈ ప్లాంట్‌ను విక్రయించడానికి ఎన్‌సీఎల్‌టీ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ బిడ్లను ఆహ్వానించగా 2023 జులైలో పీఎస్‌పీసీఎల్ ఏకైక బిడ్డర్‌గా ఎంపిక అయింది.

విశాఖ ఉక్కు విక్రయాలు 16,766 కోట్లు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు (ఆర్ఐఎన్ఎల్) డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి రూ.16,766 కోట్ల ఉత్పత్తులు విక్రయించిందని సీఎండీ అతుల్ భట్ వెల్లడించారు. ఉద్యోగులు, కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ కొత్త సంవత్సరానికి 'టర్న్ ఎరౌండ్ ఇయర్'గా గుర్తింపు తెస్తామని, అంతా సహకరించాలని కోరారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,870 ▼	58,550 ▼	80,000 ▲
ముంబై	63,350 ▲	58,030 ▲	73,705 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ			
హైదరాబాద్	579	విజయవాడ	585
2 జనవరి		విశాఖపట్నం	625
చిత్తూరు	608	వరంగల్	581
గోదావరి	585	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	గోదావరి	114
వరంగల్	112	విజయవాడ	114
కరీంనగర్	112	గుంటూరు	110
మహబూబ్‌నగర్	112	ఒంగోలు	110
కర్నూలు	112	చిత్తూరు	115
విశాఖపట్నం	109		

మార్కెట్‌లో జర జాగ్రత్త

» కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ర్యాలీపై హెచ్చరికలు వినిపిస్తున్నాయి. నిఫ్టీ 20 శాతం అధిక విలువతో ట్రేడవుతున్నందున జాగ్రత్తగా ఉండాలని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ త్రైమాసిక నివేదికలో హెచ్చరించింది. వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో ఎప్పుడైనా మార్కెట్‌లో దిద్దుబాటు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఈ సంవత్సరం స్టాక్‌మార్కెట్‌లో పెద్దగా లాభాలు వచ్చే అవకాశం కూడా కనిపించడంలేదంది. ఒకవేళ కొన్ని షేర్లలో కొద్దిపాటి లాభాలున్నా, ఎక్కువ కంపెనీల షేర్లలో మాత్రం నష్టాలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది మార్కెట్ లాభాలు ఫండమెంటల్స్, సెంటిమెంట్ మధ్య జరిగే పోరాటంపై ఆధారపడి ఉంటాయని తెలిపింది.

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ బుకింగ్ అమ్మకాలతో సోమవారం ఫ్లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 31.68 పాయింట్ల లాభంతో 72,271.94 వద్ద, నిఫ్టీ 10.5 పాయింట్ల లాభంతో 21,741.90 వద్ద ముగిశాయి. మార్కెట్ ఫ్లాట్‌గా ముగిసినా, ఇంట్రా డేలో సెన్సెక్స్ 72,561.91 పాయింట్లు, నిఫ్టీ 21,834.35 పాయింట్లను తాకి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలను నమోదు చేశాయి. ఎనర్జీ, సర్వీసెస్, టెలికం షేర్లు సోమవారం చురుగ్గా ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఎలాంటి సంకేతాలు లేకపోవడం సోమవారం దేశీయ మార్కెట్లను నిరాశపరిచింది. ఈ వారం వెలువడే అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వు మినిట్స్ కోసం మార్కెట్ ఆతృతతో ఎదురు చూస్తోంది.

వాహన విక్రయాల్లో రికార్డు

2023లో 41.08 లక్షల యూనిట్ల సేల్స్.. సగం వాటా ఎస్‌యూవీలదే

న్యూఢిల్లీ: ప్రయాణికుల వాహనాల (పీవీ) టోకు విక్రయాలు 2023లో 8.3 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు స్థాయి 41.08 లక్షలకు చేరుకున్నాయి. అందులో దాదాపు సగం వాటా ఎస్‌యూవీలదే. 2022లో రూ.10.58 లక్షలుగా ఉన్న వాహన సగటు ధర గత సంవత్సరంలో రూ.11.5 లక్షలకు పెరిగినప్పటికీ, రికార్డు స్థాయిలో అమ్మకాలు జరగడం మరో విశేషం. మార్కెట్ అగ్రగామి మారుతి సుజు కీతో పాటు హ్యుండయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్ 2023లో తమ అత్యుత్తమ వార్షిక విక్రయాలను నమోదు చేసుకున్నాయి. దేశంలోపీవీ వార్షిక విక్రయాలు 40 లక్షల యూనిట్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి అని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ అన్నారు. 2022లో పీవీ టోకు అమ్మకాలు 37.92 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. కాగా, 2022కిగాను మొత్తం పీవీ సేల్స్‌లో 42 శాతంగా నమోదైన ఎస్‌యూవీల వాటా 2023లో 48.7 శాతానికి పెరిగిందని శ్రీవాస్తవ తెలిపారు. ముున్ముందు ఎస్‌యూవీల వాటా 50-55 శాతానికి పెరగవచ్చన్నారు.

ఆటో పీఎల్ఐ పొడిగింపు

ఆటోమొబైల్, ఆటో విడిభాగాల పరిశ్రమకు అందిస్తున్న ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) గడువు "పాక్షిక సవరణ"లతో మరో ఏడాది పొడిగిస్తున్నట్టు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

మారుతిదే సగం వాటా..

గత సంవత్సరంలో మారుతి సుజుకీ విక్రయాలు 20 లక్షల యూనిట్ల మైలురాయిని దాటాయి. అంటే పరిశ్రమ మొత్తం విక్రయాల్లో సగం మారుతివే. అంతేకాదు, గత ఏడాది కంపెనీ ఆల్‌టైం రికార్డు స్థాయిలో 2,69,046 యూనిట్ల కార్లను ఎగుమతి చేసింది. గ్రామీణ మార్కెట్లలో 7.76 లక్షల యూనిట్ల విక్రయాలు, ప్రీ-ఓన్డ్ కార్ల సేల్స్ 4.6 లక్షల యూనిట్లు కూడా కంపెనీ చరిత్రలోనే అత్యధికమని శ్రీవాస్తవ వెల్లడించారు. ఇతర కంపెనీల విక్రయాలిలా ఉన్నాయి.

1 హ్యుండయ్ మోటార్ ఇండియా గత ఏడాది 9 శాతం వృద్ధితో 7,65,786 వాహనాలను విక్రయించింది. అంతేకాదు, కంపెనీ దేశీయ విక్రయాలు కూడా తొలిసారిగా 6 లక్షల యూనిట్ల మార్క్‌ను దాటాయి.

1 టాటా మోటార్స్ కూడా ఆల్‌టైం రికార్డు స్థాయిలో 5.53 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది. 2022తో పోలిస్తే 2023లో టయోటా కార్ల అమ్మకాలు ఏకంగా 46 శాతం వృద్ధితో 2,33,346 యూనిట్లకు చేరుకున్నాయి.



ఓదార్పు విజయం దక్కేనా?

● భారత్-ఆసీస్ మూడో వన్డే నేడు

● హర్మన్‌పైనే అందరి దృష్టి

మ. 1.30 నుంచి జియో సినిమా, టీవీ18లో..



ఆసీస్ సారథి హీలీ

ముంబై: రెండు వరుస పరాజయాలతో వన్డే సిరీస్‌ను చేజార్చుకొన్న భారత మహిళల జట్టు.. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకొంటోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-2తో వెనుకంజలో ఉన్న టీమిండియా.. మంగళవారం జరిగే మూడో, ఆఖరి వన్డేలో ఆస్ట్రేలియాను ఓడించి పరువు కాపాడుకోవాలనుకొంటోంది. అయితే, మన బ్యాటింగ్‌కు వెన్నెముక అయిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేలవ ఫామ్ జట్టు విజయాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ క్రమంలో స్వదేశంలో ఆసీస్ చేతిలో ఎదురైన తొమ్మిది వరుస ఓటములకు బ్రేక్ వేయాలంటే కౌర్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాల్సిన అవసరం ఎంతో ఉంది. తొలి వన్డేలో భారీ స్కోరు చేసినా.. ప్రత్యర్థిని టీమిండియా బౌలర్లు సమర్థంగా అడ్డుకోలేక పోయారు. రెండో వన్డేలో రిచా ఘోష్ (96) పోరాటంతో విజయం ముంగిట నిలిచినా.. అమన్‌జోత్, దీప్తి శర్మ మ్యాచ్‌ను ముగించలేక పోయారు. ఈ మ్యాచ్‌లో హర్మన్ సేన ఏకంగా ఏడు క్యాచ్‌లు చేజార్చడం భారత ఫీల్డింగ్ ఎంత నాసిరకంగా ఉందో చెప్పకనే చెబుతోంది. అయితే, కంకషన్‌కు గురైన స్పిన్నర్ స్నేహ్ రాణా ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటుందని టీమిండియా కోచ్ అమోల్ మజుందార్ చెప్పాడు. మరోవైపు ఏకైక టెస్టులో ఓడినా.. వన్డే సిరీస్‌ను ఈపాటికే దక్కించుకొన్న ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. కెప్టెన్ అలిస్సా హీలీ విఫలమవుతున్నా.. లిచ్‌ఫీల్డ్, పెర్రీ, మెక్‌గ్రాత్ అండతో మెరుగైన స్కోర్లు చేస్తోంది. బౌలింగ్‌లో వేర్హమ్, కిమ్ గార్త్, సదర్లాండ్ రాణిస్తున్నారు.

జట్లు (అంచనా)

భారత్: యాస్తిక భాటియా, స్మృతీ మంధాన, రిచా, జెమీమా, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), దీప్తి, అమన్‌జోత్, పూజా వస్త్రాకర్, రాణా, శ్రేయాంక, రేణుక.

ఆస్ట్రేలియా: లిచ్‌ఫీల్డ్, హీలీ (కెప్టెన్), పెర్రీ, బెత్ మూనీ, తహిల, గార్డ్‌నర్, సదర్లాండ్, వేర్హమ్, అలన్ కింగ్, గార్త్, బ్రౌన్.

సౌతాఫ్రికా నిర్ణయం టెస్ట్‌లకు మరణ శాసనం

సిడ్నీ: టెస్ట్ క్రికెట్‌ను చిన్నచూపు చూస్తున్న క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ)పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా విరుచుకుపడ్డాడు. ఈ నెల 10 నుంచి జరుగనున్న సౌతాఫ్రికా టీ20 లీగ్‌కు ప్రాధాన్యమిస్తూ..న్యూజిలాండ్‌తో జరిగే రెండు టెస్ట్‌లకు ద్వితీయ శ్రేణి జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అరంగేట్రం కూడా చేయని నీల్ బ్రాండ్‌ను కెప్టెన్‌గా నియమించడంతో పాటు మొత్తం ఏడుగురు కొత్త ఆటగాళ్లను జట్టులో చేర్చారు. సీఎస్ఏ నిర్ణయం..టెస్ట్ క్రికెట్‌కు మరణ శాసనం లిఖించేలా కనిపిస్తోందన్నాడు. గౌరవం ఇవ్వనపుడు ఆ జట్టుతో ఎందుకు ఆడాలని న్యూజిలాండ్‌ను ప్రశ్నించాడు.



వన్డేలకూ వీడ్కోలు

టీ20లకే పరిమితం



డేవిడ్ వార్నర్

సిడ్నీ: ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ నూతన సంవత్సరం తొలి రోజున మరో సంచలన నిర్ణయం ప్రకటించాడు. టెస్టుల మాదిరే ఇక వన్డే ఫార్మాట్‌కు కూడా వీడ్కోలు చెబుతున్నట్టు 37 ఏళ్ల ఈ స్టార్ బ్యాటర్ సోమవారం వెల్లడించాడు. అయితే అంతర్జాతీయ టీ20ల్లో మాత్రం కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది వన్డే వరల్డ్‌కప్‌లో అద్భుతంగా రాణించిన వార్నర్.. జట్టును చాంపియన్‌గా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో రెండు శతకాలు, రెండు హాఫ్ సెంచరీలతో 528 పరుగులు సాధించాడు. కొత్తవారికి అవకాశమిచ్చేలా ఈ ఫార్మాట్‌కు ముగింపు పలికేందుకు ఇదే సరైన సమయమని తెలిపాడు. అలాగే ఈ రిటైర్మెంట్‌తో ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో పాల్గొనేందుకు తగిన సమయం కూడా లభిస్తుందని భావిస్తున్నాడు. పాక్‌తో బుధవారం నుంచి జరిగే మూడో టెస్టు అనంతరం వార్నర్ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్న విషయం తెలిసిందే. 2009లో వన్డేల్లో అరంగేట్రం చేసిన డేవిడ్ 161 మ్యాచ్‌ల్లో 45.30 సగటుతో 6,932 రన్స్ సాధించగా, ఇందులో 22 శతకాలున్నాయి. వన్డేల్లో అత్యధిక శతకాలు చేసిన పాంటింగ్ (29) తర్వాత వార్నర్ రెండో స్థానంలో ఉన్నాడు. ఒకవేళ 2025లో జరిగే వన్డే చాంపియన్స్ ట్రోఫీలో జట్టుకు అవసరమైతే రీఎంట్రీ ఇస్తానని వార్నర్ చెప్పడం గమనార్హం. కానీ ఇందుకు ఫిట్‌నెస్ కూడా సహకరించాల్సి ఉంటుందని తేల్చాడు.

సంజయ్ సింగ్ ధిక్కార స్వరం

» అడ్‌హాక్ ప్యానెల్‌ను గుర్తించం

» జాతీయ పోటీలను నిర్వహిస్తాం



న్యూఢిల్లీ : బ్రిజ్‌భూషణ్ సింగ్ స్థానంలో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా ఎన్నికైన అతడి అనుచరుడు సంజయ్ సింగ్ ధిక్కార స్వరం వినిపించాడు. తమ కార్యవర్గం సస్పెన్షన్‌పై కోర్టుకు వెళతామని ఇప్పటికే బెదిరించిన సంజయ్ సింగ్ ఇప్పుడు క్రీడా శాఖపై ఎదురుదాడికి దిగాడు. జాతీయ పోటీలు నిర్వహించాలన్న అడ్‌హాక్ ప్యానెల్ నిర్ణయంపై స్పందిస్తూ..ఆ ప్యానెల్‌ను తాము గుర్తించడం లేదన్నాడు. తాము ప్రకటించిన మేరకే జాతీయ పోటీలు నిర్వహిస్తామన్నాడు. 'సస్పెన్షన్‌ను మేం గుర్తించడంలేదు. మా విధుల్లో మేం ఉన్నాం' అని సంజయ్ చెప్పాడు. త్వరలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నాం. ఈమేరకు ఒకటి రెండు రోజుల్లో రాష్ట్ర సంఘాలకు నోటీసు పంపుతాం. అడ్‌హాక్ ప్యానెల్ కంటే ముందే మేం జాతీయ పోటీలు నిర్వహిస్తాం' అని సంజయ్ సింగ్ తెలిపాడు.

మరోవైపు వచ్చేనెల రెండు నుంచి ఐదు వరకు జైపూర్‌లో జాతీయ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్టు అడ్‌హాక్ ప్యానెల్ వెల్లడించింది. అలాగే పురుషులు, మహిళల జాతీయ రెజ్లింగ్ శిబిరాల తేదీలను అడ్‌హాక్ ప్యానెల్ ప్రకటించింది. ఫిబ్రవరి తొమ్మిది నుంచి పురుషులకు సొనెపట్‌లో, మహిళలకు పటియాలలో ఈ శిబిరాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

ఒక్క దుర్దినం.. ఎంతో బాధాకరం!

మాజీ క్రికెటర్ గవాస్కర్

న్యూఢిల్లీ: గడచిన ఏడాది భారత క్రికెట్ జట్లు అద్భుత ఆటతీరు కనబరచాయని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ విశ్లేషించాడు. 2023ను పురుషులు, మహిళల జట్లు ఓటములతో ముగించినా.. మొత్తంమీద చిరస్మరణీయ విజయాలనే నమోదు చేశాయి. 'వరల్డ్‌కప్‌లో రోహిత్ సేన వరుసగా 10 మ్యాచ్‌లు నెగ్గినా.. ఒక దుర్దినం అదీ ఫైనల్ రోజు కావడం బాధాకరమ'ని సన్నీ అన్నాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాపై మహిళల జట్టు సాధించిన చారిత్రక టెస్టు విజయాలను కొనియాడాడు.

విరాట్ ప్రాక్టీస్.. ప్రాక్టీస్



కోచ్ ద్రవిడ్‌తో కోహ్లీ

కేప్‌టౌన్: రెండో టెస్టు కోసం స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ముమ్మర ప్రాక్టీస్ కొనసాగిస్తున్నాడు. న్యూ ఇయర్ రోజునూ వదలకుండా నెట్స్‌లో గంటపాటు చెమటోడ్చాడు. ఆరంభంలో సెంట్రల్ నెట్స్‌లో బౌలర్లను ఎదుర్కోగా, తర్వాత అవుట్ సైడ్ నెట్స్‌లో అర్ధగంట పాటు వేగంగా వచ్చే త్రోడౌన్స్‌ను ఆడాడు. ముఖ్యంగా లెఫ్టామ్ పేసర్ బౌలింగ్‌లో ఎక్కువ సేపు బ్యాటింగ్ సాధన చేశాడు. భారత జట్టులో ఇలాంటి బౌలర్ లేకపోవడంతో స్థానిక బౌలర్ చేత బంతులను వేయించుకున్నాడు. దక్షిణాఫ్రికా ఎడమచేతి పేసర్ బర్గర్‌ను దృష్టిలో ఉంచుకునే తను ఈ ప్రాక్టీస్ సాగించాడు. ఇక శ్రేయాస్ షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే బలహీనత తొలి టెస్టులోనూ కనిపించింది. అలాగే నెట్స్‌లో త్రోడౌన్ స్పెషలిస్ట్ నువాన్ సెనెవిరత్నె వేసిన బంతులను కూడా సరిగా ఆడలేకపోయాడు. ఇందులో ఓ బంతిని పుల్ షాట్ ఆడేందుకు చూడగా, అది పొట్టను తాకడంతో కాసేపు ప్రాక్టీస్ కూడా ఆపాల్సి వచ్చింది.

మరో బౌన్సీ ట్రాక్ భయమేనా?: తొలి టెస్టులో చిత్తుగా ఓడిన టీమిండియా ఇప్పుడు రెండో టెస్టులో విజయం కోసం చూస్తోంది. కానీ పచ్చికతో కళకళలాడుతున్న ఇక్కడి పిచ్ కూడా పేసర్లకు అనుకూలించేలా ఉంది. దీంతో స్వింగ్, బౌన్స్‌తో బెంబేలెత్తించేందుకు ఆతిథ్య బౌలర్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అదే జరిగితే సెంచూరియన్ తరహాలోనే భారత బ్యాటర్లకు కష్టాలు ఎదురైనట్టే. అయితే చివరి రెండు రోజులు వికెట్ స్పిన్నర్లకు మద్దతుగా నిలిచే అవకాశముంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంటే మేలని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ స్టేడియంలో భారత్ ఆరు టెస్టులాడినా ఒక్కటీ గెలవలేదు. ఇందులో రెండు డ్రాగా ముగిశాయి.

షారుక్‌ను దాటేసిన కోహ్లీ

న్యూఢిల్లీ: ఆసియాలోనే అత్యధిక పాపులారిటీ కలిగిన వ్యక్తిగా టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. ప్రముఖ వెబ్‌సైట్ వికీపీడియా ప్రకారం.. గడిచిన ఏడాది (2023) ఆసియాలో అత్యధిక మంది విరాట్ గురించిన సమాచారం తెలుసుకోవడానికి తమ వెబ్‌సైట్‌ను సందర్శించినట్టు పేర్కొంది. కోహ్లీ పేజీని కోటీ 7 లక్షలమంది వీక్షించగా.. బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ గురించి 77 లక్షల మంది, నటి ప్రియాంక చోప్రా కోసం 65 లక్షల మంది వెతికినట్టు తెలిపింది.

డైపర్లు మార్చడంకన్నా టెన్నిస్ ఆడడం ఈజీ!



బ్రిస్బేన్ : బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీతో టెన్నిస్ పునరాగమనం చేసిన మాజీ నెంబర్ వన్ **నవోమి ఒసాక** (జపాన్) శుభారంభం అందుకుంది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో 6-3, 7-6 (9)తో తమార కోర్పాచ్‌పై ఆమె సునాయాసంగా గెలుపొందింది. నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ అయిన 26 ఏళ్ల ఒసాక..బిడ్డకు జన్మనివ్వడం కోసం 16 మాసాలు టెన్నిస్‌కు దూరంగా ఉంది. నిరుడు జూలైలో ఆమెకు కూతురు జన్మించింది. సుదీర్ఘ విరామం తర్వాత ఆడిన మొదటి మ్యాచ్ ఆసాంతం ఎంతో ఒత్తిడికి లోనైనట్టు ఒసాక చెప్పింది. టెన్నిస్ ఆడడం లేదా కూతుర్ని నిద్రపుచ్చడంలో ఏది సులువు అన్న ప్రశ్నకు 'షాయ్ (కూతురు)ని నిద్రపుచ్చాలంటే తల ప్రాణం తోకకు వస్తోంది. ఆమెకు తరచూ డైపర్లు మారుస్తూ ఉండాలి. అందువల్ల డైపర్లు మార్చడం కన్నా టెన్నిస్ మ్యాచ్ ఆడడమే ఈజీ' అని ఒసాక నవ్వుతూ బదులిచ్చింది.

తెలుగు టైటాన్స్ చెత్తాట

నోయిడా: వరుస పరాజయాల నుంచి పాఠాలు నేర్వని తెలుగు టైటాన్స్ ఆట రానురానూ మరింత చెత్తగా మారుతోంది. ప్రొ కబడ్డీ సీజన్-10లో 2023లో ఆడిన ఆఖరి మ్యాచ్‌ను ఓటమితో ముగించిన టైటాన్స్, కొత్త ఏడాదిని కూడా పరాజయంతోనే ప్రారంభించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 54-18తో తెలుగు టైటాన్స్‌ను చిత్తుగా ఓడించింది. ఈ సీజన్‌లో టైటాన్స్ ఎనిమిది మ్యాచ్‌లాడగా ఇది ఏడో ఓటమి. ఆట ప్రారంభం నుంచే టైటాన్స్‌పై పుణె స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ వచ్చింది. ఏ దశలోనూ టైటాన్స్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. టైటాన్స్ స్టార్ రైడర్లు పవన్, నితిన్ పన్వర్ ఘోరంగా విఫలమయ్యారు. ప్రత్యర్థి జట్టులో మోహిత్ 13 పాయింట్లతో సత్తాచాటగా, అతడికి అస్లమ్ (8) సహకారమందించాడు. ఈ గెలుపుతో పుణె పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. మరోమ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-41తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది.

రాజస్థాన్‌పై యోధాస్ గెలుపు



తెలుగు యోధాస్-రాజస్థాన్ మ్యాచ్ దృశ్యం

కటక్: అల్టిమేట్ ఖో-ఖో లీగ్ సీజన్-2లో తెలుగు యోధాస్ తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 34-27తో రాజస్థాన్ వారియర్స్‌పై నెగ్గి, కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించింది. ఆట ప్రథమార్ధంలో ఇరు జట్లు సమవుజ్జీలుగా నిలవగా, ద్వితీయార్ధంలో యోధాస్ పుంజుకోవడంతో రాజస్థాన్‌కు కష్టాలు మొదలయ్యాయి. అటాకర్ ప్రతీక్ (8 పాయింట్లు) తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ, కీలక సమయాల్లో పాయింట్లు సాధించడం యోధాస్‌కు లాభించింది. ఆట చివర్లో డిఫెండర్ ఆదిత్య 2 నిమిషాల 48 సెకన్ల పాటు ప్రత్యర్థులకు చిక్కకుండా యోధాస్‌ను విజయతీరాలకు చేర్చాడు. మరో మ్యాచ్‌లో చెన్నై క్విక్ గన్స్ 35-29తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.

షర్మిల రాకను కాంగ్రెస్ ఆహ్వానిస్తోంది

- కాంగ్రెస్‌తో టచ్‌లో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- 8,9 తేదీల్లో రాష్ట్రానికి రాహుల్ రాక: గిడుగు

అమలాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సోదరి షర్మిల కాంగ్రెస్‌లోకి రావడాన్ని పార్టీ అధిష్ఠానం స్వాగతిస్తోందని ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఆమె కాంగ్రెస్‌లోకి వచ్చే అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కీలక నేత రాహుల్‌గాంధీ ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని చెప్పారు. షర్మిలతోపాటు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులతోపాటు వైసీపీలోని కీలక నేతలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని తన స్వగృహంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని త్వరలో వంద రోజుల ప్రణాళికతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్తుందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో భాగంగా రాహుల్, ప్రియాంక త్వరలో రాష్ట్రానికి వస్తారని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ ఈ నెల 8,9 తేదీల్లో విజయవాడలో పర్యటిస్తారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కేడర్‌తో ఒకరోజు నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 687 మండలాలు, 23 జిల్లాల్లో కమిటీల నియామకాన్ని పూర్తి చేసినట్టు తెలిపారు. సీఎం జగన్ రాష్ట్రంలో చేస్తున్న అవినీతి, అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు సమావేశంలో పాల్గొన్నారు.

ఏపీపై మోదీ వివక్ష: మాణిక్కం ఠాగూర్

న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ పట్ల ప్రధాని మోదీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఏపీ ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్ ఆరోపించారు. మెట్రో రైలు ప్రాజెక్టుపై చూపుతున్న నిర్లక్ష్యమే ఇందుకు ఉదాహరణ అని ఆయన సోమవారం ఎక్స్‌లో విమర్శించారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో మోదీకి, ఆయన అనుకూల పార్టీలకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. జగన్, టీడీపీ, జనసేన పార్టీలు మోదీతో జత కట్టాయని ఆరోపించారు.

సామంతరాజులుగా ఎమ్మెల్యేలు

- జీవోలు దాచేస్తే పారదర్శకత ఎలా?: రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి



'బ్యూరోక్రసీ నాడు-నేడు' అనే అంశంపై మాట్లాడుతున్న చక్రపాణి

గుంటూరు, జనవరి 1: రాష్ట్రంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు సామంతరాజులుగా వ్యవహరిస్తున్నారని, బ్యూరోక్రాట్లపై మితిమీరిన పెత్తనం చేస్తున్నారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి విమర్శలు గుప్పించారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో 'బ్యూరోక్రసీ నాడు-నేడు' అనే అంశంపై గుంటూరు జిల్లా రామన్నపేటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చక్రపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఏఎస్ అధికారులు మంచి పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ తిరుగుతూ రాజ్యాంగ బద్ధమైన తమ పదవుల గౌరవాన్ని దిగజారుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ జీవోలు రహస్యంగా ఉంచడం వల్ల పాలనలో పారదర్శకత లోపిస్తుందని, అవినీతి రాజ్యమేలుతుందని చెప్పారు. ఏటా దేశవ్యాప్తంగా 150 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి బ్యూరోక్రాట్ల నియామకం జరుగుతోందని, మరో వెయ్యి మంది కేంద్ర సర్వీసులలో ఏటా చేరుతున్నారని తెలిపారు. ఎస్ఆర్ శంకరన్, రాజామణి, యూవీ రాఘవేంద్రరావు, యుగంధర్, బీపీఆర్ మిట్టల్ లాంటి అధికారులు నేడు కనిపించడం లేదన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ.. శాసనవ్యవస్థ.. కార్యనిర్వాహక వ్యవస్థను లోబరుచుకుని అక్రమాలు, అవినీతికి పాల్పడుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ సంస్థ బాపట్ల కన్వీనర్ డాక్టర్ వీసీ సాయిబాబు, మానవత సంస్థ ఛైర్మన్ పావులూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో దూకుడు!

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేశారు. కొన్ని రోజుల్లో రోజుకు రెండు సభలు.. మరికొన్ని రోజుల్లో నాలుగు సభలు నిర్వహించేలా ఈ ప్రణాళిక తయారైంది. రోజుకు నాలుగు సభల ప్రతిపాదనను జిల్లాల నాయకులు అంగీకరించడం లేదు. సమయం సరిపోదని వారు వాదిస్తున్నారు. కానీ ఈ నెలలోనే అన్ని జిల్లాల పర్యటనలు పూర్తి కావాలని అధినాయకత్వం పట్టుదలతో ఉంది. దీనిపై ఇంకా పూర్తి స్పష్టత రావలసి ఉంది. ఈ నెల ఏడో తేదీన తిరువూరు, ఆచంటల్లో సభలు జరుగనున్నాయి. ఈ నెల 11న చిలకలూరిపేట సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారని సమాచారం. నెలాఖరులో అనంతపురం జిల్లాలో జరిగే సభకూ హాజరవుతారు. ఈ సభల్లో లేవనెత్తాల్సిన అంశాలు, ప్రచారాంశాలపై టీడీపీ నాయకత్వం ఇప్పటి నుంచే కసరత్తు చేస్తోంది. ఎన్నికల ముందు పార్టీ అనుబంధ విభాగాల పనితీరులో కూడా వేగం పెంచాలని టీడీపీ నాయకత్వం భావిస్తోంది. బీసీ అనుబంధ విభాగానికి ఒక ప్రణాళిక కూడా అందజేసింది. ఇందులో భాగంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రెండేసి ప్రత్యేక వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో బీసీ వర్గాల వద్దకు వెళ్లి టీడీపీ ఎజెండాను, వారికి జగన్ ప్రభుత్వం చేసిన ద్రోహం వివరిస్తారు. ఇదే మాదిరిగా



చంద్రబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కంభంపాటి రామ్మోహన్

అన్ని అనుబంధ విభాగాలూ తమ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని నాయకత్వం ఆదేశించింది. కింది స్థాయిలో కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని కూడా నిశ్చయించారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలపై ముద్రించిన బాండ్లను ప్రతి నివాస ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి అందచేయాలని పార్టీ కేడర్‌ను గతంలోనే ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రోజుకు లక్ష నుంచి లక్షన్నర ఇళ్లను పార్టీ కార్యకర్తలు సందర్శిస్తున్నారు. ఈ సంఖ్యను 3 లక్షలకు పెంచాలని నాయకత్వం ఆశిస్తోంది.

వంద నియోజకవర్గాల్లో..



పార్టీ యువ నేత లోకేశ్ కూడా నియోజకవర్గ పర్యటనలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సుమారు వంద నియోజకవర్గాల్లో భారీ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నారు. ఒక్కో సమావేశంలో 3-4 వేల మంది కార్యకర్తలు పాల్గొనేలా చూడాలని.. ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాన్ని ఈ సమావేశాల్లో ప్రధానంగా సమీక్షించాలని ఆయన నిశ్చయించారు. అన్ని నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి కేడర్‌ను ఉత్సాహపరచి ఎన్నికలకు సన్నద్ధం చేసే నిమిత్తం వీటిని తలపెట్టారు. రోజుకు రెండు నియోజకవర్గాల చొప్పున 50 రోజుల్లో వీటిని పూర్తి చేస్తారు. సంక్రాంతి తర్వాత ఆయన పర్యటనలు ప్రారంభం కానున్నాయి.



పొత్తుల నిర్ణయం అధిష్ఠానానిదే: పురందేశ్వరి

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పొత్తులు ఖరారు చేయడం, వాటి గురించి మాట్లాడే అధికారం జాతీయ నాయకత్వానిదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ప్రస్తుతం జనసేన ఒక్కటే మిత్రపక్షమని, అంతకుమించి ఏదైనా జేపీ నడ్డా, అమిత్ షా వంటి వారు ప్రకటన చేస్తారని తెలిపారు. ఎన్నికల వేడి మొదలైన ఏపీలో పొత్తులపై వస్తున్న వార్తలు, రాష్ట్ర పార్టీలోని కొందరి వ్యాఖ్యలు చర్చనీయాంశమైన నేపథ్యంలో ఆమె స్పందించారు. ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అధినాయకత్వం, రాష్ట్ర నాయకత్వం అభిప్రాయాలు అడుగుతూ ఉంటుంది. అలాగని మేం చెప్పిందే తుది నిర్ణయం కాబోదు. రాష్ట్రంలో ఎవ్వరూ సంతోషంగా లేరు. ముఖ్యంగా అణగారిన వర్గాల ఇబ్బందులు మరింత ఎక్కువ అయ్యాయి. ఎస్సీలు, బీసీలు, మహిళలు, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు... ఒకరేమిటి అందరిలోనూ తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఆ వర్గాలకు అన్నివిధాలా అండగా నిలిచేందుకు ఈ నెల 5న విజయవాడలో రాష్ట్ర స్థాయి ఎస్సీ సభ, 7న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి బీసీ సభ ఏర్పాటు చేస్తున్నాం. అరకులో ఉత్తరాంధ్ర మహిళలతో వారి సమస్యలపై సభ ఏర్పాటు చేసి బీజేపీ సమర శంఖం పూరించనుంది. రాష్ట్రంలో అవినీతి పతాక స్థాయిలో ఉందంటూ బీజేపీ మిత్రుడు పవన్ కల్యాణ్ కేంద్రానికి లేఖ రాయడం సమంజసమే' అని పురందేశ్వరి వ్యాఖ్యానించారు.



రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకోవాలి

- నాలుగున్నరేళ్లలో ఎక్కడా అభివృద్ధి లేదు: కొణతాల

అనకాపల్లి టౌన్, జనవరి 1: ఈ ఏడాది (2024)లో ప్రజలు రాష్ట్రాన్ని కాపాడుకోవాలని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని, అందువల్ల మార్పు రావాల్సిన అవసరముందని జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు.

జగనన్నా మాట మరిచావా?

- పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల ఆవేదన
- కాంట్రాక్టు జేఎల్స్ కంటే ఎక్కువ సీనియారిటీ
- అయినా కాంట్రాక్టు జేఎల్స్‌కే క్రమబద్ధీకరణ
- న్యాయం చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ
- ఇప్పుడు కుదరదన్న సలహాదారు సజ్జల
- కోర్టును ఆశ్రయించినా స్పందించని సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎక్కడైనా సీనియర్లకు తొలి ప్రాధాన్యత ఉంటుంది. కానీ, జగన్ ప్రభుత్వంలో మాత్రం ఇంటర్ విద్యలో సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లకు పెద్దపీట వేసే రివర్స్ వ్యవహారం నడుస్తోంది. 2014లో ఉద్యోగంలో చేరిన కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు రేపోమాపో ప్రభుత్వ ఉద్యోగులుగా మారబోతుంటే.. 1995లో విధుల్లో చేరిన పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్లు మాత్రం అదే హోదాలో మిగిలిపోతున్నారు. సుదీర్ఘ అనుభవం, అర్హతలు ఉన్నప్పటికీ పార్ట్‌టైమ్ అనే పేరు కారణంగా అన్యాయానికి గురవుతున్నారు. వారి తర్వాత ఉద్యోగంలో చేరిన కాంట్రాక్టు జేఎల్స్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కాగా, అధికారంలోకి రాగానే పార్ట్ టైమ్ జేఎల్స్‌కు న్యాయం చేస్తానని పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని వారు గుర్తుచేసుకుంటున్నారు. ఏదో ఒక రూపంలో న్యాయం చేస్తానని అప్పట్లో జగన్ హామీ ఇస్తే... మిమ్మల్ని క్రమబద్ధీకరించడం సాధ్యం కాదని ఇప్పుడు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తేల్చేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ పార్ట్ టైమ్ జేఎల్స్ కోర్టును ఆశ్రయించారు.

1989 నుంచి పార్ట్‌టైమ్

రాష్ట్రంలో 474 ప్రభుత్వం ఇంటర్మీడియెట్ కాలేజీలు ఉన్నాయి. బోధనకు అవసరమైన రెగ్యులర్ జూనియర్ లెక్చరర్లు లేనప్పుడు ప్రభుత్వం వివిధ రూపాల్లో జేఎల్స్‌ను విధుల్లోకి తీసుకుంది. ఆ విధానంలోనే 1989 నుంచి పార్ట్‌టైమ్ పద్ధతిలో జేఎల్స్‌ను తీసుకున్నారు. 2001లో కాంట్రాక్టు జేఎల్స్ విధానం ప్రారంభమయ్యేవరకు ఇది కొనసాగింది. పార్ట్‌టైమ్ ఉద్యోగులకు వినిమం టైమ్ స్కేలుతో పాటు అదనంగా డీఏ ఇస్తున్నారు. అయితే, వారిని కూడా కాంట్రాక్టులోకి మారాలంటూ 2008 సమయంలో ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కానీ, అప్పటికే సుదీర్ఘ అనుభవం ఉన్నందున, సీనియారిటీని కోల్పోతామనే భయంతో వారు కాంట్రాక్టులో మారలేదు. మరోవైపు వారికి సమాంతరంగా కాంట్రాక్టు జేఎల్స్ పెరుగుతూ వచ్చారు. ఈలోగా తొలినాళ్లలో విధుల్లోకి వచ్చిన పార్ట్‌టైమ్ జేఎల్స్ చాలా మంది రిటైర్ అయిపోయారు. ప్రస్తుతం 350 మంది మాత్రమే మిగిలారు. మరో 50 మంది ల్యాబ్ అసిస్టెంట్లు ఉన్నారు. పేరుకి కాంట్రాక్టు, పార్ట్ టైమ్ అయినా అందరూ ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలేజీల్లోనే ఉండాలి. దీంతో తమకు న్యాయం చేయాలని జగన్ పాదయాత్రలో పార్ట్‌టైమ్ జేఎల్స్ విజయనగరంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అధికారంలోకి రాగానే మీకు న్యాయం చేస్తానంటూ అప్పట్లో జగన్ హామీ ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చాక జగన్‌ను కలిసే అవకాశం వారికి ఇవ్వలేదు. ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ఇంటర్మీడియెట్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు జేఎల్స్ పెద్దఎత్తున రెగ్యులర్ కాబోతున్నారు. అయితే, వారితోపాటు తక్కువ సంఖ్యలో ఉన్న తమనూ క్రమబద్ధీకరించాలని పార్ట్‌టైమ్ జేఎల్స్ కోరుతున్నారు.

సీఎం జగన్‌ను కలిసే అవకాశం లేకపోవడంతో పార్ట్‌టైమ్ జేఎల్స్ ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ విషయంపై సజ్జల వద్దకు వెళ్లాలని ఆయన సూచించారు. సజ్జలను కలవగా తమ హామీ కేవలం కాంట్రాక్టు ఉద్యోగులకేనని తేల్చేశారు. దీంతో క్రమబద్ధీకరణకు తమనూ పరిగణనలోకి తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై స్పందించిన న్యాయస్థానం విషయాన్ని పరిశీలించాలని ఇంటర్మీడియెట్ విద్యాశాఖను ఆదేశించింది. కానీ, ఈ శాఖ ఇంత వరకు కౌంటర్ దాఖలు చేయలేదని తెలిసింది.

దారితప్పుతున్న వైద్య విద్యార్థులు!

- గంజాయి మత్తులో కొందరు
- ఒంగోలు, కర్నూలులో వెలుగులోకి
- ఉత్తరాంధ్రలో ఓ మెడికల్ కాలేజీలోనూ!
- మరోవైపు పీడిస్తున్న ర్యాగింగ్ భూతం
- బెజవాడ 'సిద్ధార్థ'లో జూనియర్లకు చుక్కలు
- శ్రీకాకుళం బోధనాసుపత్రిలో మరో దారుణం
- హౌస్ సర్జన్‌పై అసిస్టెంట్ ప్రొఫెసర్ అత్యాచారయత్నం.. విధుల నుంచి తొలగింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భవిష్యత్‌లో డాక్టర్లు అయి ఎందరో ప్రాణాలను కాపాడాల్సిన వైద్య విద్యార్థులు కొందరు విద్యార్థి దశలోనే దారి తప్పుతున్నారు. ఎంతోమంది ప్రఖ్యాత వైద్యులను అందించిన కొన్ని మెడికల్ కాలేజీలు నేడు మత్తు పదార్థాలకు నిలయాలుగా మారాయి. కొందరు వైద్య విద్యార్థులు గంజాయి మత్తులో పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఒకవైపు ర్యాగింగ్.. మరోవైపు గంజాయి మత్తుతో వారి భవిత ప్రశ్నార్థకంగా మారుతోంది. రాష్ట్రంలో విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి మెడికల్ కాలేజీల వరకూ చేరింది. ఈ మధ్యకాలంలో ఒంగోలు, కర్నూలులో వెలుగులోకి వచ్చిన సంఘటనలే ఇందుకు ఉదాహరణ. ఒంగోలు వైద్య కళాశాలలో రెండు వర్గాల విద్యార్థుల మధ్య జరిగిన వార్ గంజాయి వల్లేనని అధికారులు చెబుతున్నారు. గత ఏడాదిగా ఆ కాలేజీలో కొంతమంది విద్యార్థులు గంజాయికి అలవాటుపడ్డారు. ఈ విషయాన్ని కొందరు విద్యార్థులు ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ల దృష్టికి తీసుకువెళ్లడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఇది చిలికి చిలికి గాలివానగా మారి క్లాస్ రూమ్‌లోనే ఒకరిపై మరొకరు దాడి చేసుకునే దాకా వెళ్లింది. ఇదేవిధంగా కర్నూలు మెడికల్ కాలేజీలోనూ గంజాయి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్కడ కూడా కొందరు విద్యార్థులు గంజాయికి అలవాటు పడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు ఉత్తరాంధ్రలోని ఒక ప్రముఖ వైద్య కళాశాలలోనూ గంజాయి విచ్చలవిడిగా దొరుకుతున్నట్లు తెలుస్తోంది.

మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ కూడా విచ్చలవిడిగా జరుగుతోంది. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ హాస్టల్‌లో రాత్రి పూట సీనియర్లు జూనియర్ల గదులకు వెళ్లి ర్యాగింగ్ చేస్తున్నారు. ఎంత నిఘా పెట్టినా ర్యాగింగ్‌కు అడ్డుకట్ట పడటం లేదు. సీనియర్లు తమ రికార్డులు రాయాలని జూనియర్లపై ఒత్తిడి చేస్తున్నారు. మాట వినకపోతే తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై జూనియర్లు అనేకసార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో జరిగిన దాడి సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీనియర్లు జూనియర్లను ఇబ్బంది పెట్టడంతో ఒక ప్రొఫెసర్ విద్యార్థులను ప్రశ్నించేందుకు హాస్టల్‌కు వెళ్లారు. గట్టిగా నిలదీయడంతో కొంతమంది సీనియర్ విద్యార్థులు ప్రొఫెసర్‌పై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం వెలుగులోకి వస్తే కాలేజీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందనే ఉద్దేశంతో అధికారులు ఈ విషయం బయటకు పొక్కనీయకుండా దాచిపెట్టారు. ప్రొఫెసర్‌పై సీనియర్ విద్యార్థులు దాడి చేసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి ఘటనలను ఉపేక్షించడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ గాడి తప్పుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

శ్రీకాకుళంలో దారుణం



శ్రీకాకుళం బోధనాసుపత్రిలో దారుణమైన సంఘటన జరిగింది. గతవారం జనరల్ సర్జరీ విభాగంలో విధులు నిర్వహించే అసిస్టెంట్ ప్రొఫెసర్, అదే కాలేజీలో హౌస్ సర్జన్ చేస్తున్న మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాత్రిపూట విధుల్లో ఉన్న ఆమెను అసిస్టెంట్ ప్రొఫెసర్ బలవంతంగా తన రూమ్‌కు రప్పించుకుని అత్యాచారయత్నానికి ప్రయత్నించారు. ఆ మరుసటి రోజు బాధితురాలు కాలేజీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. ఈ విషయం బయటకు రాకుండా అధికారులు తొక్కిపెట్టారు. అంతేగాక కేసు పెట్టకుండా సదరు జూనియర్ డాక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయం డీఎంఈ దృష్టికి రావడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించారు.

జాబితాపై జంకు?



(మొదటి పేజీ తరువాయి)

ద్వితీయ శ్రేణి నేతలు మాత్రం ఈ మార్పులను అంగీకరించడం లేదు. మంత్రి మేరుగ నాగార్జునను బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం నుంచి ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకు మార్చడాన్ని కేడర్ ప్రశ్నిస్తోంది. విశాఖ నగరంలోని గాజువాకలో తనను తప్పించడాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తొలి జాబితాపై పెద్దగా నిరసనలు లేవని భావించిన జగన్.. మలి జాబితాను ఈ నెల 2 లేదా 3న విడుదల చేయాలని అనుకున్నారు. సామాజిక పింఛన్‌ను రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచుతున్నందున.. బుధవారం నుంచి వారం పాటు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఎన్నికల ముంగిట కొత్త ఇన్‌చార్జులతో ఈ పంపిణీ నడిపించాలని అనుకున్నారు. అసెంబ్లీ ఇన్‌చార్జులంతా ఇందులో పాల్గొనాలనీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మలివిడత జాబితాను జగన్ ప్రకటిస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి ఈ జాబితాను శుక్రవారమే ప్రకటిస్తారని కూలి మీడియాకు లీకులిచ్చారు. ఈ చానళ్లు జిల్లాల వారీగా నియోజకవర్గ ఇన్‌చార్జుల పేర్లను ప్రసారం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు మొదలయ్యాయి. దీంతో వైసీపీ నాయకత్వం విడుదలపై వెనుకంజ వేసింది. అసంతుష్టులను బుజ్జగించి మంగళ/బుధవారాల్లో అభ్యర్థుల జాబితా వెల్లడించాలనుకుంది. ఇది కూడా జరిగే అవకాశం తక్కువేనని వైసీపీ నేతలు అంటున్నారు.

అనుకున్న మార్పులు కొనసాగుతాయా?

రేపల్లె ఇన్‌చార్జిగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావును తప్పించడంపై వైసీపీ శ్రేణులు తీవ్ర స్థాయిలో నిరసనలు తెలుపుతున్నాయి. ఆయన బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నా వారు వినిపించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కార్యకర్తలను శాంతింపజేయడానికి.. ఆయన్ను అవనిగడ్డకు వెళ్లాలని వైసీపీ అధిష్ఠానం కోరుతోంది. ఇంకోవైపు.. రెండో విడత జాబితాలో తూర్పు గోదావరి జిల్లాలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలను.. అనంతపురం-ఏడుగురు, కృష్ణా-ఆరుగురు, ప్రకాశం-నలుగురు, విశాఖ- నలుగురు, పశ్చిమ గోదావరి-ముగ్గురు, శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలను మారుస్తున్నట్లుగా వైసీపీ నేతలు అంతర్గత సంభాషణల్లో చెప్పారు. తాజాగా అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కల్యాణదుర్గం అసెంబ్లీ స్థానానికి, మడకశిరకు శుభకుమార్‌ను, పెనుగొండకు మంత్రి ఉషశ్రీ చరణ్, కదిరి-మక్బూల్, దర్శి-బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జగ్గంపేట-తోట నరసింహం, పిఠాపురం-ఎంపీ వంగా గీత, ఎమ్మిగనూరు-మాచిన వెంకటేశ్, శింగనమల-శ్రీనివాసమూర్తి/శమంతకమణి/యామినీ బాల, యర్రగొండపాలెం-తాడిపర్తి చంద్రశేఖర్, ప్రత్తిపాడు-జానకీదేవి/వరుపుల సుబ్బారావు, గిద్దలూరు-శిద్దా రాఘవరావు లేదా సత్యనారాయణరెడ్డి లేదా వంశీధర్‌రెడ్డిలను ఇన్‌చార్జులను నియమిస్తారని చెబుతున్నారు. కనిగిరిలో బుర్రా మధుసూదన్ యాదవ్, మార్కాపురంలో నాగార్జునరెడ్డిని కొనసాగిస్తారని అంటున్నారు. ఆలూరు, రాయదుర్గం, రాజాం, ఎచ్చెర్ల, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, పెనమలూరు, జగ్గయ్యపేట, పాయకరావు పేట, పెందుర్తి, పెడన, ఉదయగిరి, గంగాధర నెల్లూరు, నెల్లూరు, బద్వేలు, కోడుమూరు, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో మార్పులూ చేర్పులూ ఉంటాయని తెలిసింది.

కనిపించని కొత్త సంవత్సర సందడి

కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం పెద్దగా సందడి కనిపించలేదు. జగన్‌కు శుభాకాంక్షలు చెప్పడానికి మంత్రి జోగి రమేశ్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాత్రమే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. గతంలో ఇదే రోజు ఇక్కడ కిటకిటలాడేది.



షర్మిల భయం..?

అభ్యర్థులను మార్చితే సిటింగ్ ఎమ్మెల్యేల నుంచి నిరసన తీవ్రంగా ఉంటే అసలుకే ప్రమాదం ఉంటుందని కూడా జగన్ భయపడుతున్నట్లు తెలిసింది. వారు టీడీపీ, జనసేనల్లో చేరితే.. ఎన్నికలకు ముందే వైసీపీ ఎత్తిపోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతుందన్న ఆందోళనా ఉంది. ఇదే సమయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపడితే.. ప్రభావం తీవ్రంగానే ఉంటుందని జగన్ భావిస్తున్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పతనావస్థకు చేరింది. కాంగ్రెస్ నేతలు పలువురు జగన్ చెంతకు చేరారు. ఇప్పుడు షర్మిల వస్తే.. వైఎస్ అభిమానులంతా తిరిగి సొంతగూటికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తాను షర్మిల వెంట నడుస్తానంటూ ప్రకటించారు. మంగళగిరి అభివృద్ధికి జగన్ నిధులు ఇవ్వలేదని ఆళ్ల చేసిన వ్యాఖ్యలు వైసీపీని కుదిపేశాయి. ఈ వ్యాఖ్యలతో మంగళగిరి టికెట్ వెనుకబడిన వర్గానికి ఇచ్చామని జబ్బలు చరచుకుంటున్న వైసీపీ పెద్దలకు ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. టికెట్ దక్కని సిటింగ్‌లు నిలదీస్తారని.. ఎమ్మెల్యేలకు జగన్ దర్శనమే ఇవ్వడం లేదు. ఇటీవల పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, తాజాగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తమకు జగన్ దర్శనం ఇప్పించాలంటూ వైసీపీ పెద్దలను బహిరంగంగా కోరడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కొందరు మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమంత్రిని కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కానీ వారికా అవకాశం దొరకడం లేదు.

చేయించింది పెద్ద రెడ్లు.. శిక్ష నాకా.?

- దళిత ఎమ్మెల్యే ప్రశ్నకు జగన్ మౌనం
- ముఖముఖాలు చూసుకున్న ఆ ఇద్దరు నేతలు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'నేనేం తప్పు చేశాను సార్.. వాళ్లిద్దరే అంతా చేయించారు.. వాళ్లను కాదని ఒక్కటంటే ఒక్కటీ చెయ్యలేదు.. కానీ దళితుడినని నాకు శిక్ష వేస్తారా' అంటూ తిరుపతి జిల్లాకు చెందిన ఒక దళిత ఎమ్మెల్యే సీఎం జగన్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. జవాబు చెప్పలేక ముఖ్యమంత్రి మౌనం వహించారు. వైసీపీలో ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. నియోజకవర్గాల ఇన్‌చార్జులను మారుస్తున్న వైసీపీ అధిష్ఠానం.. అసంతుష్ట నేతలను బుజ్జగించేందుకు తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపిస్తోంది. ఇందులో భాగంగా రెండ్రోజుల క్రితం రాయలసీమకు చెందిన ఎమ్మెల్యేలను ఒక్కొక్కరినీ రప్పించి.. జగన్ వద్దకు వెళ్లాక ఏం మాట్లాడాలో.. ముందుగానే ఎంపీ మిథున్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డి దిశానిర్దేశం చేసి పంపారు. నాలుగేళ్లుగా జగన్ దర్శనభాగ్యానికి నోచుకోక ఉసూరుమంటున్న చిత్తూరు జిల్లాకు చెందిన ఒక దళిత ఎమ్మెల్యే కూడా వీరిలో ఉన్నారు. ఆయన మొదటిసారి తాడేపల్లి ప్యాలెస్ లోపలకు అడుగుపెట్టగానే..

జగన్: బాగున్నావా..

ఎమ్మెల్యే: బాగున్నా సార్..

జగన్: మన పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ముఖ్యం.. కొంతమంది అభ్యర్థులను మార్చబోతున్నాం..

ఎమ్మెల్యే: మంచి నిర్ణయమే సార్..

జగన్: మీ నియోజకవర్గం రిపోర్ట్ చూశా.. నీకు కష్టంగా ఉంది.. రేపు మళ్లీ మనం గెలిచాక నీకు న్యాయం చేస్తా.. పార్టీ నిర్ణయాన్ని గౌరవించి అభ్యర్థి ఎవరైనా కలిసి పనిచేయాలి.

ఎమ్మెల్యే: నా నియోజకవర్గంలో నాకు కష్టంగా ఉందా.. నేనేం చేశాను సార్..!

జగన్: నువ్వు మంచి వ్యక్తివే.. కానీ అభ్యర్థి మార్పుతో అక్కడ విజయం సాధిస్తాం..

ఎమ్మెల్యే: నాకు ఎలాంటి చెడ్డపేరూ లేదు సార్.. ఎందుకంటే నేను ప్రతి చిన్న పనీ మా పెద్ద రెడ్లు ఇద్దరూ చెప్పినట్లే చేశా.. అలాంటప్పుడు చెడ్డపేరు వస్తే వాళ్లకు రావాలి.. నాకెందుకు వస్తుంది..?

జగన్: అక్కడ ఎమ్మెల్యే నువ్వే కదా! ప్రజల్లో కనిపించేది నువ్వే గనుక నిన్నే చూస్తారు.

ఎమ్మెల్యే: నాతో చేయించిందంతా వీళ్లిద్దరు.. శిక్ష మాత్రం నాకా..!

అని ఆ దళిత ఎమ్మెల్యే ఆవేదనతో ప్రశ్నించడంతో సీఎం ఒక్కసారిగా మౌనం వహించారు. పక్కనే కూర్చున్న ఆ ఇద్దరు నాయకుల వైపు చురచురా చూశారు. వైసీపీలో ఈ సంవాదం హాట్ టాపిక్‌గా మారింది.

జనవరిలో చలి తక్కువే!

- సాధారణం కంటే ఎక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు?
- మధ్యభారతంలో తగ్గనున్న చలిగాలుల ఉధృతి
- దేశవ్యాప్తంగా ఎక్కువ వర్షాలు: ఐఎండీ

విశాఖపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శీతాకాలం అనగానే గుర్తుకొచ్చేది జనవరి నెల. ఉత్తరాది నుంచి వీచే చలిగాలుల ఉధృతితో ప్రజలు గజగజలాడుతుంటారు. అయితే, ఈ ఏడాది జనవరిలో దేశంలో అనేక చోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదుకానున్నాయి. మధ్య భారతంలో రోజుల తరబడి ఉండే చలిగాలుల ప్రభావం(కోల్డ్ డేస్) తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సోమవారం ఓ బులెటిన్‌లో వెల్లడించింది. ఉత్తర, వాయువ్య భారతాల్లో కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో రాత్రిపూట కనీస ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు దక్షిణాన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌తోపాటు ఈశాన్య భారతం మొత్తం సాధారణం కంటే అత్యంత ఎక్కువగా, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఎక్కువగా నమోదవుతాయని అంచనా వేసింది. అదేవిధంగా మధ్యభారతంలో చలిగాలులు వీచే రోజులు(కోల్డ్ డేస్) తక్కువగా ఉంటాయి. జనవరిలో వాయువ్య, ఈశాన్య భారతాల్లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు సాధారణానికి మించి కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్నందున దేశంలో చలి తీవ్రత తక్కువగా ఉండడంతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.



250 కోట్లు తాగేశారు!

2 రోజుల్లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. ఈ రెండు రోజుల్లో కలిపి ఏకంగా దాదాపు రూ.250 కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించినట్లు తెలుస్తోంది. డిసెంబరు 31న ఆదివారం ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా రెట్టింపు స్థాయిలో రూ.147 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. జనవరి 1న సోమవారం సుమారు రూ.వంద కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డిసెంబరు 31న 1.51 లక్షల కేసుల లిక్కర్, 67 వేల కేసుల బీరును విక్రయించారు. గతేడాది అదే రోజున రూ.142 కోట్ల విలువైన మద్యం అమ్మగా, ఈసారి రూ.5 కోట్ల మేర అమ్మకాలు పెరిగాయి. ఇక 2023 జనవరి 1న రూ.98 కోట్ల మద్యం అమ్ముడైంది. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా మద్యం అమ్మకాలకు ఎక్సైజ్ శాఖ పనివేళలు పొడిగించింది. 31, 1 తేదీల్లో మద్యం షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్లు అర్ధరాత్రి దాటాక ఒంటి గంట వరకు మద్యం అమ్మేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో అర్ధరాత్రి వరకూ షాపులు, బార్లు కిటకిటలాడాయి. ప్రతిరోజూ రాష్ట్రంలో సగటున రూ.75 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరుగుతుండగా, డిసెంబరు 31న రెట్టింపు మద్యం (147 కోట్లు) అమ్మారు.



ఆర్టీసీ బస్సుల నిర్వహణ బాగుండాలి

కొత్త ఏడాది 2,500 కొత్త బస్సులు: ఎండీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా బస్సుల నిర్వహణ ఉండాలని, మంచి బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సిబ్బందికి సూచించారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ 2023లో అధికారులు, సిబ్బంది సమష్టి పనితీరుతో మంచి ఫలితాలు సాధించామని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికులపై మనం ఆధారపడి ఉన్నామని, వారికి మెరుగైన సేవలు అందిస్తేనే ఆక్యుపెన్సీ పెరిగి సంస్థ పురోగతికి తోడ్పడుతుందన్నారు. కొత్త ఏడాదిలో కొత్త రంగులు, ఆకట్టుకునే డిజైన్లతో 1500 డీజిల్ బస్సులు, వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ఆర్టీసీ బస్టాండ్లు, బస్ డిపోలను ఆధునీకరించుకోవాల్సి ఉందని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.ఎస్.బ్రహ్మానంద రెడ్డి, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు బురిడీ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో జగన్ సర్కారు బీసీ మంత్రం జపిస్తోంది. బీసీల చుట్టూ రాజకీయాలు చేస్తోంది. తమ ప్రభుత్వంలో బీసీలకు ఎంతో లబ్ధి చేకూర్చామంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. అబద్ధాలు చెబుతూ బీసీల ఓట్లకు గాలం వేస్తోంది. అయితే గత నాలుగున్నరేళ్ల పాలనలో బీసీలను నిలువునా మోసం చేసింది. చెప్పిందే చేస్తామని, మడమ తిప్పమని ప్రతిపక్షంలో పదే పదే చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చాక గతంలో చెప్పింది మరిచిపోయారు. మాట తప్పారు. మడమా తిప్పారు. మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన ఎన్నో హామీలను గాలికొదిలేశారు. పలు పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయి. అంతేగాక గతంలో ఉన్న ఎన్నో పథకాలను రద్దు చేశారు. అయితే అన్ని వర్గాలకు ఇచ్చే నవరత్నాల నగదు బదిలీల లెక్కలు చెబుతూ బీసీలకు అంతిచ్చాం, ఇంతిచ్చామని గొప్పలు చెబుతున్నారు. బీసీలు టీడీపీ సానుభూతిపరులనే ఉద్దేశంతో జగన్ సర్కార్ ఓ రకంగా వారిపై కక్ష కట్టినట్టు వ్యవహరించింది. వైసీపీ మేనిఫెస్టోలో 90 శాతం హామీలు అమలు చేయలేదు. చంద్రబాబు ప్రభుత్వంలో బీసీలకున్న పథకాలన్నింటికీ స్వస్తి పలికింది. కొద్ది మంది బీసీ నేతలకు కార్పొరేషన్ పదవులిచ్చి మొత్తం బీసీ వర్గాలను ఉద్ధరించినట్లు బిల్డప్ ఇస్తోంది.

ఆగిన సామాజిక భవనాల నిర్మాణాలు

గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఎక్కువ మంది నివసిస్తున్న ప్రాంతాల్లో వివాహాలు, వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన కమ్యూనిటీ భవనాలను నిర్మించతలపెట్టింది. బీసీ కార్పొరేషన్ ద్వారా వీటి నిర్మాణాలకు పంచాయతీ స్థాయిలో రూ.10 లక్షలు, మండల స్థాయిలో రూ.25 లక్షలు, జిల్లా స్థాయి బీసీ భవనాలకు రూ.50 లక్షల అంచనాలతో పనులు మంజూరు చేసింది. 1187 బీసీ కమ్యూనిటీ హాళ్లకు రూ.165 కోట్లు, 12 బీసీ భవనాలకు రూ.56.47 కోట్లు మంజూరు చేసింది. పలుచోట్ల స్థలం అందుబాటులో లేకపోవడం, రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించకపోవడం వంటి కారణాలతో ఆశించిన స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పనులన్నీ రద్దు చేయడంతో భవనాల నిర్మాణాలు అటకెక్కాయి.

సంక్షేమం డొల్ల

బీసీలకు అమ్మఒడి లబ్ధి చేకూర్చినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించినా ఆ నిధులన్నీ బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్నట్టు లెక్కలు చెబుతున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి సహకారం అందించడం లేదు. అయినా నవరత్నాలు, బీసీ కార్పొరేషన్ రెండింటి ద్వారా లబ్ధి చేకూర్చినట్లు ప్రభుత్వం ఆర్భాటం చేస్తోంది. నవరత్నాల పేరుతో కొందరికి నగదు జమ చేసి మొత్తం బీసీలందరినీ ఉద్ధరించినట్లు డబ్బా కొడుతోంది. రాష్ట్రంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీలకు సంక్షేమ పథకాలు నామమాత్రంగానే అందుతున్నాయి. 2.14 కోట్ల బీసీ జనాభాలో కేవలం ఐదు రకాల కులాలకు చెందిన 44 లక్షల జనాభాకు తప్ప మిగతా 1.70 కోట్ల బీసీ జనాభాను గాలికొదిలేసింది. రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్ వృత్తిని అవలంబిస్తున్న కొన్ని కులాలు, మత్స్యకారులు, చేనేత వృత్తి వారికే నవరత్నాలు అందుతున్నాయి.



బాబు సర్కార్‌లో భారీగా నిధులు

గత ప్రభుత్వం 137 రకాల బీసీ కులాలను కలుపుకొని 13 కార్పొరేషన్లు, 9 ఫెడరేషన్ల ద్వారా ప్రతి ఏటా రూ.1000 కోట్లకు పైగా స్వయం ఉపాధి యూనిట్లు అందించింది. బీసీ కులవృత్తులను ప్రోత్సహించేందుకు ఆదరణ పనిముట్ల పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఆయా కులాల వారికి అధునాతన పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించింది. రజకులకు వాషింగ్‌మెషిన్లు, నాయీబ్రాహ్మణుల సెలూన్లకు సంబంధించిన పరికరాలు, టైలర్లకు సరికొత్త కుట్టుమిషన్లు అందించి సాయపడింది. రూ.750 కోట్లు ఖర్చు చేసింది. దీంతో పాటు ప్రతి ఏటా 60 వేలమంది బీసీలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేసింది. ఒక్కొక్కరికి రూ.లక్ష సబ్సిడీని అందించింది. ఐదేళ్లలో మూడు లక్షల మందికి పైగా బీసీలకు ప్రయోజనం కల్పించింది. స్వయం ఉపాధి యూనిట్ల కొనుగోలు, ఆదరణ పనిముట్లను సబ్సిడీ రూపంలో అందించడానికి ఐదేళ్లలో రూ.4 వేల కోట్లు పైగా ఖర్చు చేసింది. బీసీల్లోని 137 కులాలకు ఈ ఫలాలు అందాయి. బీసీ వర్గాల్లో స్వయం ఉపాధి స్ఫూర్తి కలిగించడంతో పాటు ఆదాయం పెంచుకునేందుకు దారి చూపించింది. వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరిట కేవలం 4.37 లక్షల మందికి ఏడాదికి రూ.10 వేలు చొప్పున మంజూరుచేసింది.

నాడు కార్పొరేషన్లు కళకళ

చంద్రబాబు ప్రభుత్వం 2018-19లో బీసీల్లోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో బడ్జెట్‌ను రూపొందించింది. గతంలో ఎప్పుడూ కేటాయించని తరగతులకు ఆ బడ్జెట్‌లో ప్రత్యేక స్థానమివ్వడం విశేషం. చేనేత సంక్షేమానికి అంతకుముందు కంటే పది రెట్లు పెంచింది. రజకులకు వందరెట్లు, దూదేకుల కులాలకు చెందిన వారికి 20 రెట్లు, నాయీబ్రాహ్మణులకు 35 రెట్లు కేటాయింపులు పెంచింది. రజక, నాయీబ్రాహ్మణ, సగర, వడ్డెర, ఉప్పర, కృష్ణ బలిజ, వాల్మీకి, కుమ్మరి, భట్రాజ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చింది. కొత్తగా మేదర, విశ్వబ్రాహ్మణ, కల్లుగీత కార్మికులకు ఫైనాన్స్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఎన్నికల ముందు యాదవ, తూర్పు కాపు/గాజుల కాపు, కొప్పుల వెలమ/పోలినాటి వెలమ, కురుబ/కురుమ, వన్యకుల క్షత్రియ, కళింగ, గవర, చేనేత, మత్స్యకారులు, గాండ్ల, ముదిరాజ్‌లకు కూడా ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది.

నేడు కార్పొరేషన్లు నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం వచ్చాక గతంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లన్నింటినీ రద్దు చేసి మళ్లీ అవే పేర్లతో కొత్తగా అన్ని కులాలకు ఫైనాన్స్ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో చేసిన కేటాయింపులన్నీ 2019-20 బడ్జెట్‌లో యథావిధిగా ఉంచి.. ఈ నిధులన్నీ నవరత్నాలకు మళ్లించారు. కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు ఒక్క పైసా ఖర్చు చేయలేదు. తర్వాత బడ్జెట్‌లోనూ బీసీ కులాల ఫైనాన్స్ కార్పొరేషన్లకు నిధులు కేటాయించలేదు. దీంతో గతంలో ఏటా అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలు, ఇతర సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయాయి.

మేనిఫెస్టో హామీలు తుస్సు

హామీ: బీసీల అభ్యున్నతికి సంవత్సరానికి రూ.15 వేల కోట్లు చొప్పున 5 ఏళ్లలో రూ.75 వేల కోట్లు ప్రత్యేక ఉప ప్రణాళిక ద్వారా ఖర్చు చేస్తామని వైసీపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.

వాస్తవం: ప్రతి ఏటా అసెంబ్లీలో ఉప ప్రణాళిక కోసం బడ్జెట్ పెడుతున్నట్లు ఆర్భాటం చేయడమే తప్ప వారికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించిన దాఖలాల్లేవు.

హామీ: ఆర్థిక ఎదుగుదల కోసం అన్ని నామినేటెడ్, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు.

వాస్తవం: రాష్ట్రంలో సివిల్ కాంట్రాక్టు పనులు జరగకుండా ప్రభుత్వమే మోకాలొడ్డింది. ఎక్కడైనా పనులు జరిగినా ఆయా ప్రాంతాల్లోని వైసీపీ కార్యకర్తలకు మాత్రమే దక్కుతున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం నామినేటెడ్ కాంట్రాక్టులు కల్పించిన పరిస్థితి రాష్ట్రంలో ఎక్కడా లేదు.

హామీ: బీసీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్ఆర్ పెళ్లికానుకగా రూ.35 వేల నుంచి రూ.50 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు.

వాస్తవం: చంద్రబాబు హయాంలో చంద్రన్న పెళ్లి కానుక కింద ఇస్తున్న రూ.35 వేలు ఆపేశారు. రూ.50 వేలు ఇస్తామని నాలుగేళ్లు ఊరించి చివర్లో అమలు చేశారు. అందులోనూ రకరకాల నిబంధనలు పెట్టారు.

హామీ: బీసీ కార్పొరేషన్లకు నిధులిచ్చి ఆర్థికంగా పరిపుష్టి చేస్తామని హామీ ఇచ్చారు.

వాస్తవం: కార్పొరేషన్లకు రూపాయి కూడా నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేశారు.

హామీ: చేపల వేట నిషేధ సమయంలో రూ.10 వేలు, వేటకు వెళ్లి ప్రమాదంలో మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా ఇస్తామని హామీ ఇచ్చారు.

వాస్తవం: ఆ హామీ ఊసే ఎత్తడం లేదు.

హామీ: బీసీ కులాలకు చెందిన వారు మరణిస్తే వైఎస్ఆర్ బీమా ద్వారా వారి కుటుంబాలకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.

వాస్తవం: ఈ హామీ అమలు కావడం లేదు. గతంలో సెర్ప్ ద్వారా చేపడుతున్న ఈ ప్రక్రియ ఇప్పుడు బ్యాంకుల ద్వారా చేపడుతున్నారు. బ్యాంకులు కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం బీమా అమలు చేస్తుండటంతో చాలామంది బీమా పరిహారం పొందలేకపోతున్నారు.

హామీ: మగ్గం ఉన్న చేనేత కార్మికుల కుటుంబాలకు సంవత్సరానికి రూ.24 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.

వాస్తవం: రాష్ట్రంలో 4 లక్షల మంది చేనేత కార్మికులు ఉంటే వడపోత ద్వారా కేవలం 80 వేల మందికే ఇస్తున్నారు. మగ్గం యజమానులకు ఇచ్చి కార్మికులకు ఎగ్గొడుతున్నారు. దీంతో చాలామందికి లబ్ధి కలగడం లేదు.

చర్చలకు మున్సిపల్ కార్మిక సంఘాలకు పిలుపు

నేడు సచివాలయంలో సమావేశం

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ్మె తీవ్రం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మంత్రుల కమిటీతో చర్చలు నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మున్సిపల్ కార్మిక సంఘాలతో చర్చలు నిర్వహించనున్నారని, ఆయా కార్మిక సంఘాలు హాజరుకావాలని మున్సిపల్ అధికారులు వర్తమానం పంపారు. ఇప్పటికే మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్‌లతో జరిపిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. సోమవారం మున్సిపల్‌శాఖ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లకు, శానిటేషన్ వాహనాల డ్రైవర్లకు, మలేరియా వర్కర్లకు వృత్తిపరమైన హెల్త్ అలవెన్స్‌ను నెలకు రూ.6 కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే ప్రధానమైన డిమాండ్లుగా ఉన్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో ఆఫీస్ సిబ్బందిగా, స్కూల్ స్వీపర్స్‌గా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్ల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా జగన్ ఇచ్చిన హామీ మేరకు పర్మినెంట్ చేయాలని మంగళవారం జరిగే చర్చల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నారు.

పిల్లల కోసం దాచుకున్న డబ్బులూ ఇవ్వరా?

- జీవోలిచ్చినా చెల్లింపుల్లో చిత్తశుద్ధి ఏదీ?
- బకాయిలు మొత్తం చెల్లించాలి: బొప్పరాజు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు.. వారి పిల్లలు చదువులు, పెళ్లిళ్లు, వైద్యం తదితర కుటుంబ అవసరాల కోసం ప్రభుత్వం దగ్గర దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ డబ్బులు కూడా.. అవసరమైన సమయంలో చెల్లించకపోతే ఇక ఎలా బతకాలని ఏపీ జేఏసీ అమరావతి, చైర్మన్, సెక్రటరీ జనరల్ దామోదరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ జేఏసీ అమరావతి, అనుబంధ సంఘాల నేతలు సోమవారం సీఎస్ జవహర్‌రెడ్డిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయా సంఘాల డైరీలు, క్యాలెండర్లను సీఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలు ఉద్యమించిన సందర్భంలో సీఎం, ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల సమక్షంలో అంగీకరించిన ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఇప్పటికీ జాప్యం చేయడం సమంజసం కాదు. ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇంత వరకు చెల్లించకపోవడం దారుణం. సీఎం ఇచ్చిన హామీలే అమలు కాకపోతే భవిష్యత్తులో ఉద్యోగులు, పెన్షనర్లు ఇంకా ఎవరి మాటలు నమ్మాలి. డీఏ బకాయిలు, సరెండర్ లీవులు 2023 సెప్టెంబరు నెలలో చెల్లింపులు చేస్తామన్నారు. 11వ పీఆర్సీ ఎరియర్స్ చెల్లింపుల చేయలేదు. ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలపై కూడా జీవోలు ఇవ్వలేదు' అని తెలిపారు. రాష్ట్రంలో లక్షలాది సంఖ్యలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోవడమే కాకుండా ప్రధానంగా వేల కోట్ల బకాయిల చెల్లింపులు కోసం జీవోలిచ్చి కూడా ఇప్పటి వరకు చెల్లింపులు చేయలేదంటే ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న అపనమ్మకం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల మేరకు బకాయిలు మొత్తం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.



ఒంగోలులోని మంత్రి సురేశ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు



విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నిరసనల హోరు

కొత్త సంవత్సరం తొలిరోజూ అంగన్వాడీల ఆందోళనలు

- ఆటపాటలతో వినూత్నంగా 21వ రోజు సమ్మె
- సీఎం జగన్ దయ వల్లే రోడ్డున పడ్డామంటూ ఆగ్రహం
- ఒంగోలులో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయింపు
- డిమాండ్లు పరిష్కరించే వరకు పోరు ఆపేదిలేదని ప్రతిన

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. సోమవారానికి అంగన్వాడీల సమ్మె 21వ రోజుకు చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, ఐసీడీఎస్ ప్రాజెక్టుల వద్ద నిరసనలు కొనసాగాయి. నూతన సంవత్సరం తొలి రోజు కూడా రోడెక్కే పరిస్థితి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అంగన్వాడీ నేతలు విమర్శించారు. 21 రోజులుగా పోరాటం చేస్తున్నా జగన్ సర్కార్‌లో చలనంలేదని మండిపడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేయడం, ప్రత్యామ్నాయం చూసుకుంటామంటూ ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 10 డిమాండ్లలో 4 డిమాండ్లకే జీవోలు ఇచ్చారని, మరి విగతావాటి సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. జగన్‌కు అక్కచెల్లెమ్మలపై ప్రేమ ఉంటే కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను వీడేదిలేదని, సమస్యలు పరిష్కరించకపోతే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. కడప జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో కోలాటం ఆడి నిరసన తెలిపారు. తంబళ్లపల్లెలో ఆవుకు వినతి పత్రం ఇచ్చారు. బద్వేలు, పోరుమామిళ్లలో ఒంటికాలి జపం చేశారు. 'అంతన్నావ్.. ఇంతన్నావో జగనన్న.. ఇచ్చిన హామీలు ఏమయ్యాయో జగనన్న' అంటూ నెల్లూరులోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం వద్ద పాటలు పాడి, నృత్యం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఒంగోలులో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, మంత్రికి వినతిపత్రం అందజేశారు. డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగబోదని స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు రెండువైపులా వేప కొమ్మలు పట్టుకొని ఉండగా, త్రిశూలం ధరించిన దుర్గమ్మ సీఎం జగన్‌ను కింద వేసి అంతం చేస్తున్నట్లు ప్రదర్శించారు. కలెక్టరేట్ వద్ద కూడలిలో కట్టెల కోలాటం ఆడుతూ నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఐసీడీఎస్ కార్యాలయం ముందు బైఠాయించి, మిరపకాయలు తింటూ నిరసన తెలిపారు. ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ఆడుకుందాం కార్యక్రమంతోపాటు.. మరోవైపు తమ జీవితాలతో సీఎం జగన్ ఆటలాడుతున్నాడని కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో అంగన్వాడీ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో కొత్త సంవత్సరం రోజూ పాత దుస్తులు ధరించి మౌన దీక్షతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. తిరుపతిలో సాష్టాంగ ప్రమాణాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సత్యవేడులో టీడీపీ నేత జేడీ రాజశేఖర్ సిబ్బందికి ఆర్థిక సాయం అందించారు. పుత్తూరులో సమ్మె చేస్తున్న సిబ్బందికి టీడీపీ నేత విజయబాబు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేశారు. పార్వతీపురంలోని కలెక్టరేట్ ప్రాంగణం వద్ద జీతాలు పెంచాలని తదితర డిమాండ్లతో ముగ్గులు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. గుమ్మలక్ష్మీపురం రోడ్డు మధ్యలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం పెట్టి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సీఎం జగన్ కలలోకి వెళ్లి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని చెప్పి.. బుద్ధి మార్చాలని వేడుకున్నారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద వినూత్న నిరసనకు దిగారు. సమస్యలు, హామీలు పరిష్కరించాలని కోరితే పరిష్కరించకుండా జగన్, మంత్రులు చెప్పిందే పలుమార్లు చెబుతూ సోది మాట్లాడుతున్నారని నాయకులను అనుకరించారు. శిబిరంలో కూర్చొని సోది చెప్పుకున్నారు. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పాటలు పాడి డ్యాన్స్‌లు చేశారు.

రేపు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద బైఠాయింపు

విజయవాడ(సత్యనారాయణపురం), జనవరి 1: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని 21 రోజులుగా శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ నెల 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద బైఠాయించాలని నిర్ణయించామని అంగన్‌వాడీ సంఘాల నాయకులు కె.సుబ్బరావమ్మ, జె.లలిత, వి.ఆర్.జ్యోతి తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే కలిసి వచ్చే సంఘాలు, పార్టీలను కలుపుకొని సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఏడో రోజుకు పారిశుధ్య కార్మికుల సమ్మె

అనంతపురం క్రైం, జనవరి 1: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని మున్సిపాలిటీ కార్యాలయాల ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి ర్యాలీగా వెళ్లి ఆయనకు ఒక పండు, ఒక పువ్వు అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని, రాష్ట్ర నాయకత్వంతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపేలా చూడాలని కోరారు. గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం పట్టణాల్లో మున్సిపల్ చైర్మన్‌లను కలిసి పండు, పువ్వు అందజేశారు. గుంతకల్లు పట్టణంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. తాడిపత్రిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో తెల్లవారు జామునే ప్రైవేట్ కార్మికులు పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా అడ్డుకున్నారు. ప్రైవేట్ ట్రాక్టర్లను మునిసిపల్ కార్యాలయానికి తరలించి తాళాలు వేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కడప జిల్లా బద్వేలులో చెప్పులు కుట్టి నిరసన తెలిపారు. కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు.

ఆస్పత్రిపాలైన ఆయా.. ఉద్యోగభద్రతపై ఆందోళన

- అపస్మారక స్థితి.. విషమంగా ఆరోగ్యం.. ఆలస్యంగా వెలుగులోకి..



అమలాపురం టౌన్, జనవరి 1: అంగన్వాడీల నిరవధిక సమ్మెలో పాల్గొన్న కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం ఆయా చిట్టూరి లీలాదేవి (26) ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళనకు గురై అపస్మారక స్థితిలో ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దేవగుప్తంలోని 68 నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న లీలాదేవి.. గత నెల 25 వరకు సమ్మె శిబిరంలో పాల్గొన్నారు. 26న అమలాపురంలోని దీక్షా శిబిరానికి వచ్చిన ఆమె ఒక్కసారిగా నీరసించి పోవడంతో ఇంటికి పంపించారు. రెండు రోజుల పాటు స్థానికంగా వైద్య సేవలు పొందారు. షుగర్ లెవెల్స్ ఒక్కసారిగా పెరిగిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో ఆమెను గత నెల 28న అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు నాయకురాలు కె.బేబీగంగారత్నం తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



ఈట్ స్ట్రీట్‌లో ఎక్కడికక్కడే పారేసిన చెత్త

రామవరప్పాడులో పేరుకుపోయిన చెత్త

సీతారామపురంలో గుట్టలా పేరుకుపోతున్న చెత్త

బీసెంట్ రోడ్‌లో బైక్ రిపేర్ షాపు పక్కనే పోగుపడిన చెత్త

- సమ్మెతో పెరిగిన దుర్గంధం
- వీఎంసీ సమ్మెలో సుమారు 4వేల మంది
- వారం రోజులుగా నిలిచిన చెత్త సేకరణ
- నగరంలో రోజు 500 టన్నుల చెత్త
- పేరుకున్న చెత్త 1500 టన్నుల పైమాటే
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పెరిగిన దోమల వ్యాప్తి

నగరం దుర్గంధభరితంగా మారుతోంది. కంపు భరించలేక రోడ్డుపై జనం ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుని దుర్వాసన వెజల్లుతోంది. దోమల వ్యాప్తి పెరిగింది. అంటు వ్యాధులు, విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో చెత్త ఎక్కువగా ఉంది. పేరుకుపోయిన చెత్తతో కొండప్రాంతాల ప్రజలు భయపడుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!

చిట్టినగర్, జనవరి 1: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని వారం రోజులుగా సమ్మెలో ఉండటంతో పారిశుధ్య అస్తవ్యస్తంగా మారిపోయింది. చెత్త సేకరణ నిలిచిపోవడంతో రోడ్లు చెత్తమయంగా మారాయి. ప్రభుత్వం అధికారులు ప్రత్యామ్నాయ సిబ్బందితో పని చేయిస్తున్నా పూర్తి స్థాయిలో కాకపోయినా సగం కూడా తరలించలేకపోతున్నారు. నగరంలో సుమారు 1500 టన్నుల చెత్త పేరుకుపోయినట్టు అంచనా. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం గమనార్హం. వీఎంసీలో సుమారు 4వేల మంది ఆప్కాస్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. నగరవ్యాప్తంగా రోజుకు 500 టన్నుల చెత్త వస్తుంది. వారం రోజులుగా వీఎంసీ ప్రైవేట్ క్లాప్ ఆటోలు 225, కార్పొరేషన్ ఆటోలు 25 అదనంగా 10 చక్రాల లారీలు, 20 ట్రాక్టర్లతో రోజుకు సుమారు 200 నుంచి 300 టన్నుల మేరకు చెత్తను తరలిస్తుంది. వీఎంసీ పర్మినెంట్ సిబ్బంది 472 మంది రోజువారీ కూలీలు 100 మంది తదితర సిబ్బందితో పనులు చేపడుతుంది. అయిన ఇంకా సుమారు 200 టన్నుల చెత్త మిగిలిపోతుంది.

డోర్ టు డోర్ కలెక్షన్ నిల్..

నగరంలో ప్రధాన ప్రాంతాల్లో డోర్ టు డోర్ చెత్త కలక్షన్ జరుగుతున్నప్పటికీ కొండప్రాంతాల్లో చెత్త కలెక్షన్ జరగకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త దుర్వాసన ఏం వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కొత్తపేట, చిట్టినగర్, పాలప్యాక్టరీ, ఆంజనేయవాగు, చెరువు సెంటర్ కొండప్రాంతం, కబేళా కొండ ప్రాంతంలో డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ నిలిచిపోవడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు సీఎన్‌జీ ఆటోలు వెళ్లే అవకాశం లేకపోవడంతో చెత్త ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయింది. కాలువల్లో చెత్త పేరుకుని మురుగునీరు పారుదల సక్రమంగా జరకపోవడంతో డ్రెయిన్ల పక్కనే ప్రజలు రాకపోకలు సాగించాలంటే ప్రజలు ముక్కులు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమ్మె విరమింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.



కామధేను పాల ఉత్పత్తుల కార్మాగారంలో కేక్ కట్ చేస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ ఈశ్వరబాబు, పాల సంఘ అధ్యక్షులు

సమష్టికృషితో లక్ష్యం సాధిద్దాం

- కృష్ణామిల్క్ యూనియన్ చలసాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 1: ఆరుగాలం శ్రమించే పాడిరైతుకు సహకారమందిస్తూ అందరం కలిసి సమష్టికృషితో పాడిపరిశ్రమలో అత్యుత్తమ లక్ష్యాలను సాధిద్ధామని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లిలో నూతనంగా నిర్మించిన విజయ వారి కామధేను పాల ఉత్పత్తుల కార్మాగారంలో సోమవారం నూతనసంవత్సరం సందర్భంగా ఎండీ ఈశ్వరబాబు, పాలసొసైటీ అధ్యక్షులతో కలిసి కేక్‌కట్ చేశారు. రైతు తలచుకుంటే సాధించలేనిదేదీ లేదని నిరూపిస్తూ అతితక్కువ కాలంలోనే అత్యుత్తమ సాంకేతికతో కూడిన కామధేను పాల ఉత్పత్తుల కార్మాగారం నిర్మించుకోగలిగామన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో మన విజయ పాల ఉత్పత్తులకు అత్యధిక ప్రజాదరణ పొందాయన్నారు. ప్రణాళికాబద్ధంగా సమష్టిగా కృషి చేస్తే సాధించలేది లేదని కృష్ణామిల్క్ యూనియన్ పాడిరైతులు ప్రపంచానికి ప్రాజెక్ట్ కామధేను రూపంలో సోదాహరణంగా చూపామన్నారు. అత్యధిక పాలసేకరణ ధరతో పాడిరైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధితో పాటు కల్యాణమస్తు లాంటి సంక్షేమ పథకాలతో అండగా ఉంటూ మనదైన కృష్ణామిల్క్ యూనియన్ నిరంతర అభివృద్ధికి సమష్టితత్వమే కారణమన్నారు. ప్రతి ఒక్క పాడిరైతు గర్వంగా చెప్పుకునేలా తక్కువ వ్యయంతో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పాల ఉత్పత్తులను తయారు చేయడం అందరి సహకారంతోనే సాధ్యమైందన్నారు. 2వేల కోట్ల టర్నోవర్ సాధించేలా ప్రతి పాడిరైతు మనదైన కృష్ణామిల్క్‌యూనియన్‌కు సహకారమందించాలని చైర్మన్ కోరారు. నూతన సంవత్సరంలో పాడిరైతు కుటుంబాలన్నీ సుఖశాంతులతో, ఆనందోత్సాహాలతో ఉండాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వేడుకల్లో ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు, జీఎం లక్ష్మారావు, ప్లాంట్ మేనేజర్ సరిత, హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ మేనేజర్ కిలారు కిరణ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు శనగల వెంకట శివజ్యోతి, బొట్టు రామచంద్రరావు, ట్రస్ట్ సభ్యులు పిన్నమనేని లక్ష్మీప్రసాద్, పాల సొసైటీ అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న రామిశెట్టి రామస్వామి

నలందలో ఘనంగా ఫెట్ వేడుకలు

గవర్నర్‌పేట, జనవరి 1: విద్యార్థుల్లో పోటీతత్వం, వ్యాపార దృక్పథం, నాయకత్వ లక్షణాలు ఫెట్ వంటి వాటితో పెంపొందుతాయని హయత్ ప్లేస్ (ఇంటర్నేషనల్ బ్రాండ్) విజయవాడ చైర్మన్ రామిశెట్టి వీరాస్వామి అన్నారు. నలంద విద్యానికేతన్‌లో సోమవారం ఫెట్-2024 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరాస్వామి రిబ్బన్ కట్ చేసి స్టాల్స్‌ను ప్రారంభించారు. విద్యార్థులు పలురకాల స్టాల్స్, గేమ్ షోలతో పాటు వివిధ రకాల ఆటపాటలు, నృత్యాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతి ప్రదర్శనలు అలరించాయి.



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నేతలతో కేశినేని శ్రీనివాస్, ఎంఎస్‌బేగ్ తదితరులు

పశ్చిమను కాపాడే బాధ్యత నాది!

- ఎంపీ కేశినేని శ్రీనివాస్

వన్‌టౌన్,జనవరి 1: పశ్చిమ నియోజకవర్గాన్ని కాపాడుకునే బాధ్యతను స్వీకరిస్తానని ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. సోమవారం కేశినేని భవన్‌లో వైసీపీకి చెందిన వైశ్య, ఎస్సీ, బీసీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిని సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. పశ్చిమ నుంచి తాను పోటీ చేయనని స్పష్టం చేశారు. అక్కడి నుంచి బీసీలు గానీ, మైనార్టీలు గానీ పోటీచేస్తారన్నారు. కొన్ని కబంధహస్తాల నుంచి పశ్చిమను విముక్తి చేయాలని ఆ బాధ్యత తాను తీసుకున్నానన్నారు. విజ్ఞులైన పశ్చిమ ప్రజలు మంచి వ్యక్తినే ఎనుకుంటారన్నారు. నీతి నిజాయితీపరులే రాజకీయాల్లోకి రావాలన్నారు. పశ్చిమ నుంచి తన కుమార్తె శ్వేత పోటీ చేస్తుందన్న ప్రచారం సరికాదని, తానుగానీ, తన కుమార్తె గానీ పోటీ చేయడం లేదన్నారు. నగరంలో అవినీతి అక్రమార్కులను సహించేది లేదన్నారు. వారితో పోరాటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలు జగన్, ఆయన ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీయేనని అందులో సందేహం లేదన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 16 లక్షల మంది ఓటర్లు తనతో ఉన్నారని. వారితో తానున్నానని స్పష్టం చేశారు. టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పట్నాల హరిబాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.

అక్కడ స్నానం రూ.100

- కేశఖండనశాలలో జేబులకు క్షవరం
- తలనీలాలకు రూ.50 పైనే
- టాయ్‌లెట్‌కు వెళ్లాలంటే రూ.20
- అధ్వానంగా మరుగుదొడ్లు

వన్‌టౌన్: దుర్గగుడి కేశఖండనశాలలో భక్తుల నుంచి అక్రమ వసూల్ దందా కొనసాగుతోంది. దేవస్థాన పర్యవేక్షకులు ఉన్నా క్షురకులు, పారిశుధ్య పనివారు భక్తుల నుంచి వసూళ్లు ఆగటం లేదు. అక్కడ బాత్‌రూమ్‌లో స్నానంచేస్తే రూ.100 ఇవ్వాల్సిందే. నియంత్రణ లేక ఎవరికివారు ఇష్టారాజ్యంగా సాగుతున్నారు. అసలు టికెట్ కౌంటర్ వద్దే ఈ దందా మొదలవుతోంది. తలనీలాలు గానీ కత్తెరగానీ ఏది చేయించుకోవాలన్నా టికెట్ రూ.40. భక్తులు రూ.50 నోటిస్తే చిల్లర లేదంటూ రూ.10 నొక్కేస్తున్నారు. గతంలో రూ.25 ఉన్నప్పుడూ దందా నడించింది. చిల్లర లేదని టికెట్‌కు రూ.5 కౌంటర్‌లోని ఉద్యోగి జేబులోకి వెళ్లేది, ఇప్పుడు రూ.40 అయినా అదే తంతు నడుస్తోంది. భక్తులనుంచి క్షురకులు చేయి తడపందే వదలరు. సీసీ కెమెరాలున్నా లెక్కచేయరు. టికెట్ అడుగున గానీ, టవల్ మాటున గానీ డబ్బు పెట్టించి తీసుకుంటారు. సాధారణంగా భక్తులు తాము ఇష్టపడే ఎంతో కొంత ఇస్తుంటారు. అయితే వారిచ్చేది చాలదని కొందరు అదనంగా వసూలు చేస్తున్నారు. ఒక్కోసారి గొడవపడే సంఘటలను ఉన్నాయి. శుక్రవారం విజయనగరానికి చెందిన ఒక భక్తుడు డబ్బులివ్వకపోవడంతో క్షురకుడు వాదన పెట్టుకోవడం విశేషం. ఎస్‌ఎంఆర్, క్షురకుడు వాటా వద్ద వాదులాడుకున్నారు. ఇక పారిశుధ్య పనివారు భక్తుల నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారు. శుభ్రత గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. కేశఖండనశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడం లేదు. పర్యవేక్షణ అంతంత మాత్రమే. డబ్బులు డిమాండ్ చేసిన క్షురకుడిని, ఎస్‌ఎంఆర్ ఉద్యోగిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. ఇక భక్తులు స్నానాలు చేసేందుకు ఇక్కడ షవర్‌బాత్‌లున్నాయి. అయితే ఒకరిపై నుంచి మరొకరికి నీళ్లు పడుతుండడంతో నీళ్లు త్వరగా పోయేందుకు ఏర్పాట్లు లేకపోవడంతో నీరు నిలిచిపోతున్నాయి. దీంతో బాత్‌రూమ్‌లో స్నానాలకు భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదే అదనుగా మహిళలు బాత్‌రూమ్‌లో స్నానం చేయాలంటే మహిళా కార్మికులు మనిషికి రూ.100 ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే తిట్టిపోస్తుండటంతో భక్తులు విస్తుపోతున్నారు. మరోవైపు బాత్‌రూమ్‌లు అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. కొన్నింటికి తలుపులు లేవు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రతిదానికీ తనిఖీలంటూ తిరుగుతూ ప్రచారార్భాటం చేసుకుంటున్నారే గానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావటం లేదు. కేశఖండనశాలలోని అధ్వానపు స్థితి ఆయన కంట పడలేదా అన్న విమర్శలు వస్తున్నాయి. మరోవైపు టాయ్‌లెట్ తలుపులు విరిగినా, తలుపులు లేకుండా ఉన్నా అధికారులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము వచ్చాక భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చైర్మన్ మాటలు చెబుతున్నారే గానీ వాస్తవాలు మాత్రం మరీ అధ్వాన్నంగా ఉన్నాయి. కొద్దిరోజుల్లో భవానీల దీక్ష విరమణ జరగనున్నాయి. ఇక్కడి పరిస్థితులు మెరుగు పరచకపోతే ఇబ్బందులకు గురవ్వాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





భక్తుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న కార్మికురాలు, పక్కన పెట్టిన ఊడిన టాయ్‌లెట్ తలుపు

పింఛనుదారులు సర్టిఫికెట్స్ సమర్పించాలి

- జిల్లా ఖజానా లెక్కల అధికారి రహ్మాన్

కృష్ణలంక, జనవరి 1: జిల్లాలోని విజయవాడ (ఈస్ట్), కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, విస్సన్నపేట ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో పింఛను డ్రా చేసే పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్‌లు, ఫ్యామిలీ పింఛను డ్రా చేసే పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్స్, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్‌తో పాటు నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లను జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29 లోగా సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి ఎం.హెచ్.రహ్మాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి పింఛనుదారు తమ లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించాలన్నారు. అందుబాటులోని మీ-సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లు, పోస్టాఫీసులో తమ సర్టిఫికెట్స్ సమర్పించవచ్చన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కాల వ్యవధిలో సమర్పించని వారికి మార్చి 31 నుంచి పింఛను నిలిపివేయబడుతుందని జిల్లా ఖజానా లెక్కల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



హైటెక్ చిలుక

చిలుక జ్యోతిషులకు డిమాండ్ పెరిగింది. ఫుట్‌పాత్‌లపై ఉండే వీరిని ఫైవ్‌స్టార్ హోటళ్ల వాళ్లు తీసుకొచ్చి ఇలాంటి జ్యోతిషం గురించి తెలియని, హైటెక్ నగరాల్లో పెరిగిన పిల్లలకు జ్యోతిషం చెప్పించి వేలల్లో గుంజేస్తున్నారు. ఇదో రకం హైటెక్ దోపిడీ.. కాదా మరి..



ఆక్టోపస్ దళంతో ఐజీపీ రాజశేఖర్‌బాబు తదితరులు

సాంకేతికత అనుసంధానంతో

టెర్రరిజం అణిచివేత

వన్‌టౌన్, జనవరి 1: సాంకేతిక అనుసంధానంతో టెర్రరిజాన్ని అణచివేతకు ఆక్టోపస్ దళం నిరంతరం సిద్ధంగా ఉండాలని ఆక్టోపస్, శాంతిభద్రతల ఐజీపీ రాజశేఖర్‌బాబు అన్నారు. ఆక్టోపస్ అదనపు ఐజీ ఆర్‌కే మీనా ఆదేశాల మేరకు సోమవారం రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఆయన మాట్లాడుతూ దేశంలోనే పేరు ప్రఖ్యాతులున్న దళం మన ఆక్టోపస్ అని, ఎప్పటికప్పుడు అందుబాటులోని సాంకేతికను అనుసంధానం చేసుకుంటూ టెర్రరిజాన్ని అణచి వేయాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఇంకా అధికంగా మాక్‌డ్రిల్లులు ప్రాక్టీస్ చేయాలన్నారు. తెలుపురంగు హీలియం బూరలను గాలిలోకి ఎగురవేశారు. ఎస్పీలు ఎం నాగేంద్రరావు, బి రవిచంద్ర, అదనపు ఎస్పీలు కే రామచంద్రమూర్తి, కే నగేష్‌బాబు పాల్గొన్నారు.



సమాచార పౌరసంబంధాల శాఖ ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు స్వర్ణలత

శాఖకు వన్నెతెచ్చేలా పనిచేయాలి

- అదనపు సంచాలకులు స్వర్ణలత

కృష్ణలంక, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసి, ప్రజాభిప్రాయాలను, ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేయడంలో వారధి అయిన సమాచార, పౌర సంబంధాల శాఖకు మరింత వన్నెతెచ్చేలా సమన్వయంతో పనిచేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత కోరారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలోని జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖాధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు అదనపు సంచాలకులు స్వర్ణలత ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం, సీఎం నేతృత్వంలో విప్లవాత్మక పథకాలు అమలు చేస్తోందని, వీటిని పూర్తిస్థాయిలో విజయవంతం చేయడంలో సమాచార, పౌర సంబంధాల శాఖ కృషి చాలా గొప్పదన్నారు. డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, పీఆర్‌వో వీవీ ప్రసాద్, ఏఐఈ వి.వరప్రసాద్, ఏవీఎస్ ఎ.సాయిబాబా పాల్గొన్నారు.

రవాణా ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కృష్ణలంక, జనవరి 1: ప్రభుత్వం శాఖాపరంగా నిర్దేశించిన లక్ష్యాలతో పాటు ప్రజలు కోరుకున్న సేవలను అందించేలా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని డీటీసీ ఎం.పురేంద్ర అన్నారు. బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో సోమవారం జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎం.పురేంద్రను జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అధికారులకు ఉద్యోగులకు రవాణారంగంపై ఆధారపడిన వారి కుటుంబీకులకు డీటీసీ ఎం.పురేంద్ర నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీటీసీ పురేంద్ర మాట్లాడుతూ గత ఏడాదిలో అందరం కష్టించి పనిచేసినట్లుగానే 2024లోనూ పనిచేసి శాఖాపరంగా జిల్లాను మంచి స్థానంలో నిలిచేలా కృషి చేద్దామన్నారు. రవాణా ఉద్యోగుల సంఘం నేతలు రాజాబాబు, ఆర్టీవోలు ఎ.విజయసారథి, ఎం.పద్మావతి, ఐశ్వర్య, ఆర్.ప్రవీణ్, నారాయణరాజు, రవికుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





స్కేటర్లకు వీఎంసీ కమిషనర్ అభినందన

విజయవాడస్పోర్ట్సు, జనవరి 1: చండీఘర్, చెన్నైల్లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలను సాధించిన స్కేటర్లు బచ్చు వరుణ్ కృష్ణ, మదన సుచిత్ర, పోతల విజయ్ డానియల్, శాన్వి రఫియా, చేబోయిన అభిరామ్, బుగతా జతిన్‌లను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ సోమవారం అభినందించారు. ఆయన చాంబర్లో మెడల్స్‌ను సత్కరించారు. కావాల్సిన సహాయ సహకారాలను క్రీడాకారులకు అందిస్తానని స్వప్నిల్ హామీ ఇచ్చారు. వైసీపీ ఫ్లోర్‌లీడర్ అరవ సత్యనారాయణ, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బచ్చు మురళీకృష్ణ, మాధవి, కోచ్‌లు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం

రద్దయ్యేవరకు పోరాటం

- బెజవాడ బార్ అధ్యక్షుడు కేబీ సుందర్

విజయవాడ లీగల్, జనవరి 1: భూ హక్కు చట్టం-2022ను రద్దు చేసేవరకు న్యాయవాదుల నిరసన దీక్షలు ఆగవని బెజవాడ బార్ అధ్యక్షుడు కేబీ సుందర్ తెలిపారు. భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలు సోమవారం నాటికి 12వ రోజుకు చేరాయి. సోమవారం నాటి దీక్షలో న్యాయవాదులు అల్లం పద్మనాభం, కె.నర్సింహారావు, జె.వి.ఎస్.మల్లేశ్వరరావు, నామాల కోటేశ్వరరావు, బి.వి.అరుణాదేవి, మహ్మద్ అల్తామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రజల ఆస్తి హక్కుకి భంగం కలిగించేలా రూపొందించిన ప్రజావ్యతిరేక చట్టం ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2023ను రద్దు చేయాలన్నారు. బార్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జన్ను శ్రీధర్, మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు, సోము కృష్ణమూర్తి, కందెల వరప్రసాద్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్‌కు హెల్త్‌వర్సిటీ టీమ్

విజయవాడ స్పోర్ట్సు: బెల్గావిలోని విశ్వేశ్వర టెక్నాలజీ యూనివర్సిటీలో ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే హెల్త్ వర్సిటీ టీమ్ అక్కడకు సోమవారం పయనం అయ్యిందని స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.బి. హరిణి(రాజమండ్రి జీఎస్‌ఎల్ డెంటల్ కళాశాల),పి.లిప్సి శ్రీరమా(రాజమండ్రి జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల), ఎం.సుదీక్షిత(విశాఖ ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల). ఎం.సాయి ప్రియా(విజయనగరం మహరాజా హోమియోపతి కళాశాల), జీవీ. అంజనా శ్రీ(విశాఖ వీఎంవీఎస్ ఫిజియోథెరపి కళాశాల)లు ఎంపికయ్యారన్నారు. వీరికి కోచ్,మేనేజర్‌గా ఆర్. గుణాజీ వ్యవహరిస్తారన్నారు.

గ్యాంగ్ రేప్ కేసు.. చురుగ్గా విచారణ

- పోలీసుల అదుపులో 11 మంది నిందితులు
- బాధితురాలికి చికిత్స

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖలో బాలికపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు ఇప్పటివరకూ 11 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మరికొంతమంది కోసం గాలిస్తున్నారు. బాధిత బాలిక మానసిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. బాలిక కుటుంబానిది ఒడిశాలోని కలహండి జిల్లా కాగా, ఉపాధి నిమిత్తం విశాఖపట్నం వచ్చి కంచరపాలెంలో నివాసం ఉంటోంది. ఆమె కూడా ఓచోట పనికి కుదిరింది. అక్కడ ఓ యువకుడు పరిచయమై ప్రేమ పేరుతో నమ్మించి గత నెల 17వ తేదీన హోటల్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెను లోబరుచుకున్నాడు. అనంతరం తన మిత్రుడిని పిలిపించాడు. ఆమె బాధతో బీచ్‌కు వెళ్లగా, అక్కడ ఇంకో వ్యక్తి ఆశ్రయం ఇస్తానని చెప్పి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తరువాత ఆమెపై చాలామంది అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తండ్రి గత నెల 18న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టి, ఆమె ఒడిశాలోని స్వస్థలంలో ఉందని గుర్తించి తీసుకువచ్చారు. తల్లిదండ్రుల సమక్షంలో విచారించగా, నగరంలో చాలా హోటళ్లకు తిప్పారని, అత్యాచారం చేశారని తెలిపింది. ఆమె చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు 11 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఆమె నగరంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లకుండా, ఒడిశా ఎందుకు వెళ్లింది?, నిందితులు ఏ విధంగా మభ్యపెట్టారనే వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేసును దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఎన్నికలకు సమాయత్తం: సీపీఐ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పోరాడుతూనే రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ వివిధ రంగాల ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, సర్వశిక్షా అభియాన్, కస్తూర్బాగాంధీ బాలికల కార్యాలయాల సిబ్బంది, వలంటీర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రోడ్ల మీదకు వచ్చి పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్రంలో మతోన్మాద బీజేపీని, రాష్ట్రంలో నిరంకుశ వైసీపీని గద్దె దింపేందుకు 'ఇండియా' కూటమిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా కలిసి వచ్చే శక్తులతో కలిసి ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

వైసీపీకి 20 సీట్లకు మించవు

- వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలవాలి..
- ఇది ప్రజల కోరిక: విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార (విశాఖపట్నం), జనవరి 1: రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికీ రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. సోమవారం సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కలవాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో వైసీపీకి 20 సీట్లు మించి రావన్నారు. వైసీపీ ఘోరంగా ఓటమి పాలు కాబోతుందని, జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. మూడు నెలల తర్వాత ఏపీ ప్రజలకు సుఖ సంతోషాలు వస్తాయన్నారు. అసలు అన్నం తినేవారెవరైనా 175కి 175 వస్తాయని అంటారా?...అని విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. అన్నింటిపై పన్నులు వేసి చెత్త సీఎంగా జగన్ పేరు తెచ్చుకున్నారని రామకృష్ణ విమర్శించారు.

'సంహిత'లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 'పిల్'

న్యూఢిల్లీ, జనవరి 1: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియంలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. బ్రిటిష్ కాలంలో రూపొందించిన ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ ప్రొసీజర్, ఇండియన్ యాక్ట్ బదులు వీటిని రూపొందించింది. వీటిలో చాలా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ న్యాయవాది విశాల్ తివారీ ఈ పిల్‌ను దాఖలు చేశారు. కొన్ని శిక్షలు బ్రిటిష్ కాలం నాటికంటే దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. పాత చట్టాల్లో గరిష్ఠంగా 15 రోజుల వరకు మాత్రమే పోలీసు కస్టడీలో ఉండే అవకాశం ఉండగా ఇప్పుడు దాన్ని 90 రోజులకు పెంచారని తెలిపారు.

కేరళ చానల్‌లో డీకే శివకుమార్ పెట్టుబడులు

- డీకే కుటుంబీకుల సహా చానల్ ఎండీకి సీబీఐ నోటీసులు
- 11న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేరళలోని జైహింద్ చానల్‌లో పెట్టుబడులకు సంబంధించిన అంశంపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ భార్య, పిల్లలకు బెంగళూరు సీబీఐ అధికారులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. జైహింద్ చానల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కేరళకు చెందిన కాంగ్రెస్ నేత బీఎస్ శిజు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 11న విచారణకు హాజరు కావాలని డీకే కుటుంబీకులు, చానల్ ఎండీకి సీబీఐ నోటీసులు ఇచ్చింది. డీకే శివకుమార్ అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని నమోదైన కేసును 2020లో సీబీఐ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో జైహింద్ చానల్‌లో డీకే పెట్టుబడులు పెట్టినట్టు విచారణలో గుర్తించారు. చానల్‌లో పెట్టిన పెట్టుబడులు, లాభాలు, షేర్ల వివరాలను ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ వివాదంలో డీకే శివకుమార్‌కు నోటీసులు జారీ కాలేదు. కానీ డీకే శివకుమార్ ఎంత పెట్టుబడి పెట్టారు, వాటి ద్వారా ఆయన పొందిన లాభం వివరాలను సమగ్రంగా తెలపాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. జైహింద్ చానల్‌లో డీకే శివకుమార్‌తో పాటు 30 మంది పెట్టుబడులు పెట్టినట్టు చానల్ ఎండీ బీఎస్ శిజు ఇప్పటికే స్పష్టం చేశారు. సీబీఐ నోటీసులపై చానల్ ఎండీ శిజు స్పందిస్తూ, పెట్టుబడులకు సంబంధించి సమగ్ర వివరాలు ఉన్నాయని, సీబీఐ అధికారులకు తెలియజేస్తామని అన్నారు.

రాజకీయంగా అంతమొందించే కుట్ర: డీకే

సీబీఐ నోటీసులు జారీ చేయడంపై డీకే శివకుమార్ సోమవారం బెంగళూరులో స్పందించారు. సీబీఐ తనకు కాకుండా తన భార్య పిల్లలకు నోటీసులు జారీ చేసిందని, తనకు వ్యక్తిగతంగా నోటీసులు రాలేదని అన్నారు. ఏ ఆధారంతో నోటీసులు ఇచ్చారనేది తెలియదని పేర్కొన్నారు. రాజకీయంగా తనను అంతం చేయాలని కుట్ర సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ కేసును ఉపసంహరించుకున్నా నోటీసులు ఎలా జారీ చేశారో తెలియదని అన్నారు. కోర్టుకు సీబీఐ ఏకంగా 90 శాతం విచారణ పూర్తి చేశామని తెలిపిందని, కానీ పది శాతం కూడా పూర్తి కాలేదని అన్నారు. అవసరమైతే తనను జైలుకు పంపనివ్వండి అని డీకే అన్నారు.

పదేళ్ల ప్రగతిపై మోదీ జనాభిప్రాయ సేకరణ

- 'నమో యాప్' సర్వేలో పాల్గొనండి: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 1: గడచిన పదేళ్లలో వివిధ రంగాల్లో దేశం సాధించిన పురోగతిపై ప్రధాని మోదీ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోగోరుతున్నారు. 3 నెలల్లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గత నెలలో 'నమో యాప్'లో సర్వే ప్రారంభించారు. తన ప్రభుత్వం, ఎంపీల పనితీరుతో పాటు వివిధ అంశాలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడం ఈ సర్వే ఉద్దేశం. 'గత పదేళ్లలో భారత్ పలు రంగాల్లో సాధించిన ప్రగతిపై మీరేమనుకుంటున్నారు? నమో యాప్‌లో జన్ మన్ సర్వే ద్వారా మీ అభిప్రాయాలను నాతో నేరుగా పంచుకోండి' అని 'ఎక్స్'లో కోరారు. సర్వేలో పాల్గొనే లింకును కూడా షేర్ చేశారు.

జార్ఖండ్ సీఎంగా సోరెన్ భార్య!

- త్వరలో హేమంత్ రాజీనామా: బీజేపీ

రాంచీ, జనవరి 1: జార్ఖండ్ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ త్వరలో రాజీనామా చేయనున్నారని.. ఆయన స్థానంలో ఆయన భార్య కల్పన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారని బీజేపీ తెలిపింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇటీవల ఎనిమిదోసారి ఆయనకు సమన్లు జారీచేసింది. ఈసారి తనను అరెస్టు చేస్తుందని హేమంత్ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తాను వైదొలగి భార్యకు అధికార పగ్గాలు అప్పగించాలని ఆయన భావిస్తున్నట్లు బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సోమవారం ఆరోపించారు. కల్పనా సోరెన్ ఎన్నికల్లో పోటీచేయడానికి వీలుగా గాండేయ్ నియోజకవర్గ జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫ్‌రాజ్ అహ్మద్ ఇప్పటికే రాజీనామా చేశారని చెప్పారు. కొత్త సంవత్సరంలో సోరెన్ కుటుంబానికి గడ్డు పరిస్థితులు తప్పవన్నారు. కాగా.. ఈడీ సమన్లను సవాల్ చేస్తూ సోరెన్ ఇప్పటికే జార్ఖండ్ హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వాటిని కొట్టివేసేందుకు అవి నిరాకరించడంతో ఈడీ ఆయనకు తాజా సమన్లు జారీచేసింది.

రేనాటి చోళుల శాసనాలు లభ్యం

- అత్యంత ప్రాచీనమైనవిగా గుర్తింపు

ఎర్రగొండపాలెం, జనవరి 1: రేనాటి చోళుల కాలం నాటి శాసనాలను ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గోళ్లవీడపి గ్రామంలో అధికారులు గుర్తించారు. గ్రామంలోని వణుకూరి సుబ్రహ్మణ్యం పొలంలో ఇటీవల వ్యవసాయ పనులు చేస్తుండగా అవి వెలుగుచూశాయి. చారిత్రక పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ వచ్చి వాటిని పరిశీలించి మైసూరులోని ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించారు. అక్కడి అధికారులు పరిశీలించి వివరాలు తెలియజేశారు. ఇవి అత్యంత ప్రాచీన శాసనాలని, క్రీస్తుశకం 7వ శతాబ్దం నాటి తొలి తెలుగు లిపిగా భావిస్తున్నారు. వీటిని రేనాటి చోళరాజు ముంగియువరాజు(682- 706) కుమారుడైన కొక్కిలి అనే రాజు లిఖించినట్లు గుర్తించారు. కొక్కిలి రాజు కుబ్జవిష్ణువర్ధనుడి వంశంలో ఏడవ తరానికి చెందినవారు. ఈయన ముంగియువరాజు రెండవ భార్య కుమారుడు. పల్లవ రాజుల సాయంతో వేంగి సింహాసనాన్ని అధిష్ఠించారు. ఆయన ఆరు నెలలపాటు పరిపాలించారని శాసనంలో ఉంది. కోటిపురలో ఉన్న కుళాభట్టా అనేవారికి చోళరాజు కొక్కిలి ఆరు పుట్ల భూమిని దానం చేసినట్లు ఈ శాసనాలలో లిఖించారు. త్రిపురాంతకం నుంచి శ్రీశైలం యాత్ర చేస్తూ గోళ్లవీడపిలో దద్దనాల అనే శివాలయం వద్ద రాజు విడిది చేసినట్లు ఈ శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ధ్రువీకరించారు. ఈ శాసనాల ద్వారా రేనాటి చోళుల ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ శాసనాలపై చెక్కిన అక్షరాలు తొలి తెలుగు శాసనాన్ని పోలి ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ ప్రాంతం అత్యంత చారిత్రక ప్రాభవం కలిగి ఉందని తెలుస్తోంది.




ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గోళ్లవీడు గ్రామ పొలాల్లో వెలుగుచూసిన రేనాటి చోళుల శాసనాలు



రాయితీలు కోల్పోయిన రైతాంగం

కేంద్ర ప్రాయోజిత పథకాలపై రాష్ట్రం శీతకన్ను

- అన్నదాతకు అందని యంత్ర పరికరాలు
- జగన్ సర్కార్ నిర్వాకంతో నష్టపోతున్న రైతులు
- వ్యవసాయ ఇంజనీరింగ్‌పైనా నిర్లక్ష్యమే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా అవేమీ రాష్ట్ర రైతులకు చేరడం లేదు. కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి అమలు చేయాల్సి ఉండటంతో.. రాష్ట్రం నిధులివ్వలేక మొత్తం పథకాల అమలుకే గండికొడుతోంది. దీంతో రాష్ట్ర రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. రైతుకు ఖర్చును తగ్గించి, ఆదాయాన్ని, నాణ్యమైన ఉత్పాదనని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వాటిని అనుసంధానం చేసుకుని, రాష్ట్రంలో వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగాన్ని పటిష్ఠం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. వ్యవసాయానికి ఊతమిచ్చి, రైతులకు మేలు చేసే అనేక కేంద్ర ప్రయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో జగన్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ కారణంగా గత నాలుగున్నరేళ్లలో రూ.వందల కోట్ల కేంద్ర ప్రభుత్వ రాయితీలు రాష్ట్ర రైతాంగానికి దక్కకుండా పోయాయి. ఇతర రాష్ట్రాలన్నీ జాతీయ స్థాయి పథకాలను వినియోగించుకుని రైతులకు మేలు చేస్తుంటే, ఏపీలో మాత్రం రాష్ట్ర వాటా చెల్లించక రాయితీ పథకాలన్నీ నిర్వీర్యమైపోయాయి. 40 నుంచి 60 శాతం కేంద్రం నిధులిచ్చినా, మిగిలిన మొత్తాన్ని చెల్లించకుండా రైతు ప్రయోజిత పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు నీరుగార్చారు. తొలి మూడేళ్ల యాంత్రీకరణ ఊసెత్తని జగన్ సర్కార్.. తర్వాత రైతు గ్రూపులతో అద్దె యంత్ర దుకాణాలు ఏర్పాటు చేసి, రైతులపై అద్దెలు భారం మోపింది. ఏటా వ్యవసాయం చేసే అన్నదాతకు రాయితీపై పరికరాలు అందించడంలో ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదు. చివరికి వ్యవసాయ ఇంజనీరింగ్ డైరెక్టరేట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్న పార్లమెంట్ స్థాయి సంఘ సిఫారసు కూడా బుట్టదాఖలైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి గుర్తింపు పొందిన వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయాల నుంచి వ్యవసాయ ఇంజనీరింగ్ పూర్తి చేసిన పట్టభద్రులు వేలాది మంది నిరుద్యోగులుగా ఉన్నా.. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపలేదు. రైతుకు మేలు చేసేలా వ్యవసాయ యాంత్రీకరణ, నేల-నీరు సంరక్షణ, పునరుత్పాదక శక్తి, వనరులు, పంట కోత అనంతర సాంకేతిక విభాగాలను పరిపుష్టం చేయడానికి తగిన చర్యలు కొరవడ్డాయి. కొత్తగా అభివృద్ధి చేసిన యంత్రాలను రైతులకు పరిచయం చేసి, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వరి సాగులో యంత్రీకరణ కీలకంగా మారింది. నారుమళ్ల పెంపకం, నాట్లు వేయడం, క్రిమి సంహారక మందుల పిచికారి, పంట కోత, ధాన్యం నూర్పిడి, ఉత్పత్తి ఆరబెట్టి, శుభ్రం చేయడం వంటి దశల్లో యంత్ర సేవలను రైతుల దరి చేర్చడంలో వ్యవసాయ శాఖ చొరవ చూపడం లేదు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం (ఆర్‌కేవీవై)లో క్రాప్ డైవర్షన్ ప్రోగ్రాం కాంపోనెంట్ కింద వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించడం ద్వారా సుస్థిర వ్యవసాయానికి ఆధునిక పరికరాల అందజేతకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలిస్తోంది. అలాగే ప్రమోషన్ ఫర్ అగ్రికల్చర్ మెకనైజేషన్ ద్వారా కొత్తగా అభివృద్ధి చేసిన ఆటోమేటిక్, సెమీ ఆటోమేటిక్ యంత్రాల కొనుగోలుకు కేంద్రం ఆర్థిక సహాయం చేస్తోంది. ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ సర్వీస్ ఫర్ అగ్రికల్చర్ మిషనరీ కింద విత్తనం నాటిన దగ్గర నుంచి పంట కోత వరకు వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు సృష్టించడం, సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ కింద సన్నచిన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లను అందించడం, నిరుద్యోగులైన యువ రైతులకు, రైతులకు ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే స్కీమ్ ఫర్ ట్రైనింగ్ అండ్ డెమాన్‌స్ట్రేషన్ ఆన్ అడ్వాన్స్‌డ్ అగ్రికల్చర్ మిషనరీ పథకాలు న్నాయి. నేల-నీరు సంరక్షణ పథకంలో నదీ పరివాహక ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ పథకాలను అమలు చేసి, నేలలో తేమ శాతాన్ని పెంచి, భూసారం, భూ వినియోగం పెంచడంలో ప్రపంచబ్యాంకు సహాయంతో నూరు శాతం సబ్సిడీ లభించే సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ పథకాన్ని ఉపయోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే విమర్శలున్నాయి. నీటి వనరులున్నచోట వ్యవసాయ, ఉద్యాన పంటలకు మైక్రో ఇరిగేషన్ ద్వారా పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్లు, ఫాగర్లను ఉపయోగించి, పంట దిగుబడి, నాణ్యత పెంచి, ఎరువుల వినియోగం తగ్గించే కార్యక్రమానికి ఈ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై రైతులు పెదవివిరుస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో పరిమాణాత్మక నష్టాలను తగ్గించి, మార్కెటింగ్‌కు అనువైన, నిల్వ సామర్థ్యాన్ని పెంచే పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ కూడా ఆశించిన రీతిలో సద్వినియోగం కాలేదని చెప్తున్నారు. ఎందుకూ కొరగాని ప్రాంతాల్లో గోదాములు కడుతున్నామంటూ ప్రభుత్వం నిధుల్ని వృథా చేసిందన్న విమర్శలు ఉన్నాయి.

ఇదేనా.. మార్కెట్ జోక్యం?!

- ఎమ్మెస్పీకి సేకరించింది నామమాత్రమే
- కోత లెక్కువ.. కొనుగోలు తక్కువ
- రైతన్నకు దక్కని మద్దతు ధర

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రైతు ఏ దశలోనూ నష్టపోకుండా, విత్తనం నుంచి విక్రయం వరకు చేయి పట్టుకుని నడిపిస్తామన్న సీఎం జగన్ మాటలు ఆచరణలో నీట మూటలవుతున్నాయి. పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు అమలు కాక, గిట్టుబాటు ధర రాక రైతులు అలువ సొలువుగా అమ్ముకోవాల్సి వస్తున్నా.. ప్రభుత్వం ఏమీ పట్టనట్లు ఉంటోంది. మార్కెట్‌లో పంట ఉత్పత్తుల ధరలు తగ్గినప్పుడు రైతు నష్టపోకుండా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రకటించిన జగన్ సర్కార్.. నాలుగున్నరేళ్లలో నామమాత్రంగానే కొనుగోలు చేసింది. ఏటా రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్న వైసీపీ ప్రభుత్వం.. మద్దతు ధరకు కొనుగోలు చేసిన ఉత్పత్తుల విలువ రూ.2,204కోట్లు మాత్రమే. 2019 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు అరటి, బత్తాయి(చీని), ఉల్లి, టమాట, పత్తి, శనగలు కలిపి 1,28,730 మంది రైతుల నుంచి 4,56,720 టన్నులను మాత్రమే ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ జోక్యం కింద రూ.115 కోట్లతో 76వేల క్వింటాళ్ల శనగలను మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించింది. రాయలసీమలో విరివిగా పండించే బత్తాయిని కేవలం 436మంది రైతుల నుంచి రూ. 5.23 కోట్లకు 4,100 టన్నులు కొనుగోలు చేసింది. సీమతోపా టు కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని అరటిని సుమా రు వెయ్యి మంది రైతుల నుంచి 12వేల టన్నులను రూ.6.62 కోట్లకు కొనుగోలు చేసింది. నాలుగున్నరేళ్లలో కేవలం 9,462 క్వింటాళ్ల ఉల్లిని రూ.69.09 కోట్లకు సేకరించారు. రూ.19.38 కోట్లతో 3,892 క్వింటాళ్ల టమాటాను కొనుగోలు చేసి రైతుబజార్లలో విక్రయించారు. అరటి, ఉల్లి, టమాటాలను మార్కెట్‌లో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నా.. రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా, అమలు కావట్లేదు. వ్యాపారులు, మధ్య దళారీలు ఇచ్చే ధరకు రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది.

తెలంగాణ సీఎం వద్దకు ఏపీ లారీ యజమానులు!

- కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల కోసం విజ్ఞప్తి చేసే యోచన
- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని జగన్ ప్రభుత్వం
- టీ-ప్రభుత్వం నుంచైనా ప్రయత్నించేందుకు నిర్ణయం
- రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలని ఏపీ లారీ యజమానుల సంఘం భావిస్తోంది. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి రెండు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల అంశంపై ఏపీ లారీ యజమానుల సంఘం ప్రయత్నిస్తోంది. ఏపీ రవాణా శాఖ ఉన్నతాధికారులతో కొంతకాలంగా దీనిపై సంప్రదింపులు చేస్తుంటే.. ఇది మనం ఒక్కరం తీసుకునే నిర్ణయం కాదని, తెలంగాణ నుంచి కూడా ఆమోదం రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా.. అధికారులు ఆ దిశగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం లారీ యజమానుల సంఘం ప్రయత్నించినా చాలా కాలంగా అపాయింట్‌మెంట్ లభించలేదు. దీంతో ప్రస్తుతం రవాణా రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవాలని ఏపీ లారీ యజమానుల సంఘం భావిస్తోంది. అపాయింట్‌మెంట్ తీసుకుని.. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల అంశాన్ని ప్రస్తావించాలని యోచిస్తోంది. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల వల్ల రెండు రాష్ట్రాల లారీ యజమానులకు ఆర్థికంగా వెసులుబాటుతోపాటు, రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు గణనీయంగా ఆదాయం కూడా పెరుగుతుంది. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లతో రెండు రాష్ట్రాలలో మాత్రమే లారీలను నడిపేందుకు అనుమతి ఉంటుంది. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు లేకపోవటంతో.. రెండు రాష్ట్రాలలోనే అయినప్పటికీ నేషనల్ పర్మిట్ మీద లారీలను నడపాల్సి వస్తోంది. దీనివల్ల లారీ యజమానుల మీద అధిక భారం పడుతోంది. అనేక రాష్ట్రాలకు రవాణా చేసే వారికి నేషనల్ పర్మిట్ ఉపయోగపడుతుంది. అందుకే రెండు రాష్ట్రాల మధ్య నడిచే లారీలకు కౌంటర్ సిగ్నేచర్ పర్మిట కోసం ప్రయత్నిస్తున్నారు. అలాగే, నేషనల్ పర్మిట్ వల్ల వచ్చే ఆదాయం ఆ పర్మిట్ పరిధిలోని రాష్ట్రాలన్నింటికీ దామాషా ప్రకారం వెళుతుంది. అదే కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల వల్ల పూర్తి ఆదాయం రెండు రాష్ట్రాలకే వస్తుంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సహకరించాల్సిందిగా ఏపీ లారీ యజమానుల సంఘం గత నాలుగున్నరేళ్లుగా జగన్ ప్రభుత్వాన్ని కోరుతున్నా అర్థం చేసుకోవటం లేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వం నుంచైనా ప్రతిపాదన తీసుకువస్తే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

ఆ మహిళలు ఎప్పటికీ నా మనసులో ఉండిపోతారు

- తెలుగు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: భువనేశ్వరి



ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న భువనేశ్వరి

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): యాభై మూడు రోజుల పాటు టీడీపీ అధినేత చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు ఆయనకు అండగా నిలబడిన తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కేసులకు భయపడకుండా రెండు తెలుగు రాష్ట్రాల మహిళలు చంద్రబాబుకు మద్దతుగా నిలిచారని ఆమె తెలిపారు. ఆ మహిళలంతా జీవితాంతం తన మనసులో ఉండిపోతారన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నారా భువనేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో డిజిటల్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఎన్ని సమస్యలున్నా అందరూ చిరునవ్వుతో, సంతోషంగా ఉండాలి. అప్పుడే లక్ష్యాలను సాధించగలుగుతాం. ప్రతిరోజూ నూతన సంవత్సరంగానే భావించాలి" అన్నారు.

మరబోట్ల నుంచి మత్స్యకారులను కాపాడతా

త్వరలో ఏపీ, తమిళనాడు అధికారులతో సమావేశం

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా



పల్లెపాలెంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాలా

కొత్తపట్నం (ఒంగోలు నగరం), జనవరి1: 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మత్స్యకారులకు తమిళనాడు మరబోట్ల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపై శాశ్వత పరిష్కారం చూపిస్తా.. ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తా' అని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖామంత్రి పర్షోత్తమ్ రూపాలా అన్నారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పల్లెపాలెంలో సోమవారం రాత్రి జరిగిన సాగర పరిక్రమ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులు పలు సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తమిళనాడుకు చెందిన వారు మరబోట్లతో తీరం వెంటే వేట సాగిస్తూ తమకు నష్టం చేస్తున్నారని, తమపై దాడులకు దిగుతున్నారని, వలలు తెంచి వేస్తూ నష్టపరుస్తున్నారని తెలిపారు. దీనిపై మంత్రి స్పందించారు. ఈ విషయం ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని, త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై ప్రస్తుతం ఇస్తున్న బోటు, వలలు, ఇంజన్‌లను యూనిట్‌గా కాకుండా విడివిడిగా కూడా అందిస్తామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ కార్డు రైతులకే కాకుండా మత్స్యకారులకు కూడా అమలు చేస్తున్నామన్నారు. ఆక్వా రైతులు పండిస్తున్న రొయ్యలకు గిట్టుబాటు ధర, రొయ్యల చెరువులకు వ్యాధులు వ్యాపించకుండా నాణ్యమైన సీడ్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని ఆయన అన్నారు. కేంద్రమంత్రితో పాటు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, జాయింట్ సెక్రటరీ నీతు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులకు శిక్షలు తగ్గించాలి

నాలుగు రాష్ట్రాల్లో డ్రైవర్ల ఆందోళన.. నిలిచిన ఆయిల్ ట్యాంకర్లు

భోపాల్, రాయ్‌పూర్, నాసిక్, జనవరి1: ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని ఓ నిబంధనను వ్యతిరేకిస్తూ మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్రల్లో సోమవారం డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా ఈ ఆందోళనలో పాల్గొనడంతో చమురుకు కొరత ఏర్పడుతుందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారతీయ న్యాయ సంహితలో హిట్ అండ్ రన్ కేసులకు విధించిన శిక్షలు కఠినంగా ఉన్నాయని, వాటిని సవరించాలని కోరుతూ డ్రైవర్లు ఉద్యమబాట పట్టారు. హిట్ అండ్ రన్ రూపంలో ప్రమాదాలకు పాల్పడితే పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 లక్షల జరిమానా విధిస్తారు. నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారకులైనా, జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పోలీసులకుగానీ, ప్రభుత్వ అధికారులకుగానీ చెప్పకపోయినా ఈ నేరం కింద పరిగణించి శిక్ష వేశారు. ఈ జరిమానా, శిక్షలు భరించలేని భారమని డ్రైవర్లు అంటున్నారు. ఇదిలా ఉండగా, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియంలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలయింది. వీటిలో చాలా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ న్యాయవాది విశాల్ తివారీ ఈ పిల్‌ను దాఖలు చేశారు.

మణిపూర్‌లో మళ్లీ హింస.. నలుగురి మృతి

ఇంఫాల్, జనవరి 1: మణిపూర్‌లో సోమవారం మళ్లీ హింసాత్మక సంఘటనలు జరిగాయి. సాయంత్రం తౌబాల్ జిల్లా లిలోంగ్‌లో జరిగిన ఘర్షణల్లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో నలుగురు మరణించారు. దాంతో తౌబాల్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో మళ్లీ కర్ఫ్యూ విధించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కర్ఫ్యూ సమయాల్లో ఇచ్చిన వెసులుబాట్లను రద్దు చేశారు. మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ శాంతి భద్రతను కాపాడాలని ప్రజలను కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రిటన్‌లో విద్యార్థి వీసాలు మరింత కఠినం

లండన్, జనవరి 1: విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడంలో బ్రిటన్ మరింత కఠినంగా వ్యవహరించనుంది. చదువుల నిమిత్తం వచ్చేవారు తమ కుటుంబ సభ్యుల్ని, ఆశ్రితుల్ని ఎవర్నీ తీసుకురాకూడదని స్పష్టం చేసింది. పీజీ రీసెర్చి చేసేవారు, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందేవారికి దీని నుంచి మినహాయింపు ఉంది. భారతీయ విద్యార్థులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. సోమవారం నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. అక్రమ వలసలను నివారించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని బ్రిటన్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ ఉగ్రవాది: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 1: గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్‌ను కేంద్రప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. నిషేధిత ఖలీస్థానీ ఉగ్రసంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో కలిసి పనిచేస్తున్న గోల్డీ బ్రార్‌ను ఉపా చట్టం కింద ఉగ్రవాదిగా ప్రకటిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సోమవారం నోటీసు జారీ చేసింది. "గోల్డీ బ్రార్‌కు సీమాంతర ఉగ్ర సంస్థలు మద్దతు ఇస్తున్నాయి. అతను అనేక హత్యల్లో భాగస్వామిగా ఉన్నాడు" అని కేంద్ర హోంశాఖ వివరించింది. గోల్డీ బ్రార్, అతని అనుచరులు పంజాబ్‌లో మతపరమైన అల్లర్లకు కుట్రలు పన్నుతున్నారని కూడా తెలిపింది. కెనడాలో నివసిస్తున్న గోల్డీ బ్రార్.. 2022లో జరిగిన పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకు తానే బాధ్యుడినని ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 2 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కాప్ 28
క్లయిమేట్ సమ్మిట్

యునైటెడ్ నేషన్స్ క్లయిమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్/ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ 28(కాప్ 28) దుబాయ్‌లోని ఎక్స్‌పో సిటీలో ఈ ఏడాది నవంబరు 30 నుంచి డిసెంబరు 12 వరకూ జరిగింది. 197 సభ్యదేశాలకు తోడు యురోపియన్ యూనియన్ కూటమి ప్రతినిధులు ఈ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కాప్ అంటే ఏమిటి? కాప్ 28 ప్రత్యేకతలు, వైఫల్యాల గురించి తెలుసుకుందాం.

1992లో రియో ఎర్త్ సమ్మిట్(ధరిత్రీ సమావేశం)లో మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని తగ్గించేందుకు, హరిత గృహ వాయు ఉద్గారాలను నియంత్రించే ఉద్దేశంతో 154 దేశాలు ఒక బహుళపక్ష ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనినే యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లయిమేట్ ఛేంజ్(యూఎన్ఎఫ్‌సీసీసీ) అంటారు.

ఈ ఒప్పందం ప్రకారం 1995 నుంచి ఏటా ఆయా దేశాలు సమీక్షా సమావేశాలు జరుపుతున్నాయి. వీటినే కాప్(కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) సమావేశాలు అంటారు. ఆ తరవాతి కాలంలో 2015లో జరిపిన కాప్-21 సమావేశంలో చేసుకున్న ప్యారిస్ ఒప్పందం ప్రకారం ఈ శతాబ్దం చివరి నాటికి, పారిశ్రామిక విప్లవ ముందుకాలం నాటి కంటే ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ మించకుండా ఉండేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలను ఈ సమావేశాల్లో సమీక్షించాలి.

సమావేశ విజయం, వైఫల్యాలు: ఈ కాప్-28 సమావేశంలో గతంలో లేని కొన్ని చొరవలు, కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని ఈ సమావేశ విజయాలుగా పేర్కొనవచ్చు. అవి:

1. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల దిశగా పరివర్తన: శిలాజ ఇంధనాల వినియోగం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం. అయితే ప్రపంచ ఉష్ణోగ్రతల తగ్గింపు దిశగా పనిచేస్తున్న కాప్ సమావేశాలు ఇంతవరకూ శిలాజ ఇంధనాల గురించి ఎటువంటి చర్చనూ ప్రారంభించలేదు. ఈ సమావేశంలో తొలిసారిగా ఆ ప్రస్తావన వచ్చింది. శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా వైదొలగుతూ 2050 నాటికి నికర సున్నా స్థాయి శిలాజ ఇంధన వినియోగం సాధించాలని నిర్ణయం తీసుకున్నాయి.

> **శిలాజ ఇంధనాల వినియోగం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం. అయితే ప్రపంచ ఉష్ణోగ్రతల తగ్గింపు దిశగా పనిచేస్తున్న కాప్ సమావేశాలు ఇంతవరకూ శిలాజ ఇంధనాల గురించి ఎటువంటి చర్చనూ ప్రారంభించలేదు. ఈ సమావేశంలో తొలిసారిగా ఆ ప్రస్తావన వచ్చింది. శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా వైదొలగుతూ 2050 నాటికి నికర సున్నా స్థాయి శిలాజ ఇంధన వినియోగం సాధించాలని నిర్ణయం తీసుకున్నాయి.**

2. పునరుత్పాదక శక్తి వనరుల స్థాపక సామర్థ్యం మూడింతలు పెంచడం: ఈ సమావేశంలో చేసుకున్న పునరుత్పాదక, శక్తి సామర్థ్య ప్రతిజ్ఞ ప్రకారం 2030 నాటికి పునరుత్పాదక శక్తి వనరులను ప్రపంచవ్యాప్త స్థాపితశక్తి సామర్థ్యాన్ని పెంచేందుకు సభ్యదేశాలు కృషిచేయాలి. అంటే 2030 నాటికి పునరుత్పాదక శక్తివనరుల స్థాపితశక్తి సామర్థ్యం కనీసం 11000 జీడబ్ల్యూ పెంచాల్సి ఉంటుంది. వార్షిక ప్రపంచ సగటు శక్తి సామర్థ్యం రేటు 2 నుంచి 4 శాతం వరకు ప్రతి సంవత్సరం 2030 వరకూ పెంచుకుంటూ పోవాలి. ఈ చర్యల ద్వారా ప్రస్తుతకాలం నుంచి 2030 మధ్య ఉత్పత్తి అయ్యే ఏడు బిలియన్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను అరికట్టగలం.

3. బొగ్గు వినియోగ తగ్గింపు: సహజ వాయువు, చమురుతోపాటు బొగ్గు కూడా ఒక శిలాజ ఇంధనమే. కానీ ఈ సమావేశంలో కేవలం బొగ్గు వినియోగ తగ్గింపునకు సంబంధించి మాత్రమే ప్రత్యేక ప్రస్తావన చేశారు.(గతంలో 2021లోనే గ్లాస్గో సమావేశంలో బొగ్గు వినియోగానికి సంబంధించి నిర్ణయం తీసుకోవడమే దీనికి కారణం). కార్బన్ క్యాప్చర్, స్టోరేజ్ ఏర్పాటు లేని కొత్త బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయరాదని తొలుత ఈ సమావేశంలో నిర్ణయించారు. అయితే భారతదేశంలో 75.1% విద్యుత్ అవసరాలకు బొగ్గుపైనే ఆధారపడుతున్నాం. అదేవిధంగా చైనా, దక్షిణాఫ్రికా వంటి దేశాలు సైతం అత్యధికంగా బొగ్గుపైనే తమ శక్తి అవసరాలకు ఆధారపడుతున్న దృష్ట్యా ఈ ప్రతిపాదనను భారత్‌తోపాటు ఆయా దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి. అందువల్ల గ్లాస్గోలో ప్రతిపాదించిన దశలవారీ విరమణ విధానంలో బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ రావాలని నిర్ణయించారు.

4. మీథేన్ వాయు ఉద్గారాల నియంత్రణ: హరిత గృహ వాయువుల్లో కార్బన్‌డైయాక్సైడ్‌తోపాటు మీథేన్ కూడా అత్యధికంగా ప్రభావం చూపుతున్న వాయువు. మొత్తం ఉద్గారాల్లో మీథేన్ శాతం 25%. అయినప్పటికీ ఇది కార్బన్‌డైయాక్సైడ్ కంటే 80% అధికంగా గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతోంది. కాబట్టి ఈ వాయువుపై నియంత్రణ అనేది గ్లోబల్ వార్మింగ్ తగ్గింపునకు భారీగా సహకరిస్తోంది. అయితే మీథేన్ వాయువు అధికంగా వ్యవసాయం, పశువుల ద్వారానే విడుదల అవుతుంది. భారత్ వంటి వ్యవసాయాధార దేశాల్లో మీథేన్‌పై నియంత్రణ అనేది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. కాబట్టి భారత్ వంటి వ్యవసాయ ప్రాధాన్య దేశాలు వ్యతిరేకించడంతో ఈ సమావేశం ఎలాంటి నిర్ణయాలు తీసుకోపోయింది. కేవలం మీథేన్‌ను నియంత్రించాలని మాత్రమే సంకల్పించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.

5. లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్: తమ ఉద్గారాలు అతి తక్కువగా ఉన్నప్పటికీ, వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర విపత్తులకు లోనైన పేద దేశాల, దీవుల పరిరక్షణకు నిధులు సమకూర్చే నిమిత్తం 'లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్'ను ఏర్పాటుచేయాలని కాప్-27లో నిర్ణయించారు. కానీ ఆ దిశగా చర్యలు సాధ్యపడలేదు.

ఉద్గారాలను అధికస్థాయిలో విడుదల చేస్తున్న అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల ఆర్థిక సౌజన్యంతో ఈ నిధికి ఆర్థిక వనరులు సమకూరుతాయి. కాప్-28 సమావేశంలో తొలిరోజే లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్‌ను ఏర్పాటుచేసి, సమావేశం ముగిసే నాటికి వివిధ దేశాలు ప్రకటించిన నిధులను రాబట్టింది. ఈవిధంగా మొత్తం 800 మిలియన్ డాలర్లు సమకూరాయి.

6. గ్లోబల్ గోల్ అడాప్టేషన్: దేశాల వారీగా ఉద్గారాల తగ్గింపు లక్ష్యంలో చేరనున్న స్థాయులను వివిధ సూచికల ఆధారంగా సమీక్షించే ఈ పద్ధతిని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. దేశాలు స్థానిక స్థాయిలో కలిగి ఉండాల్సిన లక్ష్యాలపై ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత నిబద్ధతతో ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుంది. ఈవిధంగా గ్లోస్గో సమావేశంలో ఫ్రేమ్‌వర్క్ రూపకల్పన, విధివిధానాల నిర్ణయానికి రెండు సంవత్సరాల వ్యవధి గల వర్క్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేశారు. ఈ వర్క్ ప్రోగ్రామ్ ప్రపంచ దేశాలన్నింటికీ కొన్ని ముఖ్య సార్వజనీన లక్ష్యాలను గుర్తించింది. అవి వాతావరణ సంబంధిత నీటి కొరతను తగ్గించడం, వ్యవసాయ, ఆరోగ్య రంగాల పరంగా వాతావరణ ప్రతికూలతలను ఎదుర్కోవడం వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. ఈ ఫ్రేమ్‌వర్క్‌ను కాప్-28 ఆమోదించడం ద్వారా క్షేత్ర స్థాయిలో దేశాల వారీగా లక్ష్యాల సాధనకు మార్గం ఏర్పడింది.

7. గ్లోబల్ కూలింగ్ ప్లెడ్జ్: శీతలీకరణకు సంబంధించిన ఉద్గారాల తగ్గింపునకు కలిసి పనిచేయడానికి 66 దేశాలు ఒక తాటిపైకి వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా అన్నిరకాల శీతలీకరణ సంబంధిత ఉద్గారాలను 2050 నాటికి 2022 స్థాయులతో పోల్చితే కనీసం 68% తగ్గింపునకు కృషి చేయాలని నిర్ణయించారు.

8. అణు విద్యుత్ సామర్థ్యం మూడింతల పెంపు: 2050 నాటికి ప్రపంచ అణు విద్యుత్ ఉత్పత్తిని మూడింతలు చేయాలని 22 దేశాలు కలిసి ఒక అంగీకారానికి వచ్చాయి.

9. ఛాంప్ ఇనీషియేటివ్: వాతావరణ మార్పులకు సంబంధించి ఇనీషియేటివ్ కాప్-28 వేదికగా తీసుకున్నారు. వాతావరణ పరిరక్షణ వ్యూహాలకు సంబంధించిన ప్లానింగ్, నిధుల సమీకరణ, కార్యాచరణ, పర్యవేక్షణపరమైన సమర్థ విధానాలకు సంబంధించి పరస్పర సహకారానికి చేసిన ఏర్పాటు ఇది.

10. క్లయిమేట్ ఫినాన్స్: యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రకారం న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ ఫర్ క్లయిమేట్ ఫినాన్స్‌కు సంపన్న దేశాలు 2025లో 500 బిలియన్ డాలర్లు సమకూర్చాల్సి ఉంది. దీనిలో 250 బిలియన్ డాలర్లు మిటిగేషన్(నష్ట నివారణ), 100 బిలియన్ డాలర్లను ఆడాప్షన్(స్వీకరణ), 150 బిలియన్ డాలర్లను లాస్ అండ్ డ్యామేజ్ కోసం వినియోగిస్తారు. ఈవిధంగా వాతావరణ మార్పులను అరికట్టడానికి క్లయిమేట్ ఫినాన్స్ వెచ్చింపుల ద్వారా కృషి చేయనున్నారు.

లోటుపాట్లు

1. శిలాజ ఇంధన వినియోగం తగ్గింపుపై నిర్దిష్ట లక్ష్యాలు, కాల అవధులపరంగా ఎలాంటి నిర్ణయాలు లేవు. ప్రతిపాదిత 'ఫేజ్-ఔట్'(ఉపహరణ) బదులు కేవలం ట్రాన్సిషనింగ్ అవే(క్రమంగా వైదొలగడం) అనే పదాన్ని వినియోగించారు. తద్వారా లక్ష్యం నీరు కారుతుందని, ఈ పోడకతో 2050 నాటికి శిలాజ ఇంధనాల వినియోగం నికర శూన్యానికి తీసుకురావడం సాధ్యం కాదని కొన్ని దేశాలు నిరసిస్తున్నాయి.
2. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు లక్ష్యాలనైతే నిర్దేశించారు కానీ వాటి సాధనకు ఎలాంటి హామీలు తీసుకోలేదు.
3. శిలాజ ఇంధన కట్టడిలో కేవలం బొగ్గుకే ప్రాధాన్యం ఇవ్వడం, 60 శాతం కర్బన ఉద్గారాలకు కారణమవుతున్న ఇతర శిలాజ ఇంధనాలైన చమురు, సహజ వాయువులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం విమర్శలకు దారితీసింది. బొగ్గు దశలవారీ నియంత్రణ ఏవిధంగా సాధ్యమవుతుందో, ఏ స్థాయి నుంచి మరే స్థాయికి తగ్గించాలో అనే అంశాలపై స్పష్టమైన విధానాలు లేకపోవడంతో దీని సాధనకు ఆదిలోనే హంసపాదు పడింది. అదేవిధంగా మీథేన్ విషయంలోనూ ఇదే సమస్య ఏర్పడుతోంది.
4. లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్‌కు ఏటా 400 బిలియన్ డాలర్లు సమకూరితేగానీ పేద దేశాలకు సంభవిస్తున్న నష్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని అంచనా. అయితే ఈ సమావేశంలో ధనిక దేశాలు హామీపడిన మొత్తం కేవలం 700 మిలియన్ డాలర్లనే అవి సమకూర్చాయి. ఇది ప్రస్తుతం ఉన్న అవసరతలో కేవలం 0.27 మాత్రమే. కాబట్టి ధనిక దేశాలు చేస్తున్న పర్యావరణ హనన స్థాయిలోనే అవి సమకూర్చే నిధులు కూడా ఉండాలనే వాదన వినిపిస్తోంది.

అయితే ఒక అతిపెద్ద చమురు దేశంలో, ప్రపంచంలోనే అతిపెద్ద చమురు సంస్థ అధినేత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శిలాజ ఇంధనాల కట్టడికి, పునరుత్పాదక ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం పెంపునకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాలు ఆశావాహ భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే ఈ ఏడాదిలో 80 రోజులకు పైగా పారిశ్రామిక పూర్వయుగ స్థాయి కన్నా 1.5 డిగ్రీల సెల్సియస్ పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2023 సంవత్సరాన్ని అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో జరిగిన కాప్-28 సమావేశంలో 2030 వరకు సాధించాల్సిన లక్ష్యాల పరంగా తీసుకున్న విధాన నిర్ణయాలు, నిర్ణయించుకున్న లక్ష్యాలను చేరడానికి పూర్తిస్థాయిలో సహకరించవన్నది జగమెరిగిన సత్యం. అయితే దేశాల పరంగా వైయక్తికంగా చూపించే నిబద్ధత మాత్రమే ప్రస్తుత తరుణంలో పర్యావరణ పరిరక్షణకు బాసట కాగలదని నిపుణుల భావన.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

భారత్ చొరవలు

1. గ్రీన్ క్రెడిట్ ఇనీషియేటివ్: వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు దేశాలు స్వచ్ఛందంగా చేపట్టే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు అనుసంధానతను కలిగించే చొరవ ఇది. దీని కోసం ఈ కార్యక్రమంలో ఒక వెబ్ ప్లాట్‌ఫాంను కూడా ఏర్పాటు చేశారు. ఇది వివిధ దేశాలు పాటిస్తున్న అత్యుత్తమ విధానాలు, చేపట్టిన పాలసీలు, పర్యావరణ అనుకూల విధానాల గురించిన సమాచారానికి, సహకారానికి, విజ్ఞాన మార్పిడికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది.
ఈ ఇనీషియేటివ్‌లో భాగంగా నిరుపయోగంగా ఉన్న వ్యర్థ భూముల్లో, నదీ పరివాహక ప్రాంతాల వెంబడి చెట్ల పెంపకం ద్వారా అక్కడి ఆవరణ వ్యవస్థను పునరుజ్జీవింప చేయడం వంటి చర్యలకు గ్రీన్ క్రెడిట్‌లు జారీ చేస్తారు.

2. గ్లోబల్ రివర్ సిటీస్ అలయెన్స్: నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ ప్రాజెక్టులో భారత్ విస్తృత అనుభవం దృష్ట్యా 11 దేశాలు కాప్-28 వేదికగా తమ దేశాల్లోని నదీప్రాంత పట్టణాల అభివృద్ధికి భారత్ నేతృత్వంలో ఒక కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా 11 దేశాల్లోని 275కు పైగా నదీతీర పట్టణాలను పర్యావరణహితంగా తీర్చిదిద్దవచ్చు. నదీ పరిరక్షణ, సుస్థిర నీటి యాజమాన్యం, నదీ కేంద్రిత సుస్థిరాభివృద్ధి సంబంధిత పరస్పర సహకారం, విజ్ఞాన మార్పిడి ఈ దేశాల మధ్య ఏర్పడుతుంది. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మినిస్ట్రీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అర్బన్ అఫైర్స్ ఈ కూటమిని సెక్రటేరియెట్‌గా వ్యవహరిస్తుంది.

3. ఫేజ్-2 ఆఫ్ లీడర్‌షిప్ గ్రూప్ ఫర్ ఇండస్ట్రీ ట్రాన్సిషన్: సమ్మిళిత, విచక్షణాయుత పారిశ్రామిక పరివర్తనకు సంబంధించిన చొరవ ఇది. తక్కువ కర్బన ఉద్గారాలు గల సాంకేతికతలకు సంబంధించి పరస్పర సహకారం, సాంకేతికతల బదిలీ, పర్యావరణహిత పారిశ్రామికత వైపుగా మారడానికి అభివృద్ధి చెందుతోన్న దేశాలకు ఆర్థికంగా సహకరించడం వంటి అంశాలు ఈ చొరవలో భాగం.

4. క్వాడ్ క్లయిమేట్ వర్కింగ్ గ్రూప్ ఆన్ లోకలైజ్డ్ క్లయిమేట్ యాక్షన్: సుస్థిర జీవన విధానాన్ని అభివృద్ధి చేసేందుకు క్లయిమేట్ యాక్షన్ ప్లాన్స్‌లో స్థానిక కమ్యూనిటీలో - స్థానిక ప్రభుత్వాల తోడ్పాటును సమీకరించేందుకు చేపట్టిన చొరవ ఇది.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంట్రెన్స్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 19 సీట్లు ఉన్నాయి. పీహెచ్‌డీ 2023 జూలై సెషన్‌కు సంబంధించి 2023 సెప్టెంబరు 30 నాటికి ఖాళీగా ఉన్న 15 సీట్లను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయనున్నారు. 2023 జూలై సెషన్‌కు అప్లయ్ చేసుకున్న అభ్యర్థులు ప్రస్తుతం కొత్త ఈ-మెయిల్, పాస్‌వర్డ్‌లతో దరఖాస్తు చేసుకోవాలి.

విభాగాలు-సీట్లు

- **2024 జనవరి సెషన్ సీట్లు:** ఫిజిక్స్ 4, కెమిస్ట్రీ 6, సైకాలజీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 7
- **2023 జూలై సెషన్ సీట్లు:** ఫిజిక్స్ 4, ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 1, కెమిస్ట్రీ 3, బయోకెమిస్ట్రీ 1, శాంస్క్రిట్ స్టడీస్ 1, సైకాలజీ 1, కాగ్నిటివ్ సైన్స్ 1, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 2, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 1.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జనవరి 28
- **వెబ్‌సైట్:** acad.uohyd.ac.in
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జనవరి 24 నుంచి
- **ఎగ్జామ్ సెంటర్:** యూఓహెచ్ క్యాంపస్



ఐబీఏలో పీజీ డిప్లొమా

బెంగళూరులోని ఇండస్ బిజినెస్ అకాడమీ(ఐబీఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ, ఎన్‌బీఏ, ఐఏసీబీఈ-యూఎస్ఏ సంస్థల గుర్తింపు ఉంది. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ కోర్సు. ఈ ప్రోగ్రామ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్స్ ఇస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది.

స్పెషలైజేషన్లు: మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఈ-బిజినెస్, రిటైల్, ఆపరేషన్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, అంత్రప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2024/ఎన్‌మ్యాట్ 2023/మ్యాట్ (2023 సెప్టెంబరు/డిసెంబరు; 2024 ఫిబ్రవరి/మే)/ఏటీఎంఏ 2024/జీమ్యాట్ (2022 సెప్టెంబరు తరవాత)/జీఆర్ఈ (2022 సెప్టెంబరు తరవాత)/గేట్ (2022-23) అర్హత పొంది ఉండాలి.

వెయిటేజీ: జాతీయ పరీక్ష స్కోర్‌కు 20 మార్కులు, అకడమిక్ ప్రతిభకు 35 మార్కులు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 మార్కులు, గ్రూప్ డిస్కషన్-పర్సనల్ ఇంటర్వ్యూకు 35 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 6
- **వెబ్‌సైట్:** www.iba.ac.in

లిటిల్



ఏడో సంచి

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఓ పిరికివాడు ఉండేవాడు. అడవిలో వెళ్తుంటే 'ఇటు రమ్ము' అంటూ కేక వినపడింది. చెట్టు మీద ఉండేది దెయ్యం అయితే ఇబ్బందే కదా! అని వెనక్కి చూడకుండా వెళ్లిపోతుంటే.. మళ్లీ రమ్మని కబురు వచ్చింది. ఆ చెట్టు దగ్గరకు వెళ్లి చూసాడు. 'నీకు డబ్బు కావాలి కదా!' అన్నాడు. అవును అన్నాడు ఈ పిరికోడు. 'ఏడు సంచి నింపాలి' అన్నది ఆ చెట్టుమీద స్వరం. 'అంటే..' అన్నాడు పిరికివాడు. 'ముందు నువ్వు ఇంటికి వెళ్లు. అక్కడ ఏడు సంచులు ఉంటాయి. ఆరింటిలో వరహాలుంటాయి. ఏడో సంచి కూడా చూడు' అన్నది ఆ స్వరం. ఆ మాట వింటూనె ఇంటికి పరుగు తీశాడు పిరికివాడు.

ఇంటికి వెళ్లి తలుపు తీసిన వెంటనే ఏడు సంచులున్నాయి. అరు సంచుల్లో వరహాలు. అవి చూస్తూనే ఆశ కలిగింది. ధనవంతుడు అయ్యానని సంతోషపడ్డాడు. వెంటనే ఏడో సంచి చూశాడు. అందులో చిన్న చెక్క ముక్క ఉంది. ఈ సంచిని నింపితే.. ఆరు సంచులూ నీవే అని దానిపై రాసి ఉంది. వెంటనే ఇది నిజమని నమ్మాడు. ఏమాత్రం ఆలోచించకుండా ఆ సంచిని నింపాలనుకున్నాడు. తన ఇంట్లో బంగారం, ధనంతో వరహాలు కొని ఏడో సంచిలో వేశాడు. అయితే అది నిండలేదు. పైగా ఇతనికి ఆందోళన కలిగింది.




అప్పుచేసి మరీ వరహాలు కొన్నా ఆ సంచి నిండలేదు. దీంతో రాజుగారి దగ్గరకు వెళ్లి అయ్యా. నేను మీకు క్షవరం తీస్తున్నాను. పది వరహాలకు పని చేయలేను అన్నాడు. ఆయన ఇరవై వరహాల జీతం పెంచాడు. అయినా ఈ పిరికోడికి బాధ. సంచులు దొరకవేమోనని బాధ వెంటాడేది. రాజుగారు ఇచ్చిన వరహాలను వేసినా నిండలేదు. ఆ ఏడో సంచి నిండుతుందా? అనే దాని కంటే ఈ ఆరు సంచులు మాయమైతాయేమోననే భయం పట్టి పీడించింది. నిద్ర కూడా సరిగా లేదు.

ఒక రోజు రాజుగారి దగ్గరకు పోయాడు. పిరికివాడి ఆందోళన చూసి రాజుగారు 'ఏమైందని' అడిగారు. ఏమీ లేదన్నాడు పిరికోడు. ఆ ఏడో సంచి నిండని వాడే నీలా ఉంటాడు అన్నాడు. పిరికివాడికి భయం వేసింది. మీకెలా తెలుసనే ఆశ్చర్యం కలిగింది. పిచ్చోడా.. ఆ చెట్టు మీద యక్షుడు ఉన్నాడు. అతడు మాయావి. నాకూ ఇలా ఏడు సంచుల నాటకం ఆడాడు. అయితే మొదటిరోజే నాకు కాదని.. తన చెట్టు కింద ఆరు సంచులు, ఏడో ఖాళీ సంచి ఇచ్చాను అన్నాడు. వెంటనే భయం పోయింది పిరికివాడికి. నేనేమి చేయాలి? అనడిగాడు. 'నువ్వు కూడా నాలానే వెళ్లి ఇదే మాట చెప్పు' అన్నాడు. వెంటనే పరిగెత్తుకుపోయి ఆరు వరహాల సంచులు నాకొద్దు. ఏడో సంచి నిండదు. కష్టం. ఈ పని చేయలేను అన్నాడు. సరేనన్నాడు. ఆరుసంచులతో పాటు ఏడో సంచి కూడా మాయం అవటంతో తను దాచుకున్న డబ్బు, వరహాలు పోయాయి. ఈ దుర్ఘటన పలుమార్లు తలచుకుంటూ బాధపడేవాడు. కేవలం అత్యాశనే తన కొంప ముంచిందని తెలుసుకున్నాడు.

10 తేడాలు గుర్తించండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 193

8							6	
	5							3
4		3	7			8		
		7			5	9	3	
		2	8		7	4		
	3	4	1			7		
		6			8	5		4
3							9	
	7							2

సుడోకు - 192 సమాధానం

8	7	6	2	1	9	3	4	5
5	3	9	6	7	4	1	8	2
4	1	2	5	8	3	6	9	7
7	6	5	1	4	8	2	3	9
9	8	3	7	2	6	5	1	4
1	2	4	3	9	5	8	7	6
2	5	1	4	3	7	9	6	8
6	4	8	9	5	1	7	2	3
3	9	7	8	6	2	4	5	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.